ప్రభాతనవ
SINGIDI తెలుగు దినపత్రిక
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
బుధవారం 8 జులై 2026 | సంపుటి: 1 సంచిక: 21 పేజీలు 12 వెల: 6.50
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar Adilabad

2008 వరుస బాంబు పేలుళ్ల కేసులో
## 38 మందికి ఉరి
గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు



**మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధింపు**
**ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు**
2



## మోడీకి ఇండోనేషియా అత్యున్నత పురస్కారం
భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఇండోనేసియా దేశం తమ అత్యున్నత పౌర పురస్కారమైన 'బింటాంగ్ ఆదిపూర్ణ రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేసియా'అవార్డును ప్రకటించింది. **న్యూఢిల్లీ (సింగిడి)**
2

# అందని ద్రాక్షలా పే స్కేలు...
# మారని మెప్మా జీ(తా)వితాలు
## జీవో అమలు కోసం సిబ్బంది ఎదురుచూపులు
' సెర్ప్'తో సమాన గుర్తింపు ఇవ్వాలని వేడుకోలు... ఏళ్ల తరబడి అదే వేతనాలు
కుటుంబ భారం మోయలేక అనేక తిప్పలు.. సర్కారు నుంచి స్పష్టమైన నిర్ణయం కోరుతున్న ఉద్యోగులు..!

*ఉద్యోగం అంటే కేవలం నెల జీతం మాత్రమే కాదు... ఒక కుటుంబానికి భరోసా... ఉద్యోగి చేసిన సేవకు దక్కే గుర్తింపు కూడా. కానీ అదే గుర్తింపు కోసం ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వస్తే..? ప్రభుత్వం జారీ చేసిన జీవో అమలు కోసం పదేపదే విజ్ఞప్తులు చేయాల్సి వస్తే..? తెలంగాణలో మెప్మ సిబ్బంది ఇప్పుడు ఇదే ప్రశ్నను లేవనెత్తుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రకటించిన పే స్కేల్ జీవో ఇప్పటికీ అమల్లోకి రాకపోవడంతో వేలాది మంది ఉద్యోగులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా తమ పరిసితి మాత్రం మారలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెర్ప్ సిబ్బందికి అమలవుతున్న విధానాలు తమకూ వర్తింపజేయాలని, సమాన పనికి సమాన వేతనం, సమాన గుర్తింపు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. పెరుగుతున్న జీవన వ్యయం, పనిభారం, ఆర్థిక ఇబ్బందుల మధ్య తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గురించి, పెండింగ్‌లో ఉన్న పే స్కేల్ జీవో అమలుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని మెప్మ సిబ్బంది కోరుతున్నారు.*

*–స్టేట్ బ్యూరో,జూన్ 7(సింగిడి)*



**పే స్కేల్ అమలుపై ఎదురుచూపులు..**
గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన వేతన జీవో అమల్లోకి వస్తుందని ఆశించిన ఉద్యోగులకు ఇప్పటికీ నిరాశే ఎదురవుతోందని వారు చెబుతున్నారు. జీవో ఉన్నప్పటికీ అమలులో పురోగతి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కీలక అధికారి వద్దే ఫైల్ నిలిచిపోయిందా..?**
మెప్మ సిబ్బంది పే స్కేల్ అమలుకు సంబంధించిన ఫైల్ గత ఆరు నెలలుగా ఓ కీలక అధికారి వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. దీనివల్ల జీవో అమలు ప్రక్రియ ముందుకు సాగడం లేదని ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ ఫైల్‌పై త్వరితగతిన నిర్ణయం తీసుకుని తదుపరి పరిపాలనా ప్రక్రియను పూర్తి చేయాలని సిబ్బంది కోరుతున్నారు. ఈ అంశంపై ప్రభుత్వం లేదా సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

**సెర్ప్‌తో సమాన విధానం కావాలంటూ విజ్ఞప్తి..**
సెర్ప్ సిబ్బందికి అమలవుతున్న విధానాల మాదిరిగానే తమకూ సమాన అవకాశాలు, వేతన విధానం కల్పించాలని మెప్మ ఉద్యోగులు కోరుతున్నారు. ఒకే తరహా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ తేడాలు ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

**కొరతలతో పెరుగుతున్న ఇబ్బందులు..**
తక్కువ సిబ్బందితో ఎక్కువ పనిభారం మోయాల్సి వస్తోందని ఉద్యోగులు చెబుతున్నారు. ఫీల్డ్ డ్యూటీలు, స్వయం సహాయక సంఘాల సమన్వయం, ప్రభుత్వ పథకాల అమలు వంటి బాధ్యతలు పెరుగుతున్నా, అవసరమైన మానవ వనరులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు.

**కుటుంబ పోషణ భారంగా మారిందంటున్న ఉద్యోగులు..**
ప్రస్తుత ధరల పరిస్థితుల్లో ప్రస్తుతం అందుతున్న వేతనంతో కుటుంబాన్ని నెట్టుకురావడం కష్టమవుతోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పే స్కేల్ అమలైతేనే ఆర్థికంగా కొంత ఊరట లభిస్తుందని భావిస్తున్నారు.

**స్పష్టమైన నిర్ణయం కోరుతున్న సిబ్బంది..**
పే స్కేల్ జీవో అమలుపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని, పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని మెప్మ ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. తమ సేవలను గుర్తించి సముచిత వేతనాలు, సమాన విధానం కల్పిస్తే మరింత సమర్థవంతంగా పని చేయగలమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.



## కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ
**కేసీఆర్ సరేనంటే..ఎంత సమయమైనా కేటాయిస్తాం**
**కేసీఆర్ వాదన సరైనదయితే ..ప్రాజెక్ట్ నిర్వహణ అప్పగిస్తాం**
**కాళేశ్వరం కమీషన్ల ప్రాజెక్ట్ అన్న సీఎం రేవంత్ రెడ్డి**
**నిపుణుల సలహాలు పక్కన పెట్టడంతోనే సమస్యలు**
2

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ సీఎం కేసీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. కేసీఆర్ ఎప్పుడు లెటర్ రాస్తే.. అప్పుడే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ పెడదామని, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ఎంత సమయం మాట్లాడాలనుకుంటే అంత సమయం ఇస్తామని స్పష్టం చేశారు.

**- హైదరాబాద్, జులై 7 (సింగిడి)**

## రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్ దిశగా అడుగులు
ప్రజలకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యం
**పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజేషన్**
**కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆన్‌లైన్‌లోనే జీతాలు**
**ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశాలు**
2

తెలంగాణ అభివృద్ధిలో
## మహిళలు, పిల్లలదే కీలక పాత్ర
**నాచారంలో బాలామృతం ప్లాంట్ ప్రారంభంలో సిఎం రేవంత్**

## ధరణి పోర్టల్‌తో భూ అక్రమాలు
సమగ్ర దర్యాప్తు దిశగా ప్రభుత్వం చర్యలు
**సిట్ వేసే యోచనలో ప్రభుత్వం**

**హైదరాబాద్, జులై 7 (సింగిడి):**
ధరణి పోర్టల్‌లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. భూ రికార్డులు, రిజిస్ట్రేషన్లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం విజిలెన్స్ విభాగం ద్వారా లేదా ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి విచారణ జరిపించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే వెలుగులోకి వస్తున్న అక్రమాలపై ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. భూమి యజమాని వేలిముద్ర, ఓటీపీ ధ్రువీకరణ లేకుండానే రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది. భద్రతా వ్యవస్థలను బైపాస్ చేస్తూ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లను వినియోగించి లావాదేవీలు నిర్వహించినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడిస్తోంది.






## వర్షాలకు వయనాడ్ అతలాకుతలం
కేరళంలో భారీ వర్షాలు
**కొండచరియలు విరిగిపడి ముగ్గురు మృతి**
**మట్టి దిబ్బల కింద పలువురిని కాపాడిన సిబ్బంది**
**సహాయక చర్యలకు అడ్డంకిగా మారిన వాతావరణం**
**వర్షాలపై సిఎం అత్యవసర భేటీ**
**వయనాడ్‌కు ఇద్దరు మంత్రులు**
2



## జేబులు, బూట్లల్లో కరెన్సీ
**70 సార్లు దొంగతనం..**
**చూసీచూడనట్లుగా అధికారులు**
**అయోధ్య చోరీలో కీలక ఆధారాలు సేకరణ**
**సిసి టివి ఫుటేజ్ ఆధారాలను సేకరించిన సిట్**
2

## సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గనులు
182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం
**సింగరేణికి రూ.75 వేల కోట్ల ఆదాయం**
**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి**

తాడిచర్ల-2 బొగ్గు గనుల్ని సింగరేణికి ఇవ్వడానికి ప్రధాని మోదీ అంగీకరించినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఆ బొగ్గు గనులకు సంబంధించి ఈ రోజే తాను సంతకం చేసినట్లు చెప్పారు. తాడిచర్ల-2లో 182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశముందన్నారు. మరో 40-50 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తి చేయొచ్చన్నారు.

**- న్యూఢిల్లీ, జులై 7 (సింగిడి)**


2

## కేంద్రానికి కృతజ్ఞతలు
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



## దక్షిణ కొరియాలో కొనసాగుతున్న లోకేశ్ పర్యటన
2
**వివిధ కంపెనీలతో పెట్టుబడులపై విస్తృతంగా చర్చలు**
**హ్యుందాయ్, మోబిస్ ఉన్నతస్థాయి ప్రతినిధులతో లోకేశ్ భేటీ**

## బిఎల్‌వోలను బెదిరిస్తున్న ఎంఐఎం
**సిఇవోకు ఫిర్యాదు చేసిన బిజెపి నేతలు**
2

## భూములు ఇచ్చిన రైతులకు 40 వేల కౌలు
పదేళ్లపాటు అమలు చేయాలని నిర్ణయం
**జనవరి 6లోగా రుణం తీసుకున్న వారికి రుణమాఫీ అమలు**
**ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరించని వారిపై భూసేకరణ కత్తి**
**ఇనాం భూముల కోసం దేవాదాయ శాఖకు రూ.159 కోట్లు చెల్లింపు**
**చంద్రబాబు అధ్యక్షతన 63వ సీఆర్డీఏ సమావేశంలో కీలక నిర్ణయాలు**



**అమరావతి, జులై 7 (సింగిడి):**
సీఆర్డీఏ సమావేశంలో ఏపీ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. 2024 జూన్ నుంచి భూములిచ్చిన వారికి రూ.40వేలు కౌలు ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. భూములు ఇచ్చినప్పటి నుంచి 10ఏళ్లపాటు ఇది అమలు కానుంది. గ్రామకంఠాల్లో భూమి కోల్పోతున్న వారికి ఏటా రూ.10వేలు ఇచ్చేందుకు అనుమతిని ఇచ్చింది. కొత్తగా పూలింగ్ జరిగే గ్రామాల రైతులకు రుణమాఫీ చేయాలని నిర్ణయించింది. ఈ ఏడాది జనవరి 6లోగా రుణం తీసుకున్న వారికి ఈ మాఫీ అమలవుతుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన 63వ సీఆర్డీఏ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రెండో దశ పూలింగ్‌లో భూములిచ్చిన రైతుల గురించి చర్చించారు. రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక ఏర్పాటు, మంత్రుల కమిటీ సిఫారసు మేరకు వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై చర్చించారు. ఇనాం భూముల కోసం దేవాదాయశాఖకు రూ.159 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అమరావతి 25 టౌన్‌షిప్‌ల్లో ఒక ఇంటర్నేషనల్ స్కూల్ ఉండేలా చూడాలని సీఎం దిశానిర్దేశం చేశారు.
2

## వేగంగా భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు



**నిర్ణీత సమయానికి జిఎంఆర్ సంస్థ నిర్మాణాలు**
**ప్రధాని చేతుల మీదుగా ఎయిర్‌పోర్ట్ ప్రారంభం**
**పనులపై సమీక్షించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు**
2

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
బుధవారం
8 జులై 2026

# సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గనులు

'ఇతర రాష్ట్రాల్లో సింగరేణి సంస్థ బొగ్గు వేలంలో పాల్గొనేలా చేస్తున్నాం. నైని కోల్ బ్లాకలో 340 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఇవి దాదాపు 30-35 ఏళ్లు సరిపోతాయి. నైని కోల్ బ్లాకలో ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి కోసం సింగరేణికి అవకాశం కల్పించాం. బొగ్గు ఉత్పత్తితో సింగరేణికి రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉంది. తాడిచర్ల -2 బొగ్గుగనులను సింగరేణికి ఇవ్వాలని గతంలో చాలా మంది సీఎంలు లేఖలు రాసినా ప్రయోజనం లేకపోయింది. తన వంతుగా సింగరేణికి అన్ని రకాలుగా అండగా ఉంటున్నా' అని కిషన్‌రెడ్డి తెలిపారు. దేశాభివృద్ధి విషయంలో సహకార సమాఖ్య విధానంతో అన్ని రాష్ట్రాలు కలిసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ సింగరేణి కోల్ కాలరీస్ లిమిటెడ్ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. 39 వర్కింగ్ మైన్స్‌లో 21 అండర్ గ్రౌండ్ మైన్స్, 18 ఓపెన్ కాస్ట్ మైన్స్ ఉన్నాయని.. సుమారు 6 నుంచి 8 జిల్లాల్లో సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయని అన్నారు. లక్షలాది ప్రజల గుండెచప్పుడు సింగరేణి అని వెల్లడించారు. సింగరేణికి సంబంధించిన మేజర్ మైనింగ్ ప్రాజెక్టుల ఎన్విరాన్మెంటల్, ఫారెస్ట్ క్లియరెన్స్‌లను వేగవంతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలోనూ సింగరేణి కార్మికులు భాగస్వాములయ్యారని తెలిపారు. కార్మికుల ధైర్యాన్ని తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరన్నారు. ఒడిశాలో నైనీ కోల్ బ్లాక సింగరేణికి వచ్చేలా కృషి చేసినట్లు తెలిపారు. సింగరేణి పురోగతికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణతో పాటుగా ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు గనుల వేలంలో పాల్గొనేలా సింగరేణి ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. నైనీ కోల్ బ్లాకలో సుమారు 340 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్స్ ఉన్నాయన్నారు. 30 నుంచి 35 సంవత్సరాలకు సరిపోయే బొగ్గు ఉందని తెలిపారు. ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం సింగరేణికి లభించిందని.. దీని వల్ల సింగరేణికి సుమారు రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉందన్నారు. సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గనులు కేటాయించామని కిషన్ రెడ్డి తెలిపారు. తాడిచర్ల-2 బొగ్గు గనులపై తుది నిర్ణయం తీసుకున్నామన్నారు. దాదాపు 182 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్స్ ఉన్న ఈ బ్లాక ద్వారా.. ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుందన్నారు. దాదాపు 40 నుంచి 50 ఏళ్ల పాటు ఈ గని నుంచి బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని చెప్పుకొచ్చారు. దీని ద్వారా మొత్తంగా రూ.64,000 కోట్లకు పైగా రెవెన్యూ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. నేరుగా సింగరేణికి ఈ గని ఇవ్వడం ద్వారా ఆక్షన్ ప్రీమియం చెల్లింపు లేని కారణంగా ఆ సంస్థకు కనీసం రూ.2,550 కోట్లు మిగులుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి రాయల్టీ సహా వివిధ మార్గాల్లో దాదాపు రూ.16 వేల కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## 2008 వరుస బాంబు పేలుళ్ల కేసులో 38 మందికి ఉరి

**అహ్మదాబాద్, జులై 7 (సింగిడి):**
దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన 2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక కోర్టు 2022లో విధించిన శిక్షలను సమర్థిస్తూ 38 మంది దోషులకు ఉరిశిక్షను, మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్షను హైకోర్టు మంగళవారం ఖరారు చేసింది. ఈ కేసులో దాఖలైన అప్పీళ్లపై సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయస్థానం ఈ తీర్పును వెలువరించింది 2008, జులై 26న అహ్మదాబాద్‌లో కేవలం 70 నిమిషాల వ్యవధిలో 21 చోట్ల బాంబు దాడులతో ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో 56 మంది మరణించగా, 246 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఆ తర్వాత సూరత్‌లో పేలని బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 78 మందిపై విచారణ జరగగా, 2022లో ప్రత్యేక కోర్టు 49 మందిని దోషులుగా తేల్చి, 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఉరిశిక్ష అమలుకు హైకోర్టు ధ్రువీకరణ తప్పనిసరి కావడంతో రాష్ట్ర ప్రభుత్వం శిక్షల నిర్ధారణ కోసం హైకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ అల్పేష్ కొగ్జే, జస్టిస్ సమీర్ దవేలతో కూడిన గుజరాత్ హైకోర్టు ధర్మాసనం గత రెండున్నరేళ్లుగా దాదాపు 248 సార్లు అప్పీళ్లపై విచారణ జరిపి మంగళవారం తుది తీర్పు వెల్లడించింది. . 38 మందికి మరణశిక్ష, 11 మందికి జీవితఖైదు విధిస్తూ 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సమర్థించింది. కిందికోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. ఈ పేలుళ్లలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడినవారికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని గుజరాత్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మార్చి 31, 2027లోగా పరిహార చెల్లింపులు పూర్తి చేయాలని పేర్కొంది. నిషేధిత ఇండియన్ ముజాహిదీన్ , సిమి ఉగ్రవాద సంస్థల కుట్రను ప్రాసిక్యూషన్ నిరూపించగలిగింది. దేశద్రోహం, హత్య నేరాలతో పాటు కఠినమైన ఉగ్రవాద నిరోధక చట్టం 'ఉపా' కింద దోషులుగా న్యాయస్థానం తేల్చింది. కాగా, దేశ చరిత్రలోనే ఒకే కేసులో ఇంతపెద్ద సంఖ్యలో 38 మందికి ఉరిశిక్షలు ఖరారు కావడం ఇదే ప్రథమం.2008 జులై 26న అహ్మదాబాద్‌లో 21 చోట్ల జరిగిన వరుస పేలుళ్లలో 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 246 మంది గాయపడ్డారు. నగరవ్యాప్తంగా ఆసుపత్రులు సహా పలుచోట్ల పేలుళ్లు జరగ్గా రెండ్రోజుల తర్వాత సూరత్ లోనూ బాంబులు గుర్తించారు. ఇక పేలుళ్ల శబ్దాలకు సమీపంలో ఉన్నవారు కొంతకాలం వినికిడి శక్తి కోల్పోయారు. దర్యాప్తులో భాగంగా అహ్మదాబాద్ నగర నేరవిభాగం 100 మందిని నిందితులుగా పేర్కొంది. 78 మందిపై విచారణ చేపట్టింది. 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో 49 మందిని దోషులుగా నిర్ధరించింది. 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. అప్రూవర్‌గా మారిన ఒక నిందితుడికి క్షమాభిక్ష ప్రసాదించింది. తొలుత ఇచ్చిన వాంగ్మూలాలు ఉపసంహరించుకున్న మరో నలుగురు అప్రూవర్ల కు శిక్ష విధించింది. 2002లో జరిగిన గోద్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు నాడు వార్తలు వచ్చాయి. తర్వాత ఇండియన్ ముజాహిదీన్ బాధ్యత ప్రకటించుకుంది. ఈ కేసు విచారణ సమయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 24 మంది నిందితులు టన్నెల్ తవ్వి జైలు నుంచి తప్పించుకునేందుకు యత్నించారు. అయితే ఆ కుట్రను పోలీసులు భగ్నం చేశారు.

## కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ

ఒకవేళ కేసీఆర్ వాదనలో బలముందని రుజువైతే.. రాబోయే మూడేళ్ల పాటు కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ల బాధ్యతను, మేజర్ కాంట్రాక్టను కేసీఆర్‌కే అప్పగిస్తామని.. ఆయన ఇష్టం వచ్చిన వాళ్లకు ఆ కాంట్రాక్ట ఇచ్చుకోవచ్చంటూ సంచలన సవాల్ చేశారు. బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్‌లను 'ఆర్థిక ఉగ్రవాదులుగా రేవంత్ రెడ్డి అభివర్ణించారు. కేసీఆర్ కట్టిన ఇతర ప్రాజెక్టులను, ప్రజాభవన్, సెక్రటేరియట్లను తాము వాడుతున్నామని.. కానీ, కాళేశ్వరం విషయంలో గత ప్రభుత్వం ఏమీ చేయకపోవడం వల్లే అది నిరుపయోగంగా మారిందని మండిపడ్డారు. ప్రస్తుతానికి బ్యారేజీల్లో నీళ్లు నింపి ఎత్తిపోయాలని ఏ ఎక్స్‌పర్ట్స్ కమిటీ కూడా చెప్పలేదని రేవంత్ గుర్తుచేశారు. ఒకవేళ బలవంతంగా నీళ్లు నింపితే బ్యారేజీలు పూర్తిగా కూలిపోతాయని, భద్రాచలం నగరం మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు తీసుకోకుండానే.. తాము అధికారంలోకి వచ్చాకవేల కోట్ల అపరేలు కట్టాల్సి వచ్చిందని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. నిపుణుల కంటే ఎవరు మంచి సలహాలు ఇచ్చినా తీసుకుంటామని, కేసీఆర్ చేసిన తపరేలకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడకూడదని ఆయన అన్నారు. ప్రజా సొమ్ము గోదారి పాలు కాకుండా కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో అవినీతి వంటి అంశాలను ప్రజాభవన్ వేదికగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆనాడే రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ అభ్యంతరం తెలిపిందని ఆయన తెలిపారు. కమిటీ నివేదికను కేసీఆర్ తొక్కిపెట్టారని పేర్కొన్నారు. తనకు నచ్చినట్లు రిపోర్టు వచ్చేలా బాధ్యతలను వ్యాప్కోస్‌కు అప్పగించారని సీఎం రేవంత్ ఆరోపించారు. రూ.38 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు పెంచారని సీఎం రేవంత్ విమర్శించారు. నివేదిక మారినా ఆయకట్టు ఏ మాత్రం మారలేదన్నారు. ప్రాజెక్టుపై కొన్ని అపోహలను ప్రతిపక్షం సృష్టించిందని, అవి తప్పని అన్ని ఆధారాలతో సహా చూపించామన్నారు. ఈ మేరకు కాళేశ్వరంపై నిపుణుల కమిటీ నివేదికను ప్రజల ముందుంచామని రేవంత్ పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఆనాడు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును తలపెట్టారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి ద్వారా తాగు, సాగునీరు, పరిశ్రమలకు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుగా ఆనాడు నామకరణం చేశారని, 16 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని చెపరేకొచ్చారు. అయితే, మహారాష్ట్రలోని కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయని అభ్యంతరాలు వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. ఉత్తర తెలంగాణ నుంచి దక్షిణ తెలంగాణ వరకు గోదావరి నీటిని తరలించాలని ఆనాడే వైఎస్ఆర్, కాంగ్రెస్ కృషి చేసిందని రేవంత్ రెడ్డి చెపరేకొచ్చారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కమిషన్ల కోసం కేసీఆర్ ప్రాజెక్టు రీడిజైన్ చేశారని పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్ ఇంజనీర్లు కాదని, మానిప్యులేటర్లని రేవంత్ రెడ్డి ఆగ్రహించారు. అబద్దాలతో మభ్యపెట్టడమే వారిద్దరి నైపుణ్యమని ఎద్దేవా చేశారు. అబద్దాలు చెప్పడంలో వారికి వారే సాటి అని మండిపడ్డారు. ప్రాజెక్టు అంచనా రూ.1.47 లక్షల కోట్లకు చేరిందని కాగ్ తెలిపిందన్నారు. అబద్దాల రావుల మాటలను నాటి గవర్నర్ నమ్మారని రేవంత్ చెపరేకొచ్చారు. డబ్బులు కొల్లగొట్టాలన్న ఆశతో ప్రాజెక్టును ప్రారంభించారని ధ్వజమెత్తారు. పక్క రాష్ట్రాల ముఖ్యమంత్రులను తీసుకొచ్చి యజ్ఞాలు చేశారని విమర్శించారు. కట్టిన ఏడాదిలోపే మేడిగడ్డ కుంగిపోయిందని, నాటి ప్రాజెక్టు ఏఈనే లోపాలను బయటపెట్టారన్నారు. సమస్యను గుర్తించకపోవడం వల్లే కూలిపోయిందని, 2022లో వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ మునిగిపోయిందన్నారు. 2023 అక్టోబర్‌లో ఆరు పిల్లర్లు కూలిపోయాయని, బ్యారేజీలు, డ్యామ్‌లు కడితే 25 శాతం చొపరేన నింపుతారని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. అయితే, కేసీఆర్ మాత్రం కట్టిన ఏడాదికే బ్యారేజీలను నింపేశారన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కింద ఆయకట్టే లేదని, మేడిగడ్డను చూపించి బంగాళాఖాతాన్ని తెచ్చినట్టు చేశారన్నారు. నీళ్లు నింపడం వల్ల బ్యారేజీలపై ఒత్తిడి ఎక్కువైందని, ఇసుక మీదనే బ్యారేజీలు కట్టడం వల్ల ప్రాజెక్టు కుంగిందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## భూములు ఇచ్చిన రైతులకు 40 వేల కౌలు

అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. రాత్రిలోగా భూములివ్వనివారికి రేపు భూ సేకరణ అమలు చేస్తామన్నారు. ఇప్పటికే ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్ 2.5 ఎకరాలకు అమలు చేస్తున్నామని తెలిపారు. రాజధాని అమరావతి అభివృద్ధి, రెండో దశ ల్యాండ్ పూలింగ్, రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక ఏర్పాటు, వివిధ సంస్థలకు భూ కేటాయింపులు సహా తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపినట్లు నారాయణ వివరించారు. సమావేశం అనంతరం మీడియాకు మంత్రి నారాయణ వివరాలు వెల్లడించారు. అదేవిధంగా ప్రతి ఏడాది జరీబు భూములకు ఎకరానికి రూ.5 వేల చొప్పున, మెట్ట భూములకు ఎకరానికి రూ.3 వేల చొప్పున యాన్యుటీ పెంపునకూ అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామ కంఠాల్లో భూములు కోల్పోయిన వారికి ఏడాదికి రూ.10 వేల చొప్పున చెల్లించాలని నిర్ణయించినట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. కొత్తగా ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో భూములు ఇచ్చే రైతు కుటుంబాలకు వ్యవసాయ రుణమాఫీ అమలు చేయాలని అథారిటీ నిర్ణయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ల్యాండ్ పూలింగ్‌కు ఇంకా భూములు ఇవ్వని రైతులకు మంగళవారం రాత్రి వరకు అవకాశం కల్పిస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ఆ తర్వాతా భూములు ఇవ్వకపోతే బుధవారం నుంచి భూసేకరణ ప్రక్రియను అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే జారీ చేసిన ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్‌ను 2.5 ఎకరాల భూమికీ అమలు చేయనున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు.

## రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్ దిశగా అడుగులు

**ప్రజలకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యం**
**పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజేషన్**
**సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరేందుకు ఉపయుక్తం**
**కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆన్‌లైన్‌లోనే జీతాలు**
**ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు**

**హైదరాబాద్, జులై 7 (సింగిడి):**
పరిపాలనలో మరింత పారదర్శకతకు డిజిటల్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు అవసరమైన చట్టాలను రూపొందించాలని ఆదేశించారు. మంగళవారం ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్ లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు అందించేందుకు వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేస్తూ 'డిజిటల్ గవర్నెన్స్' దిశగా చట్టాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు చేర్చేందుకు ఈ విధానం ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక అకౌంట్ వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 4800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా.. ఇందులో 4300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. దీనిపై ప్రభుత్వం సీరియస్ గా ఉందని, అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్ తో సమస్యకు చెక పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటి నుంచి 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందన్నారు. అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలని తెలిపారు. ఇందుకు వివిధ విభాగాల అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ 100 రోజుల్లో ఈ అంశాన్ని కొలిక్కి తీసుకు రావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిలైజ్ చేయాలన్నారు. నిరంతరం మానీటరింగ్ చేసేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజరు జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, హెచ్ఆర్డి వైస్ చైర్మన్ శాంతి కుమారి, వేతన సవరణ కమిషనర్ ఎన్. శివ శంకర్,ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా విభాగం కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## తెలంగాణ అభివృద్ధిలో మహిళలు, పిల్లలదే కీలక పాత్ర

**మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని**
**గర్భిణీల నుంచి పిల్లలకు 6 ఏళ్లు వచ్చే వరకు పౌష్టికాహారం**
**నాచారంలో బాలామృతం ప్లాంట్ ప్రారంభంలో సిఎం రేవంత్**

**హైదరాబాద్, జులై 7 (సింగిడి)**
తెలంగాణ సమాజ అభివృద్ధిలో మహిళలు, పిల్లల పాత్రే అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. నాచారంలో 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన బాలామృతం ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గర్భిణీల నుంచి పిల్లలకు 6 ఏళ్లు వచ్చే వరకు పౌష్టికాహారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులందరికీ బ్రేకఫాస్ట్, లంచ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. నాణ్యతను పరిశీలించేందుకు ప్రభుత్వ స్కూళ్లలోనే టీచర్లు కూడా బ్రేకఫాస్ట్, లంచ్ చేయాలని సీఎం నిర్ణయించారు. ఇక్కడ తయారు చేసే బాలమృతం ఇతర రాష్ట్రాలకు కూడా సరఫరా చేసే విధంగా ప్లాంట్ రూపొందిందని అన్నారు. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి ఆరేళ్లపాటు బాలామృతం పంపిణీ చేస్తామని ఈ సందర్భంగా సీఎం తెలిపారు. నాలుగైదు రాష్ట్రాలకు సరఫరా చేసేలా ఈ ఎO-లాంట్ అభివృద్ధి చెందుతుందన్నారు. పిల్లలకు ఓట్లు లేకపోయినా.. వారి భవిష్యత్ పట్ల తమ ప్రభుత్వానికి శ్రద్ధ ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. మహిళల సంక్షేమంపై మాట్లాడుతూ.. ప్రజా పాలన వచ్చిన 48 గంటల్లోనే ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించామని, దీనివల్ల పనిచేసే మహిళలకు నెలకు 10 వేల వరకు ఆదా అవుతోందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరు మీదే ఇస్తున్నామని.. త్వరలోనే హైదరాబాద్ సిటీలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు పంచుతామని సీఎం భరోసా ఇచ్చారు. 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇకపోతే రాజకీయాలకు అతీతంగా ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. నాచారంలో రూ.40 కోట్లతో నిర్మించిన బాలామృతం తయారీ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. తయారీ వివరాలను అక్కడి ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ ద్వారా గంటకు 18 టన్నుల బాలామృతం తయారు చేయనున్నట్లు సిబ్బంది తెలిపారు. మరోవైపు త్వరలోనే లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు అందిస్తామని సీఎం చెప్పారు. 'ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో 4.5లక్షల ఇళ్లు కట్టాం. పట్టణాల్లో లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 2034లోగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అల్పాహారం, నాణ్యమైన భోజనం అందిస్తున్నాం. విద్యార్థుల కోసం ఏటా రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. రాజకీయాలకతీతంగా ఉప్పల్ అభివృద్ధి బాధ్యత తీసుకుంటా అని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలతో పాటు అధికారులు పాల్గొన్నారు.

## వర్షాలకు వయనాడ్ అతలాకుతలం

**తిరువనంతపురం, జులై 7 (సింగిడి):**
కేరళంలో కురుస్తున్న భారీ వర్షాలు మరోసారి వయనాడ్ జిల్లాలో ప్రమాదానికి దారితీశాయి. మంగళవారం మీప్పాడీ సమీపంలోని కల్లాడి ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న సొరంగ మార్గం వద్ద భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో పలువురు కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. భారీ వర్షాలకు వయనాడ్ జిల్లా మెప్పాడి సమీపంలోని కల్లాడి వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. మంగళవారంమధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో ముగ్గురు కార్మికులు మృతిచెందగా, మట్టి కింద కూరుకుపోయిన ఆరుగురిని స్థానికులు రక్షించారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన మరికొంతమంది కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మలప్పురం, వయనాడ్ జిల్లాలను కలిపే సొరంగ మార్గం నిర్మాణ పనులు జరుగుతున్న మీనాక్షి వంతెన సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సహాయక బృందాలు వెంటనే రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టాయి వయనాడ్ ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో భారీగా మట్టి, బండరాళ్లు ఒక్కసారిగా కొండపై నుంచి కూలిపడి నిర్మాణ ప్రాంతాన్ని పూర్తిగా కప్పివేశాయి. ప్రమాదం సంభవించగానే అక్కడ ఉన్న కార్మికులు ప్రాణభయంతో పరుగులు తీశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ ఘటనలో కనీసం ఐదుగురు గాయపడగా, మరికొందరు మట్టిలో చిక్కుకుని ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, విపత్తు నిర్వహణ బృందాలు, స్థానిక అధికారులు కలిసి సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు ఈ ప్రమాదంపై కేరళం ముఖ్యమంత్రి వి.డి.సతీషన్ వెంటనే జిల్లా మంత్రులతో ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. సహాయక, పునరావాస చర్యలను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని ఆదేశించారు. వయనాడ్‌కు వెళ్లి సహాయక, పునరావాస చర్యలను పర్యవేక్షించాలని మంత్రులు అనిల్ కుమార్, సిద్దికకుఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉన్నతాధికారులు అగ్నిమాపక, పోలీసు, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలను రంగంలోకి దింపి సహాయక చర్యలు చేపట్టారు. యనాడ్‌లో సోమవారం నుంచి భారీ వర్షాలు పడుతుండగా సొరంగం పనులను అదే రోజు నుంచి ప్రాజెక్టు అధికారులు నిలిపివేశారు. ఆ ప్రాంతంలో 24 గంటల వ్యవధిలోనే సుమారు 265 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడ్డాయి. సొరంగ మార్గం ప్రాజెక్టు కోసం పని చేసే కార్మికులు నివసించే వసతి గృహంపై కొండచరియలు పడ్డాయి. అలాగే, కొన్ని నివాస గృహాలు, హోమ్‌స్టేలపైనా భారీగా మట్టి, రాళ్లు వచ్చిపడ్డాయి. దీంతో ముగ్గురు కార్మికులు మృతిచెందారు. మరోవైపు శిథిలాల కింద మరికొంత మంది కార్మికులు, స్థానికులు ఉండొచ్చని సహాయక చర్యలు చేపట్టిన అధికారులు భావిస్తున్నారు. అనేక వాహనాలు, ఇళ్లు దెబ్బతినగా.. నష్టాన్ని అధికారులు ఇంకా అంచనా వేయలేదు.శిథిలాల కింద మరో 30 మంది వరకు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. కొండచరియల కింద చిక్కుకున్న కొంతమంది కార్మికులను సహాయక సిబ్బంది రక్షించి ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలంలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## మోడీకి ఇండోనేషియా అత్యున్నత పురస్కారం

ఇరు దేశాల మధ్య దౌత్య, ఆర్థిక, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ అందించిన విశేష కృషికి గుర్తింపుగా ఇండోనేసియా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ఈ అత్యున్నత పురస్కారాన్ని అధికారికంగా ప్రకటించారు. భారత్-ఇండోనేసియా దేశాల మధ్య చారిత్రక బంధాన్ని కొత్త శిఖరాలకు చేర్చడంలో ప్రధాని మోదీ పోషించిన పాత్రను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న దేశాల) ప్రయోజనాల కోసం, ఆసియా-పసిఫిక ప్రాంతంలో శాంతి భద్రతల కోసం భారత్ అందిస్తున్న సహకారం అమోఘమైనదని ఆయన ప్రశంసించారు.

## కేంద్రానికి కృతజ్ఞతలు

**హైదరాబాద్, జులై 7 (సింగిడి)**
సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను కేంద్రం కేటాయించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది.సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపు.. కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపిన డిప్యూటీ సీఎం సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను కేంద్రం కేటాయించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది. మంగళవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం కృషి ఫలించిందని అన్నారు. మరో 40 ఏళ్ల పాటు మైనింగ్‌కు అవకాశం ఉందని పేర్కొన్నారు. 340 మిలియన్ టన్నుల బొగ్గు వెలికితీతకు అవకాశం కలిగిందని చెప్పారు. తాడిచర్ల-2లో 434.14 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని వివరించారు.ఏడాదికి 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. బ్లాక్‌లో జీ-9 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు లభ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ బొగ్గు బ్లాక్ ద్వారా 3 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. దీని ద్వారా భూపాలపల్లి ప్రాంత అభివృద్ధికి భారీ ఊతం లభించినట్లు అయిందని అన్నారు. దీంతో రైలు, రోడ్డు మౌలిక వసతుల అభివృద్ధికి దోహదం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.విద్యుత్, పారిశ్రామిక రంగాలకు దీర్ఘకాలిక బొగ్గు భద్రత ఉంటుందని చెప్పారు. సింగరేణి 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి ఇది బలంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇతర బొగ్గు బ్లాకులు కూడా సింగరేణికే ఇవ్వాలని ఈ సందర్భంగా కేంద్రానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు.

## కడియంపై క్రమశిక్షణ చర్య తీసుకోవాల్సిందే

**నాకు తెలియకుండా ఎలా సమీక్షలు చేపడతారు**
**మంత్రిగా తన శాఖలో జోక్యం చేసుకోవడం ఏమటి**
**సిఎం రేవంత్‌కు లేఖ రాసిన మంత్రి కొండా సురేఖ**

**హైదరాబాద్, జులై 7 (సింగిడి):**
స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీరుపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న నన్ను , నా కార్యాలయాన్ని పూర్తిగా విస్మరించి, ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కడియం శ్రీహరి కమిషనర్ ఆఫీస్‌లో అధికారిక సమీక్షా సమావేశం నిర్వహించారని ఆమె ఫిర్యాదు చేశారు. మాస్టర్ ప్లాన్లు, శాఖాపరమైన నివేదికలపై ఆదేశాలు జారీ చేయడం మంత్రి పరిధిలోని అంశమని, అలాంటప్పుడు ఒక ఎమ్మెల్యే దేవాదాయ శాఖ అధికారులను పిలిచి ఎలా ఆదేశిస్తారని సురేఖ ప్రశ్నించారు. కడియం శ్రీహరి చర్య ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయానికి నాంది అని, ఇది కేవలం పరిపాలనా లోపం మాత్రమే కాదని, ఒక శాఖా మంత్రి అధికారాలను బహిరంగంగా ప్రశ్నించే కుట్ర అని ఆమె లేఖలో మండిపడ్డారు. గతంలోనూ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలను రెచ్చగొట్టి తనపై కడియం శ్రీహరి దుష్ప్రచారం చేశారని కొండా సురేఖ ఆరోపించారు. ఇప్పుడు కూడా ఉద్దేశపూర్వకంగానే తన్ను నిర్లక్ష్యం చేస్తూ ఆయన తీసుకుంటున్న ఇలాంటి చర్యల వల్ల దేవాదాయ శాఖ అధికార యంత్రాంగంలో తీవ్ర అయోమయం నెలకొందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధిగా ఉంటూ ప్రభుత్వ నిబంధనలను, మంత్రి అధికారాలను అతిక్రమించిన కడియం శ్రీహరిపై పార్టీ క్రమశిక్షణా కమిటీ ద్వారా విచారణ జరిపించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కొండా సురేఖ తన లేఖలో కోరారు. మంత్రిగా తనకు సమాచారం ఇవ్వకుండా కడియం దేవాదాయ శాఖపరమైన సమీక్ష నిర్వహించారని, ఆయన సమీక్షించడం పరిపాలనా వ్యవస్థకు విరుద్ధమని పేర్కొన్నారు. శాఖ మంత్రిగా అన్ని అధికారాలు తనకే ఉంటాయన్న సురేఖ.. కడియం వ్యవహారంపై పార్టీ, ప్రభుత్వ స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. బొగ్గులకుంటలోని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో సోమవారం కడియం శ్రీహరి సమీక్ష నిర్వహించారు. దేవాలయాలకు సమస్య ఉంటే మంత్రి, అధికారులకు వినతిపత్రం ఇవ్వాలి కానీ, సమీక్ష నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు. ఈ అంశంపై కడియం శ్రీహరి నుంచి వివరణ కోరాలని సీఎం రేవంత్‌రెడ్డికి సురేఖ విజ్ఞప్తి చేశారు.

## బిఎల్‌వోలను బెదిరిస్తున్న ఎంఐఎం

**హైదరాబాద్, జులై 7 (సింగిడి):**
సర్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఈవోను బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు కోరారు. ఆయన ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని ఆ పార్టీ బృందం కలిసింది. ఈ సందర్భంగా సర్ శ్రీ విషయంలో ఎంఐఎం పార్టీ వ్యవహరిస్తున్న తీరు సరిగ్గా లేదని రాంచందర్ రావు ఫిర్యాదు చేశారు. అనంతరం బీజేపీ తెలంగాణ చీఫ్ మీడియాతో మాట్లాడుతూ.. పలు ప్రాంతాల్లో బీఎల్‌వోలను ఎంఐఎం, కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారని తెలిపారు. ఇంటింటికీ వెళ్లకుండా బీఎల్ఓలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పలువురు ఓటర్లకు ఫారాలు అందడం లేదని రాంచందర్ రావు తెలిపారు. తెలుగు ఫారాలతో ఇతర రాష్ట్రాల ఓటర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. హైదరాబాదే కాకుండా అవసరమైన అన్ని ప్రాంతాల్లో ఇంగ్లీషు ఫారాలు అందించాలని కోరినట్లు తెలిపారు. ఓటర్ల జాబితా లోపాలపై చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరినట్లు రాంచందర్‌రావు పేర్కొన్నారు.

## వేగంగా భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు

**విజయనగరం, జులై 7 (సింగిడి):**
భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను వేగంగా పూర్తి చేశామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. మంగళవారం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం తుది మెరుగుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జీఎంఆర్‌తో కలిసి బ్రహ్మాండమైన ఎయిర్‌పోర్టును నిర్మించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇక్కడికి వచ్చారని.. అనుకున్న సమయానికంటే ముందుగానే నిర్మాణం చేపట్టాలని ఆదేశించారని అన్నారు. ఆ ఆదేశాలు మేరకు అనుకున్న సమయానికే జీఎంఆర్ సంస్థ ఎయిర్‌పోర్టును నిర్మించిందని చెప్పారు. ఎయిరో డ్రో లైసెన్స్ కూడా వచ్చిందని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. ఎయిర్‌పోర్టు ప్రారంభమైన వారం తర్వాత ఆపరేషన్స్ నిర్వహిస్తామన్నారు. మోదీ షెడ్యూల్ ఖరారైన తర్వాత తేదీ ప్రకటిస్తామని కేంద్ర మంత్రి వెల్లడించారు. విశాఖ ఎయిర్‌పోర్టు కార్యకలాపాలను భోగాపురానికి తరలిస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో 4 కోట్ల మంది ప్రయాణించే విధంగా టెర్మినల్ నిర్మాణం జరుగుతుందన్నారు. 78,000 చదరపు మీటర్ల మేర టెర్మినల్ బిల్డింగ్ నిర్మించామని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు.. దేశంలోనే బెస్ట్ ఎయిర్‌పోర్టు డిజైన్‌గా ఉందని కితాబిస్తున్నారని అన్నారు. ఉత్తరాంధ్ర కళలు, సాంప్రదాయాన్ని ఉట్టిపడేలా ఇంటీరియర్ డిజైన్ చేపట్టినట్లు చెప్పారు. దేశంలోనే అత్యంత బెస్ట్ ఎయిర్‌పోర్ట్‌గా భోగాపురం నిలవనుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## దక్షిణ కొరియాలో కొనసాగుతున్న లోకేశ్ పర్యటన

**అమరావతి, జులై 7 (సింగిడి):**
ఏపీకి పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా దక్షిణ కొరియాలో మంత్రి నారా లోకేశ్ పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా ప్రముఖ పారిశ్రామికవేత్తలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు.హ్యుందాయ్ మోబిస్ ఉన్నతస్థాయి ప్రతినిధులతో లోకేశ్ భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈవీ సెమీకండక్టర్స్ హబ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విశాఖలో హ్యుందాయ్ మోబిస్ ఆర్ అండ్ డీ/ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. తిరుపతి, అనంతపురం ప్రాంతంలో ఈవీ కాంపోనెంట్స్, బ్యాటరీ సిస్టమ్స్ తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదన చేశారు. ఐఐటీ తిరుపతితో కలిసి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అటానమస్ డ్రైవింగ్, అడాస్, స్మార్ట్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశోధనలకు హ్యుందాయ్ మోబిస్‌తో లోకేశ్ భాగస్వామ్యం కోరారు. అనంతపురాన్ని ఆటోమొబైల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సహకరించాలని హ్యుందాయ్ మోబిస్‌కు వినతి చేశారు. టైర్-1 ఆటోమొబైల్ సరఫరాదారుల సమావేశాన్ని ఏపీలో నిర్వహించాలని ప్రతిపాదించారు. హ్యుందాయ్ మోబిస్ విస్తరణకు ఏపీ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని లోకేశ్ స్పష్టం చేశారు. అనంతపురం యూనిట్‌లో హ్యుందాయ్, కియా కోసం కీలక మాడ్యూల్స్ తయారు చేయనున్నట్లు హ్యుందాయ్ మోబిస్ తెలిపింది. ఏపీ ప్రతిపాదనలపై ఉన్నతస్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. అపాక్ సీఈవో సియాంగ్ డాంగ్ లీతో మంత్రి లోకేశ్ సమావేశ మయ్యారు. ఓఎస్ఏటి సెమీకండక్టర్ నైపుణ్యాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఏపిలో భాగస్వామ్యం కుదుర్చుకోవాలని అపాక్‌కు ప్రతిపాదన చేశారు.

సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
బుధవారం
8-7-2026



# ప్రతి అడుగు..
# అభివృద్ధి వైపు

## ప్రజా సమస్యలపై పద్మానగర్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర

### ప్రజల మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం

### ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

**కుత్బుల్లాపూర్, జూలై 7 (సింగిడి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 285 - పద్మా నగర్ డివిజన్ పద్మనగర్ ఫేజ్ టూ లో వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజా సమస్యలపై బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్ నెంబర్ 24 లో సుమారు రూ.28 లక్షలతో నిర్మించిన నూతన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం కాలనీలో పాదయాత్ర నిర్వహిస్తూ స్థానికుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు తాగునీటి సరఫరా లో-ప్రెషర్ కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను, తెలంగాణ చౌరస్తా వద్ద రోడ్డుపై నిత్యం మురుగునీరు ప్రవహిస్తూ ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్న సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు కల్పించడం, ప్రతి కాలనీని సమగ్రంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వంటి



మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరిచే దిశగా రానున్న రోజుల్లో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. తెలంగాణ చౌరస్తాలో మురుగునీరు ఓవర్ ఫ్లో కాకుండా నూతన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ అభిరామ్, వాటర్ వర్క్స్ మేనేజర్ శివప్రసాద్, నియోజకవర్గ యువజన అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తి రెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, బొంబాయి శీను, రాకేష్ జాలిగం, మధుకర్ రెడ్డి, ఎం.డి. నజీరుద్దీన్, రమణారెడ్డి, ఆంజనేయులు, వెంకటేష్, దుర్గా రెడ్డి, కళ్లెం శ్రీనివాస్, అలాగే కాలనీ ప్రతినిధులు శౌరి రాజ్, కేదార్ నాథ్, వెంకట్ సాయి, దశరథ్, రామ్ దాస్, సంతోష్, ఏలా నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు
# నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

### పీహెచ్సీలు, యూపీహెచ్సీల్లో సదుపాయాల కల్పనకు ప్రత్యేకచర్యలు

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి బ్యూరో, జూలై 7 (సింగిడి):** జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. జిల్లాలోని 31 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు , 4 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, పీహెచ్సీ, యూపీహెచ్సీ వైద్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని అన్నారు. ఆసుపత్రుల్లో తాగునీటి సౌకర్యం, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, విద్యుత్ వైరింగ్, లైటింగ్, ఫ్యాన్లు, ఇతర చిన్నచిన్న మరమ్మత్తులు చేపట్టేందుకు అవసరమైన అంచనా ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పీహెచ్సీని అన్ని విధాలుగా బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా



చర్యలు తీసుకోవాలని సూచించారు. హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ పురోగతిని సమీక్షించిన కలెక్టర్, లక్ష్య సాధనలో వెనుకబడిన ప్రాంతాల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి, ప్రజల్లో అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికి వ్యాక్సినేషన్ అందేలా కృషి చేసి వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డెంగ్యూ, చికున్‌గున్యా, టైఫాయిడ్ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, డాక్టర్ శశాంక్, పీహెచ్సీ, యూపీహెచ్సీ వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియమాలు చిన్నప్పటి నుంచే నేర్చుకోవాలి

### మల్కాజిగిరి సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ అసోసియేట్ డైరెక్టర్ సావిత్రి

**అల్వాల్, జూలై 7 (సింగిడి):** ట్రాఫిక్ నియమాలు చిన్నప్పటినుంచి నేర్చుకోవాలని మల్కాజ్గిరి సెక్యూరిటీ కౌన్సిల్ అసోసియేషన్ డైరెక్టర్ శ్రీమతి సావిత్రి అన్నారు. మల్కాజిగిరి కమిషనరేట్ పోలీస్ కమిషనర్ శ్రీమతి సుమతి, ఆదేశాల మేరకు, డీసీపీ ట్రాఫిక్-x శ్రీ రాహుల్రెడ్డి, మార్గదర్శకత్వంలో, మల్కాజిగిరి సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ఎం.కె.ఎస్.సి సహకారంతో ఆల్వాల్ ట్రాఫిక్ పోలీసులు, ఓల్డ్ ఆల్వాల్‌లోని లయోలా అకాడమీలో విద్యార్థుల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ అండ్ రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ అసోసియేట్ డైరెక్టర్ శ్రీమతి సావిత్రి మాట్లాడుతూ, ట్రాఫిక్ నియమాలను చిన్నప్పటి నుంచే నేర్చుకుని ఆచరించాలని తెలిపారు. చిన్న వయస్సు నుంచే బాధ్యతాయుతమైన రహదారి ప్రవర్తన అలవడితే సురక్షిత సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ రోడ్ సేఫ్టీ రాయబారులుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ట్రాఫిక్ ఉ రోడ్ సేఫ్టీ ఫోరం లీడ్ శ్రీ మురళీకృష్ణ ఎ., త్రిముల్గెర్రీ ట్రాఫిక్ ఏసీపీ శ్రీ జి. శంకర్ రాజు, ఆల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ జి. పవన్ కుమార్ రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ హరిలాల్, లయోలా అకాడమీ ప్రిన్సిపాల్ ఫాదర్ ఎన్. బి. బాబు, ఎస్.జె., వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ ఎ. ఎం. జోసెఫ్ కుమార్, ఎస్.జె. పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలను పాటించడం, ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ తప్పనిసరిగా



వినియోగించడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించడం, లేన్ క్రమశిక్షణ పాటించడం, అతివేగం, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర అలవాట్లను నివారించాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన రహదారి వినియోగదారులుగా మారి తమ పరిసరాల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 500 మందికి పైగా విద్యార్థులు మరియు అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చివరగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించి, రహదారులను మరింత సురక్షితంగా మార్చేందుకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అధికారులు పిలుపునిచ్చారు. జి. పవన్ కుమార్ రెడ్డి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ఆల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మల్కాజ్గిరికమిషనరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ముచ్చింతల్ 'సమతా మూర్తి'ని దర్శించుకున్న గవర్నర్ సతీమణి

**రాజేంద్రనగర్, జులై 7 (సింగిడి):** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సతీమణి జానకి శుక్లా మంగళవారం శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లో కొలువై ఉన్న ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం 'స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ' (సమతా మూర్తి) ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్న గవర్నర్ సతీమణికి ఆలయ నిర్వాహకులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె 216 అడుగుల ఎత్తైన శ్రీ రామానుజాచార్యుల మహా విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు



నిర్వహించారు. "సమతా మూర్తి కేంద్రంలోని ఆధ్యాత్మిక వాతావరణం, ఇక్కడి శిల్పకళా చాతుర్యం ఎంతో అద్భుతంగా ఉన్నాయి."ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన 108 దివ్య దేశాలను ఆమె ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆమెకు శ్రీ రామానుజాచార్యుల జీవన విశిష్టతను, ఆయన అందించిన సమానత్వ సందేశాన్ని, అలాగే ఈ క్షేత్రం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. రామానుజాచార్యుల బోధనల పట్ల ఆమె ఆసక్తిని కనబరిచారు. దర్శనానంతరం ఆలయ వేద పండితులు జానకి శుక్లాకు తీర్థప్రసాదాలు అందజేసి, వేదాశీర్వచనం చేశారు. ఈ ఆధ్యాత్మిక పర్యటనలో రాజ్‌భవన్ అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### వెంకట్రావుపేట పాఠశాల ఉపాధ్యాయుల

## డిప్యుటేషన్ రద్దుకు అధికారుల హామీ



**ఆమనగల్లు, జూలై 07(సింగిడి):** తలకొండపల్లి మండల పరిధిలోని , వెంకట్రావుపేట పాఠశాలలో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడుతోంది. 50 మందికి పైగా విద్యార్థులు ఉన్నా, కేవలం ఇద్దరు ఉపాధ్యాయులతోనే నెట్టుకొస్తున్న పరిస్థితి. గ్రామ సర్పంచ్ ఇమ్మడి మహేష్ చొరవ తీసుకుని, డిప్యుటేషన్‌పై వెళ్లిన పి. శివరాజ్, ఎస్. శ్రీధర్, కె. లక్ష్మిలను తిరిగి రప్పించాలని అధికారులను వేడుకున్నారు. జిల్లా అదనపు విద్యాశాఖ డైరెక్టర్ పూర్ణచందర్ రావు, మండల విద్యాశాఖ అధికారి చంప్లా నాయక్‌లకు వినతిపత్రం అందజేశారు. అధికారుల సానుకూల స్పందనతో విద్యార్థుల్లో ఆశలు చిగురించాయి. నాణ్యమైన విద్య అందేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సర్ హెల్ప్‌లైన్ ప్రారంభం

### తోకల శ్రీనివాస్ రెడ్డి



**రాజేంద్రనగర్, జూలై 7 (సింగిడి):** భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా, రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలకు అవసరమైన సహాయం, మార్గదర్శకత్వం అందించేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ప్రారంభించినట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నియోజకవర్గంలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఈ హెల్ప్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కులతో ముడిపడి ఉందని అన్నారు. అర్హుడైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావడం, ఇప్పటికే ఉన్న ఓటర్లు తమ వివరాలు సరిచూసుకొని అవసరమైన సవరణలు చేసుకోవడం అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.

### చట్ట ప్రకారం కోర్టు అనుమతి తీసుకున్నాం

### జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



# 1485.75 కిలోల ఎండు గంజాయి,
# 5 కిలోల ఆల్ప్రాజోలం దహనం

**సంగారెడ్డి బ్యూరో, జులై 7 (సింగిడి):** జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో యన్.డి.పి.యస్. చట్ట ప్రకారం నమోదైన కేసులలో సీజ్ చేయబడిన ప్రభుత్వ నిషేధిత 1485.75 కిలోల ఎండు గంజాయి, 5 కిలోల ఆల్ప్రాజోలంను చట్ట ప్రకారం కోర్టు అనుమతి తీసుకుని, జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డి జిల్లాలోని పాశమైలారం పారిశ్రామిక వాడలలోని మెడికేర్ పరిశ్రమలో ఇన్సినిరేషన్ ప్రక్రియ ద్వారా పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తూ దహనం చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. యన్.డి.పి.యస్. యాక్ట్ లోని నియమనిబంధనల ప్రకారం జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో నిల్వ ఉన్న ప్రభుత్వ నిషేధిత ఎండు గంజాయి, ఆల్ప్రాజోలం, ను ఈ రోజు దహనం చేయడం జరిగిందని అన్నారు. కొందరు అక్రమార్జనలో భాగంగా అక్రమ ఆల్ప్రాజోలం తయారీ, గంజాయి సాగు, విక్రయిస్తూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రలోభాలకు గురి చేస్తూ మత్తులోకి లాగుతున్నారని అన్నారు. జిల్లాలో అసాంఘిక, చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలను అరికట్టడానికి జిల్లాలో స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీం లను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ టిమ్స్ జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ దాడులు చేపట్టడం జరిగిందని అన్నారు. జిల్లాలో ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయించి, సరఫరా చేసినా, లేదా సాగు చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ డ్రగ్ డిస్పోజల్ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, వర్టికల్ డిఎస్పీ సురేందర్ రెడ్డి, మెడికేర్ ఎన్విరాన్‌మెంటల్ పరిశ్రమ మేనేజర్ శివారెడ్డి, డీసిఆర్బీ ఇన్స్పెక్టర్ బి.రమేష్, ఎస్-న్యాబ్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ రావ్, భానూర్ ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ, సంబంధిత ఎస్.హెచ్.ఓ.లు ఉన్నారు.

### అణు నిర్మాణాల గణిత
### నమూనాపై పరిశోధనకు పీహెచ్.డీ.



**పటాన్చెరు, జూలై 07(సింగిడి):** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత, గణాంక శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని జైనా ప్రణవి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'టోపోలాజికల్ సూచికలను ఉపయోగించి అణు నిర్మాణాల గణిత నమూనా రూపకల్పన: గ్రాఫ్ సైద్ధాంతిక విధానం'పై ఆమె పూర్తి స్థాయి పరిశోధక విద్యార్థిగా అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జె. విజయశేఖర్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ డాక్టరల్ పరిశోధన, గణనపరంగా అధిక శ్రమతో కూడిన క్వాంటం-రసాయన పద్ధతులపై ఆధారపడకుండా, అణు నిర్మాణాలకు నమూనా రూపొందించడానికి, వాటి భౌతిక, రసాయన ధర్మాలను కచ్చితంగా అంచనా వేయడానికి గ్రాఫ్ సిద్ధాంతం యొక్క అనువర్తనాన్ని అన్వేషిస్తుందని వివరించారు. ఈ పరిశోధన, అలిఫాటిక్ కీటోన్లు, కొవ్వు ఆమ్లాలు, క్యాన్సర్ నిరోధక సమ్మేళనాలతో సహా వివిధ రకాల అణువులను విశ్లేషించడానికి టోపోలాజికల్ సూచికల ఆధారంగా గణిత నమూనాలను అభివృద్ధి చేసిందన్నారు. ఈ నమూనాలు బాష్పీభవన స్థానం, ద్రవీభవన స్థానం, మోలార్ ఘనపరిమాణం, ఎంథాల్పీ, పోలరైజేషన్ వంటి కీలక అణు ధర్మాలను అధిక కచ్చితత్వంతో విజయవంతంగా అంచనా వేసినట్టు తెలిపారు. ఈ అధ్యయనం గ్రాఫ్ సిద్ధాంతాన్ని మాలిక్యులర్ మోడలింగ్ కోసం ఒక సరళమైన, నమ్మదగిన, గణనపరంగా సమర్థవంతమైన విధానంగా రుజువు చేస్తుందన్నారు. ఇది కంప్యూటేషనల్ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ పరిశోధన, మెటీరియల్స్ సైన్స్, ఔషధ ఆవిష్కరణలో ముఖ్యమైన అనువర్తనాలను అందిస్తుందని తెలిపారు. ఇది గ్రాఫ్ సిద్ధాంతం, మాలిక్యులర్ సైన్స్ మధ్య సంబంధాన్ని బలోపేతం చేయడం ద్వారా అభివృద్ధి చెందుతున్న గణిత రసాయన శాస్త్ర రంగాన్ని కూడా బలపరుస్తుందన్నారు. అదే సమయంలో, కృత్రిమ మేధస్సు (ఏఐ), మెషిన్ లెర్నింగ్ ను ఏకీకృతం చేసే భవిష్యత్తు పరిశోధనలకు బలమైన పునాదిని అందిస్తుందని వివరించారు. డాక్టర్ ప్రణవి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, గణిత, గణాంక శాస్త్ర విభాగాధిపతి డాక్టర జాదవ్ గణేష్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# దుబ్బాకలో నాణ్యత లేని డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలు

### మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

**దుబ్బాక, జూలై 7(సింగిడి):** సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపల్ పరిధిలో నిర్మిస్తున్న డ్రైనేజీలు, సీసీ రోడ్ల పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపిస్తూ సీపీఎం దుబ్బాక పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. భాస్కర్ మాట్లాడుతూ, దుబ్బాకలోని సరస్వతినగర్ బాలికల ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ పక్కన ఇటీవల నిర్మించిన డ్రైనేజీ సైడ్‌వాల్ నిర్మాణం పూర్తికాగానే కూలిపోవడం నాణ్యత లోపాలకు నిదర్శనమని విమర్శించారు. మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో కొనసాగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాల్లో నాణ్యతలేని సిమెంట్ వినియోగించడం, ఇసుకకు బదులుగా అధికంగా డస్ట్ పౌడర్ కలిపి పనులు చేపడుతున్నారని ఆరోపించారు. దీనివల్ల నిర్మాణాలు తక్కువ కాలంలోనే దెబ్బతిని ప్రజాధనం వృథా అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుని, వారిని బ్లాక్‌లిస్టులో చేర్చాలని డిమాండ్ చేశారు. అలాగే నాణ్యతను పర్యవేక్షించాల్సిన అధికారులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించకుండా కాంట్రాక్టర్లతో రాజీ పడుతున్నారని ఆరోపించారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా చేపట్టిన నిర్మాణాల బిల్లులను వెంటనే నిలిపివేసి, ప్రస్తుతం కొనసాగుతున్న డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలపై అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టి నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం దుబ్బాక పట్టణ కార్యదర్శి కొంపల్లి భాస్కర్, నాయకులు ఎం.డి. సాజిద్, కంపే ఎల్లయ్య, ఎల్లారం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఎడిటోరియల్


Editorial

## జనాభా పెరిగితే తట్టుకోగలమా ?

ఎన్నికల ముందు నేతలు ఇచ్చే హామీలన్నీ ఓట్ల కోసం అని ప్రజలు గుర్తించనంత వరకు ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతూనే ఉంటుంది. అధికారంలోకి వచ్చాక సొంత ఎజెండాతో సాగుతారు. ఓట్ల కోసం తప్ప ప్రజలపై లేదా రాష్ట్రం, దేశంపై ప్రేమతో ఏ రాజకీయ నాయకుడు పనిచేయరని గుర్తించాలి. ఎపిలో చంద్రబాబు జనాభా విషయంలో చేస్తున్న విన్యాసం ఇదే. కేవలం మైనార్టీ ఓట్లను గంపగుత్తగా లాగేసేం దుకు అధికా జనాభా కావాలి, పిల్లను కనండి, డబ్బులు ఇస్తాను అంటున్నారు. ముగ్గురు అంతకన్నా ఎక్కువ ఉన్నవారికి తక్షణం 5వేల సాయం ప్రకటించారు. మరి లోకేశ్ ఒక్క పిల్లాడితోనే ఎందుకు సరిపుచ్చాడు. ఆయనకు ఈ నియమం వర్తించదా? చంద్రబాబు ఇంట్లోనే ఈ పద్దతి లేనప్పుడు రాష్ట్రానికి ఎందుకు అంటగట్టాలన్నది ప్రజలు ఆలోచన చేయాలి. ఇందులో ఏదో మతలబు లేకుండా చంద్రబాబు ప్రకటించరని గుర్తించాలి. ఇకపోతే ఎపిలో అనేక సమస్యలు ఉన్నాయి. ముఖ్యంగా శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయి. సాయికృష్ణ అనే వ్యక్తిని పోలీసులు తీసుకుని వెళ్లి మాయం చేస్తే అతీగతీ లేదు. ఓ చిన్నారి తప్పిపోతే దిక్కులేదు. రేప్‌లు జరుగుంతుంటే అడిగేవారు లేరు. కేవలం అమరావతి ఒక్కటే ఇప్పుడు లక్ష్యంగా బాబు పాలన సాగిస్తున్నాడు. ఇప్పటికే 33 వేల ఎకరాలు సేకరించినా ఇంకా భూమి కావాలంటూ రైతులను వేధిస్తున్నారు. భూములు ఇచ్చిన వారికి సక్రమంగా ప్లాట్లు ఇచ్చి వారిని సంతోషంగా ఉంచడం లేదు. కేవలం రియల్ వ్యాపారం లక్ష్యంగా బాబు పాలన సాగుతోందని వైసిపి ఆరోపణలు చేస్తోంది. ప్రశ్నించిన వారిని వేధింపులకు గురిచేస్తున్నారని జగన్ విమర్శలు చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరచిన పాలకులు అధికారంలోకి రాగానే తమ సొంత ఎజెండా అమలు చేస్తుంటారు. ఇలా ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఎన్నో హామీలు ఇస్తారు. ఉద్యోగాలు, అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపాయాలు, అవినీతి నిర్మూలన వంటి అంశాలపై గొప్ప గొప్ప ప్రకటనలు చేస్తారు. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత వాటిలో చాలా హామీలు మరుగున పడిపోతాయి. అవినీతి అన్నది కేవలం ఉద్యోగులకే పరిమితం అయ్యింది. వారు లంచం తీసుకుంటే పట్టేస్తున్నారు. అలా పట్టుకుంటున్న వారి సంఖ్య ఒక్కశాతం కూడా ఉండదేమో. లంచం లేనిదే పని జరగడం లేదు. లంచాల కోసమే ఉద్యోగాలు ఇచ్చారేమో అనుకోవాలి. ఇకపోతే ఇప్పటికే దేశం అధిక జనాభాతో సతమతం అవుతోంది. ఉన్న జనాభాకు సరిపడా తిండి పెట్టలేక పోతున్నాం. కనీస వసతులు కల్పించలేకపోతున్నాం. విద్య,వైద్యం అందించలేకపోతున్నాం. దేశం అభివృద్ధి చెందాలంటే కనీస వసతులు కలగాలి. పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ప్రజలు కూడా తమ హక్కులతో పాటు బాధ్యతలను విస్మరించకూడదు. ఒకవైపు జవాబుదారీ పాలన, మరోవైపు బాధ్యతగల పౌరసమాజం ఉంటేనే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది. మనం ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే, పాలిస్తే నష్టపోయేది రాష్ట్రమే. నష్టం జరిగేది ప్రజలకే తప్ప పాలకులకు కాదు. భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఎదిగింది. 145 కోట్ల జనాభాతో సతమతమవుతోంది. యువశక్తి, సహజ వనరులు, మేధో సంపత్తి, సాంకేతిక నైపుణ్యం వంటి అనేక బలాలు మనకు ఉన్నా, అడుక్కు తిన్నట్లుగా ప్రజల జీవితాలు సాగుతున్నాయి. విద్య, ఆరోగ్యం, పారిశు ద్ధం, పర్యావరణం వంటి విషయాల్లో వెనకబడి ఉన్నాం. అవినీతి ఊడలు దిగుతోంది. దీనికి కారణం కేవలం పాలకుల వైఫల్యమే కాదు, ప్రజల నిర్లక్ష్యం కూడా ఓ కారణంగా చూడాలి. మనకెందుకులే అనుకుంటే ఇలాగే సాగదీస్తారు. దేశాభివృద్ధి అంటే కేవలం ప్రభుత్వ పథకాలు, భారీ ప్రాజెక్టులు మాత్రమే కాదు. ప్రతి పౌరుడి బాధ్యతా యుతమైన పాత్ర పోషించాలి. ప్రజాస్వామ్య దేశంలో పౌరస్పృహ లేకపోతే పాలకులు మనలను ఏమారుస్తారని గుర్తించాలి. ప్రజల సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాలు, అధికారం నిలబెట్టుకోవడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న తీరును చూస్తున్నాం. అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే తరహా పాలన సాగుతోంది. ఆదాయాలను మించి ఖర్చు చేస్తున్నారు. రాజకీయ నేతల జీత భత్యాలు తడిసి మోపెడు అవుతున్నాయి. సంపాదనే ధ్యేయంగా కొందరి పాలకుల ప్రధాన లక్ష్యంగా మారుతోంది. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రజలే ఇస్తారు. కాబట్టి ప్రజల సంక్షేమం కోసం పనిచేయడం పాలకుల విధి. ప్రభుత్వాలు పారదర్శకంగా వ్యవహరించాలి. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయరాదు. కానీ నిత్యం జరుగుతున్నది దుర్వినియోగం తప్ప మరోటి కాదు. ప్రజల సమస్యలను వినడం, తెలుసుకోవడం, అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా చూడడం అన్నది జరగడం లేదు. పాలనలో జవాబుదారీతనం లేకుండా పోతోంది. ఎన్నికల రోజున బలవంతంగా ఓటు వేసి ఐదేళ్లు మౌనంగా ఉండటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఇది మన కర్తవ్యాన్ని విస్మరించయడమే అవుతుంది. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, ప్రభుత్వ పనితీరును పరి శీలించడం, తప్పులను ఎత్తి చూపడం, మంచి కార్యక్రమాలను ప్రోత్సహించడం ప్రతి పౌరుడు బాధ్యతగా గుర్తించాలి. అధిక జనాభాతో సతమతం అవుతున్న మనం కనీస సౌకర్యలు లేనప్పుడు జనాభాను పెంచాలన్న పిలుపును వ్యతిరేకించాలి. ఉన్న పౌరులకు ఎలాంటి సౌకర్యాలు ఇస్తున్నారో అడగాలి. గర్భిణీలకు కనీస డెలివరీ సరిపడా ఆస్పత్రులు, వసతులు లేవన్న విషయం పాలకులకు గుర్తు చేయాలి. జనాభా పెరుగుదల అనర్థ హేతవు తప్ప అభివృద్ధి కాదని గుర్తిస్తే మంచిది.

## బంగారం ధరల పెరుగుదల... కుట్రా ?


# ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రతిబింబమా?



**భారతీయుల జీవితంలో బంగారానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. పుట్టినప్పటి నుంచి పెళ్లిళ్లు, పండుగలు, శుభకార్యాలు, ఆస్తి భద్రత వరకు బంగారం ఒక భావోద్వేగంగా, ఒక పెట్టుబడిగా, ఒక సామాజిక ప్రతిష్ఠగా మారిపోయింది. అయితే ఇటీవలి కాలంలో బంగారం ధరలు రికార్డు స్థాయిలో పెరగడంతో ప్రజల్లో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.**

**ఇది ఏదైనా కుట్రలో భాగమా? లేక ప్రపంచ ఆర్థిక పరిస్థితుల సహజ పరిణామమా?**

వాస్తవానికి బంగారం ధరలను ఏ ఒక్క దేశం లేదా ఒక్క ప్రభుత్వం నిర్ణయించదు. ప్రపంచ మార్కెట్లలో డిమాండ్, సరఫరా, అమెరికా డాలర్ విలువ, ద్రవ్యోల్బణం, అంతర్జాతీయ యుద్ధాలు, ఆర్థిక అనిశ్చితి, అలాగే ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు బంగారాన్ని నిల్వ చేసుకునే విధానం వంటి అనేక అంశాలు కలిసి ధరలను



ప్రభావితం చేస్తాయి. ప్రజలు షేర్లు, కరెన్సీలు వంటి పెట్టుబడులపై నమ్మకం కోల్పోయినప్పుడు బంగారం వైపు మొగ్గు చూపుతారు. అందువల్ల డిమాండ్ పెరిగి ధర కూడా పెరుగుతుంది.

**మరి ప్రజలకు బంగారం మీద అంత పిచ్చి ఎందుకు?**

దీనికి మన సంస్కృతి కూడా ఒక ప్రధాన కారణం. బంగారం అంటే కేవలం నగ కాదు, అది కుటుంబ గౌరవానికి, భద్రతకు, ఆపదలో ఆదుకునే ఆస్తికి ప్రతీకగా భావిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ బ్యాంకుల కంటే బంగారంపైనే ఎక్కువ విశ్వాసం కనిపిస్తుంది. అందుకే ఆదాయం వచ్చినప్పుడల్లా చాలామంది బంగారం కొనడానికే ప్రాధాన్యం ఇస్తారు.

చాలామంది దుబాయ్‌లో బంగారం చౌకగా ఉంటుందని భావిస్తారు. వాస్తవానికి అక్కడ ప్రధానంగా దిగుమతి పన్నులు, స్థానిక పన్నుల విధానం, తయారీ చార్జీలు వంటి అంశాల వల్ల ధరలో కొంత తేడా కనిపిస్తుంది. కానీ ప్రపంచ బంగారం మూలధర మాత్రం దాదాపు ఒకటే. అందువల్ల "అక్కడ చాలా చౌక, ఇక్కడ చాలా ఖరీదు" అనే అభిప్రాయం పూర్తిగా సరైనది కాదు. బంగారం మరో సామాజిక సమస్యకు కూడా కారణమవుతోంది. ఇంట్లో బంగారం నిల్వ ఉంచడం వల్ల దొంగతనాలు పెరగడం, చోరీలకు ప్రాణాలు బలికావడం, కుటుంబాలపై దాడులు జరగడం వంటి ఘటనలు తరచూ వార్తల్లో కనిపిస్తున్నాయి. ఒక లోహం కోసం మనిషి ప్రాణం పోవడం నిజంగా బాధాకరం. విలువైన వస్తువు కంటే మనిషి ప్రాణం గొప్పదనే విషయాన్ని సమాజం గుర్తించాలి.

ఇక్కడ ప్రభుత్వాల పాత్ర కూడా కీలకమే. కేంద్ర ప్రభుత్వం బంగారం దిగుమతులపై సుంకాలు విధించడం ద్వారా విదేశీ మారక నిల్వలను కాపాడాలని చూస్తుంది. అక్రమ రవాణాను అరికట్టడం, బంగారంపై ఆధారపడకుండా ఇతర పెట్టుబడులను ప్రోత్సహించడం, ప్రజల్లో ఆర్థిక అవగాహన పెంచడం వంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో ప్రపంచంలోని కేంద్ర బ్యాంకులు కూడా తమ విదేశీ మారక నిల్వల్లో భాగంగా బంగారాన్ని కొనుగోలు చేస్తుంటాయి. ఇది వారి కరెన్సీ స్థిరత్వానికి, ఆర్థిక భద్రతకు ఒక రక్షణ కవచంగా భావించబడుతుంది. అందువల్ల వారి కొనుగోళ్లు కూడా ప్రపంచ ధరలను ప్రభావితం చేస్తాయి.

చివరగా ఒక ప్రశ్న మనం మనల్ని మనమే వేసుకోవాలి. బంగారం మన జీవితాన్ని సురక్షితం చేయడానికా? లేక మన జీవితాన్ని బరువెక్కించడానికా? పెట్టుబడిగా బంగారం అవసరమే. కానీ దానిపై అతిమోజు కుటుంబాలను అప్పుల్లోకి నెట్టడం, నేరాలకు అవకాశం కల్పించడం, సామాజిక ఒత్తిడిని పెంచడం వంటి దుష్పరిణామాలకు దారితీస్తుంది. బంగారం ఒక విలువైన లోహం మాత్రమే. దానికి మనం ఇచ్చే అతివిలువే సమస్యగా మారుతోంది. సంపద అంటే కేవలం బంగారం కాదు; జ్ఞానం, ఆరోగ్యం, నైపుణ్యం, నైతికత కూడా సమాజానికి అంతే విలువైన ఆస్తులు. బంగారాన్ని అవసరానికి మించి ఆరాధించే మనస్తత్వం మారితేనే వ్యక్తి, కుటుంబం, దేశం మరింత ఆర్థికంగా బలపడతాయి.



ఉక్కల్లర్ రాజేందర్ నాథ్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9440287170.

## హైవే మ్యాన్‌కు కొత్త పరీక్ష..

# అభివృద్ధి తర్వాతి సవాళ్లు!

భారత రాజకీయాల్లో పనితీరు ఆధారంగా ప్రత్యేక గుర్తింపు సంపాదించిన నాయకులలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఒకరు. 2014 నుంచి వరుసగా అదే శాఖను నిర్వహిస్తూ దేశ మౌలిక వసతుల అభివృద్ధికి ఆయన నాయకత్వం వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ అధికారిక గణాంకాల ప్రకారం, 2014లో సుమారు 91,287 కిలోమీటర్లు ఉన్న జాతీయ రహదారుల నెట్‌వర్క్ 2025 నాటికి 1,46,204 కిలోమీటర్లకు విస్తరించింది. ఇదే కాలంలో నాలుగు లేన్లు లేదా అంతకంటే ఎక్కువ వెడల్పు కలిగిన రహదారుల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. రోడ్డు రవాణా రంగానికి కేంద్ర బడ్జెట్ కేటాయింపులు 2013–14లో సుమారు రూ. 31,130 కోట్లు ఉండగా, 2024–25 నాటికి రూ. 3 లక్షల కోట్లకు పైగా చేరడం ఈ రంగానికి ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యాన్ని సూచిస్తుంది. భారతమాల, గతి శక్తి వంటి కార్యక్రమాల ద్వారా ఎక్స్‌ప్రెస్‌వేలు, హైవేలు విస్తరించి దేశ ఆర్థిక వృద్ధికి పునాది వేశాయి. అయితే అభివృద్ధి గణాంకాలు ప్రోత్సాహకరంగా ఉన్నప్పటికీ, నాణ్యత, భద్రత, నిర్వహణ వంటి అంశాలపై ప్రశ్నలు సమానంగా ఉన్నాయి.

**రికార్డు నిర్మాణాలు.. నాణ్యతపై కొత్త ప్రశ్నలు?**

పార్లమెంటరీ సంఘాల సమీక్షలు రహదారుల నాణ్యత, భద్రతపై ముఖ్యమైన సూచనలు చేశాయి. దేశవ్యాప్తంగా గుర్తించిన 13,795 బ్లాక్ స్పాట్లలో తాత్కాలిక చర్యలు వేల సంఖ్యలో పూర్తయినా శాశ్వత సరిదిద్దుబాట్లు ఇంకా కొనసాగుతున్నాయి. మంత్రిత్వ శాఖ డిజిటల్ మానిటరింగ్, అడ్వాన్స్‌డ్ సర్వే సాంకేతికతలు, నాణ్యతా నియంత్రణ వ్యవస్థలు, లోపాలు ఉన్న కాంట్రాక్టర్లపై చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించింది. నిర్మాణ వేగం 2020–21లో రోజుకు సుమారు 37 కి.మీ. ఉండగా తర్వాత కొంత తగ్గుదల నమోదైంది. ప్రభుత్వం దీన్ని గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టులు, భూసేకరణ, పర్యావరణ అనుమతులు, అధిక ప్రమాణాల వల్ల వచ్చిన సహజ పరిణామంగా వివరిస్తోంది. అభివృద్ధి వేగంతో పాటు నాణ్యత కూడా సమానంగా కొనసాగాలన్న ప్రజా అంచనాను ఈ చర్చలు ప్రతిబింబిస్తున్నాయి. మౌలిక వసతుల విస్తరణ ఎంత ముఖ్యమో, వాటి నాణ్యతపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం కూడా అంతే కీలకం.

**ఈ20 ట్రాన్సిషన్ దశలో తేలని సాంకేతిక చిక్కులు!**

ఇటీవలి కాలంలో ఎక్కువ చర్చనీయమైన ఙు20 ఇథనాల్ మిశ్రమ ఇంధన విధానం ముడి చమురు దిగుమతులు తగ్గించడం, కార్బన్ ఉద్గారాలు తగ్గించడం, చెరకు రైతులకు అదనపు మార్కెట్ కల్పించడం వంటి లక్ష్యాలతో అమలవుతోంది. అయితే పాత వాహనాల వినియోగదారుల్లో మైలేజీ తగ్గుదల, ఇంధన అనుకూలత, నిర్వహణ వ్యయాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సాంకేతిక సంస్థలు కొత్త తరం వాహనాలు ఙు20కు అనుగుణంగా ఉన్నాయని చెబుతున్నాయి. గడ్కరీ ఈ విధానం దేశ ఇంధన భద్రత, రైతు సంక్షేమం, పర్యావరణ పరిరక్షణకు ఉద్దేశించిందని పునరుద్ఘాటించారు. విమర్శల్లో కొంత భాగం ప్రయోజన వర్గాల ప్రచారమని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజల్లో అవగాహన కల్పించడం, సాంకేతిక మార్గదర్శకాలు అందించడం, మార్పు దశను సులభతరం చేయడం ప్రభుత్వానికి కీలక బాధ్యత. శాస్త్రీయ సమాచారం, పారదర్శక కమ్యూనికేషన్ ద్వారా ఆందోళనలను పరిష్కరించాలి.

**విజయాల మధ్య వివాదాలు..**
**ప్రజా విశ్వాసమే అసలైన పరీక్ష!**

ప్రజా విధానాల విజయానికి ప్రజా విశ్వాసం అత్యంత ముఖ్యం. ఇటీవలి మీడియా కథనాలు ప్రయోజనాల సంఘర్షణపై ప్రశ్నలు లేవనెత్తగా గడ్కరీ వాటిని ఖండించి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఇథనాల్ కొనుగోలు, ధరల నిర్ణయం ప్రభుత్వ వ్యవస్థల ద్వారా జరుగుతుందని, కుటుంబ వ్యాపారాలకు ప్రత్యేక ప్రయోజనం లేదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో ప్రజాదరణ పొందిన నాయకుల చుట్టూ విశ్లేషణలు సహజం కానీ అంతర్గత సమీకరణాలను నిర్ధారిత వాస్తవాలుగా చూడకూడదు. ప్రజాస్వామ్యంలో మీడియా ప్రశ్నించే హక్కు, నాయకులు చట్టబద్ధంగా స్పందించే హక్కు రెండూ ముఖ్యం. మొత్తంగా గడ్కరీ నాయకత్వంలో మౌలిక వసతుల రంగంలో గణనీయమైన పురోగతి నమోదైందని అధికారిక గణాంకాలు సూచిస్తున్నాయి. అయితే నాణ్యత, భద్రత, పారదర్శకత, ప్రజా కమ్యూనికేషన్‌పై అంచనాలు కూడా పెరిగాయి. నిర్మించిన ప్రతి కి.మీ. రహదారి ఆర్థికాభివృద్ధికి దోహదపడటంతో పాటు భద్రత, జవాబుదారీతనం కూడా నిర్ధారించాలి. అభివృద్ధి విజయాలను గుర్తించడం ఎంత అవసరమో, ప్రజా విధానాలను వాస్తవాలు, గణాంకాలు, ప్రజా ప్రయోజనాల కోణంలో నిరంతరం సమీక్షించడం కూడా అంతే అవసరం.

ఫిరోజ్ ఖాన్,
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9640466464



## విద్యారంగ సంస్కరణలా? వ్యవస్థ విధ్వంసమా?

# రేవంత్ సర్కార్ ఆలోచించాల్సిందే!

*తెలంగాణ విద్యావ్యవస్థ పునాదులను తీవ్రంగా కదిలించేలా, రాష్ట్రంలోని దాదాపు ఇరవై మూడు వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందన్న వార్త సమాజంలో తీవ్ర కలకలం సృష్టిస్తోంది. బెంగళూరు వేదికగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించిన ఈ 'క్లస్టరింగ్' లేదా విలీన విధానంపై రాష్ట్రంలోని మేధావులు, జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్ వంటి హేమాహేమీలతో కూడిన పౌర సమాజం లేవనెత్తిన గళం పాలకుల కళ్లు తెరిపించాల్సిన సందర్భమిది.*



ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేస్తామంటూ, నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందిస్తామంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ఏకంగా బడుల సంఖ్యను ఇరవై ఏడు వేల నుంచి నాలుగు వేలకు కుదించాలనుకోవడం సంస్కరణ అనిపించుకోదు. ఇది అనాలోచిత విద్యా సంహారంగా మారే ప్రమాదం ఉందని విద్యావేత్తలు గట్టిగా హెచ్చరిస్తున్నారు. ఒక ఊరికి బడి అనేది కేవలం అక్షరాలు నేర్పే నాలుగు గోడల కేంద్రం కాదు, అదొక సామాజిక చైతన్య వేదిక, గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే నిలువుటద్దం. మేధావుల బహిరంగ లేఖలో పేర్కొన్నట్లు, ఈ నిర్ణయం గనుక క్షేత్రస్థాయిలో అమలైతే దాదాపు పదిహేను వేల గ్రామాలు 'బడి లేని ఊళ్లుగా' మారిపోయే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. ఇది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెచ్చిన ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని బాహాటంగా తుంగలో తొక్కడమే అవుతుంది.

ఇంటి ముంగిట బడి లేకపోతే, ఆర్థిక స్తోమత లేని బడుగు, బలహీన, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల పిల్లలు, ముఖ్యంగా ఆడపిల్లలు చదువును మధ్యలోనే ఆపేసే దుస్థితి దాపురిస్తుంది. కిలోమీటర్ల దూరం ప్రయాణించి పక్క ఊర్లకు వెళ్లి చదువుకునే సామాజిక వాతావరణం, భద్రత ఇంకా మన గ్రామాల్లో పూర్తిస్థాయిలో నెలకొనలేదు. దీనివల్ల డ్రాపౌట్ల సంఖ్య విపరీతంగా పెరిగిపోయి, బాల్యమంతా చదువుకు దూరమై మళ్లీ పాత రోజుల్లోలాగా బాలకార్మిక వ్యవస్థ వైపు మళ్లే ప్రమాదం పొంచి ఉంది. గత పాలకుల హయాంలో మూతపడిన ఆరు వేల బడులను మెరుగైన సదుపాయాలతో తిరిగి తెరుస్తామని, విద్యపై పెట్టే ఖర్చు భవిష్యత్తుపై పెట్టే పెట్టుబడి అని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి రాగానే ఇలాంటి తిరోగమన నిర్ణయానికి పూను కోవడం ప్రజాస్వామ్య ద్రోహమే అవుతుంది. బడ్జెట్‌లో విద్యకు పదిహేను శాతం నిధులు ఇస్తా మని వాగ్దానం చేసి, ఆచరణలో నిధుల కోత విధించడం పాలకుల ద్వంద్వ నీతిని స్పష్టం చేస్తోంది. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి కారణం పాలకుల నిర్లక్ష్యం, మౌలిక వసతుల లేమి, ఉపాధ్యాయుల కొరతే తప్ప, ప్రజలకు చదువుపై ఆసక్తి లేకపోవడం కాదు. ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీని అదుపు చేసేందుకు జీవో నెంబర్ వన్ ను పకడ్బందీగా అమలు చేయడంలో వైఫల్యాలు కూడా ప్రభుత్వ పాఠశాలల పతనానికి కారణమయ్యాయి.

అయితే, ఈ సంక్లిష్టమైన వ్యవహారాన్ని కేవలం రాజకీయ కోణంలోనే కాకుండా పాలకుల పరిపాలనా వ్యూహం వైపు నుంచి కూడా నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఒకే ఒక్క విద్యార్థి లేదా ఐదుగురు విద్యార్థుల కోసం ఒక బడిని నడపడం, అక్కడ ఒకే ఉపాధ్యాయుడితో ఐదు తరగతుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం ఆచరణాత్మకంగా అసాధ్యమనే వాదనలోనూ కొంత హేతుబద్ధత ఉంది. పాఠశాలల్లో విద్యార్థులు లేకపోయినా కేవలం భవనాలను కాపాడుకుంటూ కూర్చోవడం వల్ల ఆశించిన విద్యా ప్రమాణాలు సాధించలేమన్నది పాలకుల ఆలోచన కావచ్చు. వనరులను విచ్ఛిన్నం చేయడం కంటే, ఒక క్లస్టర్ పరిధిలో అన్ని రకాల ఆధునిక సదుపాయాలు, ప్రతీ సబ్జెక్టుకు నిపుణులైన ఉపాధ్యాయులు, డిజిటల్ ల్యాబ్‌లు, లైబ్రరీలు, ఆట స్థలాలు ఉన్న ఒక సమగ్రమైన మోడల్ స్కూల్ ను ఏర్పాటు చేయడం ద్వారా పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించవచ్చనేది ప్రభుత్వ యోచన కావచ్చు. కానీ ఒకవేళ ప్రభుత్వం నిజంగానే విద్యా ప్రమాణాల మెరుగుదల కోసమే ఈ విలీన ప్రక్రియను చేపట్టదలిస్తే, ప్రతీ గ్రామం నుండి విద్యార్థులను సురక్షితంగా, ఉచితంగా స్కూలుకు చేర్చే బాధ్యతను ప్రభుత్వమే పూర్తిస్థాయిలో స్వీకరించాలి. అమెరికా, యూరప్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో స్కూల్ బస్సుల ద్వారా విద్యార్థులను కేంద్రీకృత పాఠశాలలకు తరలించే పద్ధతి విజయవంతమైంది. కానీ మన దేశంలో, ముఖ్యంగా తెలంగాణ క్షేత్రస్థాయి మౌలిక వసతుల పరంగా అలాంటి పటిష్టమైన రవాణా ప్రణాళిక లేకుండా నేరుగా బడులను మూసివేస్తామనడం అత్యంత తొందరపాటు చర్య అవుతుంది.
రవాణా వ్యవస్థ సరిగ్గా లేని కారణంగా ఏ ఒక్క పేద బిడ్డ బడికి దూరమైనా, అది ఈ సంక్షేమ ప్రభుత్వానికి పెద్ద మచ్చగా మిగిలిపోతుంది. విద్య అనేది లాభనష్టాలను బేరీజు వేసే వ్యాపార రంగం కాదు, అది ఒక తరం భవిష్యత్తును తీర్చిదిద్దే అత్యున్నత సామాజిక బాధ్యత. బడ్జెట్ భారాన్ని తగ్గించుకోవడమే పరమావధిగా చూస్తే, అది సంక్షేమ ప్రభుత్వ లక్షణం అనిపించుకోదు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా విద్యా విధానాలను ప్రయోగశాలలుగా మార్చడం వల్ల నష్టపోయేది విద్యార్థులే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రతిపాదనలపై మొండిగా ముందడుగు వేయకుండా, వెంటనే మేధావులు, ఉపాధ్యాయ సంఘాలు, పౌర సమాజంతో విస్తృత స్థాయి చర్చలు జరపాలి. క్షేత్రస్థాయి వాస్తవాలను గౌరవిస్తూ, ఏ ఒక్క పేద బిడ్డ కూడా దూరం కారణం చేత బడికి దూరం కాకుండా చూస్తూనే, విద్యా ప్రమాణాలను పెంచే సమతుల్య విధానాన్ని అవలంబించడమే నేటి తెలంగాణకు అత్యంత ఆవశ్యకం.

విద్యా వ్యవస్థను కేవలం సంఖ్యల రూపంలో చూడకుండా, గుణాత్మక మార్పుల వైపు నడిపించడమే నిజమైన అభివృద్ధి. ప్రభుత్వ పాఠశాలల మనుగడ సాగితేనే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుంది. ప్రైవేటు శక్తుల చేతుల్లోకి విద్య పూర్తిగా వెళ్ళిపోతే సామాజిక అసమానతలు మరింత పెరుగుతాయి. కాబట్టి ప్రభుత్వం తన ముందస్తు వ్యూహాలను పునఃసమీక్షించుకుని, ప్రజామోదయోగ్యమైన రీతిలో సంస్కరణలను అమలు చేయాలి. ఒక ప్రజాస్వామ్య సమాజంలో ఏకపక్ష నిర్ణయాల వల్ల ఆందోళనలు తీవ్రతరమవుతాయే తప్ప సమస్యలు పరిష్కారం కావు. ఇప్పటికైనా రేవంత్ సర్కార్ మొండి పట్టుదలకు పోకుండా మేధావుల హెచ్చరికలను సానుకూలంగా స్వీకరించి, విద్యా రంగాన్ని కాపాడే చర్యలు చేపట్టాలని తెలంగాణ సమాజం ముక్తకంఠంతో కోరుతోంది.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ 9848559863

ప్రభాతవని సింగిడి ప్రతి రంగూ ఓ నిజం Singidi బుధవారం 8-7-2026

# భారత్--క్యూబా స్నేహబంధం మరింత బలోపేతం కావాలి

## ఎంపీ వంశీ కృష్ణ



**పెద్దపల్లి,జూలై 07(సింగిడి):** భారత్--క్యూబా మధ్య చారిత్రాత్మక స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పెద్దపల్లి ఎంపీ జి. వంశీ కృష్ణ గడ్డం అన్నారు. మంగళవారం క్యూబా రిపబ్లిక్ రాయబారి జువాన్ కార్లోస్ మార్సాన్ అగ్గైలెరాతో భేటీ అయిన ఆయన, ద్వైపాక్షిక సహకారం, ప్రజల మధ్య సంబంధాల విస్తరణపై విస్తృతంగా చర్చించారు. భారత్--క్యూబా ద్వైపాక్షిక సంబంధాలు, సహకార విస్తరణ, ప్రజల మధ్య స్నేహబంధాల బలోపేతంపై ఇరువురు చర్చించారు. చారిత్రాత్మక భారత్--క్యూబా స్నేహాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఎంపీ వంశీ కృష్ణ పేర్కొన్నారు.

# మహిళలకు ఉచిత బ్యూటీషియన్ శిక్షణ

**గోదావరిఖని, జూలై 07(సింగిడి):** ఎన్ టి పి సి , సి ఎస్ ఆర్ విభాగం, 'దీప్తి మహిళా సమితి' సహకారంతో సాయి సేవా సమితి సమీపంలోని వృత్తి విద్యా శిక్షణ కేంద్రంలో స్థానిక గ్రామాల మహిళల కోసం 3 నెలల బ్యూటీషియన్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు గల మహిళలు ఈ కోర్సుకు అర్హులు. సీట్లు పరిమితంగా ఉండగా, ఆసక్తి గల అభ్యర్థులు శ్రీమతి అర్చన (6281046137)ను సంప్రదించి జూలై 15, 2026లోపు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందించుకుని ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చని పేర్కొన్నారు.

# ప్రతి నిరుపేదకు పక్కా ఇల్లు

## కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి, జూలై 7(సింగిడి):** రామగుండం నియోజకవర్గంలోని ప్రతి అర్హ నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసి, ఎల్-1, ఎల్-2 దరఖాస్తులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గుడిసెల్లో నివసిస్తున్న వారికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటించాలని సూచించారు. గుడిసె రహిత నగరంగా రామగుండాన్ని తీర్చిదిద్దడమే ప్రభుత్వ ఉద్దేశమని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె. అరుణశ్రీ, హౌసింగ్ పీడీ రాజేశ్వర్, ఆర్డీవో గంగయ్య, ఈడీఎం కవిత తదితర అధికారులు పాల్గొన్నారు.

# అర్బన్ బ్యాంక్ పీఐసీ కమిటీ బాధ్యతల స్వీకరణ

ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు పాత కమిటీ యథావిధిగా కొనసాగింపు

పర్సన్ ఇన్ ఛార్జ్ (పీఐసీ) కమిటీ చైర్మన్‌గా

గడ్డం విలాస్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ



**కరీంనగర్, జూలై 7(సింగిడి):** కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ పర్సన్ ఇన్-ఛార్జ్ (పీఐసీ) కమిటీ చైర్మన్‌గా గడ్డం విలాస్ రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ సహకార ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఎన్నికలకు ముందు ఉన్న పీఐసీ కమిటీని యథావిధిగా కొనసాగించాలని ఉత్తర్వులు జారీ కావడంతో కమిటీ అధికారికంగా బాధ్యతలు చేపట్టింది. కమిటీ సభ్యులుగా మడుపు మోహన్, లక్ష్మణ్ రాజు, విద్యాసాగర్, సందీప్, ముక్క భాస్కర్, ముల లక్ష్మి, షామియోద్దీన్, మంగి రవీందర్, నాగుల సతీష్, మార్క రాజు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ప్రధాన కార్యనిర్వాహక అధికారి నునుగొండ శ్రీనివాస్, శాఖ మేనేజర్ ఎలుక సుధాకర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



- పోలీసులపై దాడికి ప్రయత్నించిన వారిపై కేసు నమోదు..
- కవ్వింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదు
- మీడియా సమావేశంలో హుజరాబాద్ ఏసిపి మాధవి

# అక్రమ ఇసుక రవాణా చేస్తే.. తాటతీస్తాం..

**జమ్మికుంట, జూలై 7 (సింగిడి):** జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను దారి దోపిడీ కేసులో అరెస్టు చేసినట్లు హుజూరాబాద్ ఏసిపి మాధవి తెలిపారు. జమ్మికుంట మండలంలోని కోరపల్లి గ్రామ శివారులో ఏర్పాటుచేసిన పోలీసుల చెక్ పోస్ట్ వద్ద పోలీసుల విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా పోలీసులపై దాడి ఘటనను ఆ మార్గం గుండా వెళ్తున్న దోగ్గల రాజు అనే వ్యక్తి వీడియో తీస్తుండగా అతనిని వెంకటేశ్వర పల్లి గ్రామ శివారు వద్ద చితకబాది అతని ద్విచక్ర వాహనాన్ని అపహరించుకుని వెళ్లారు. పోలీసుల విధులకు ఆటంకం కల్పించడమే కాకుండా ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో విలాసాగర్ గ్రామానికి చెందిన రాచపల్లి ప్రశాంత్, రాచపల్లి సమ్మయ్య, రాచపల్లి రాజులను సైదాబాద్ ఎక్స్ రోడ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ ముగ్గురు వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేయగా వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఏసీపీ మాధవి తెలిపారు. విచారణలో వారు చేసిన నేరాన్ని అంగీకరించడం తోపాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని పరారీలో ఉన్న రజనీకాంత్ రంజిత్ కళ్యాణ్ అనే మిగతా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ సమావేశంలో సీఐ రామకృష్ణ గౌడ్ ఎస్ఐలు రమేష్ రవి, సంజయ్ తో పాటు పోలీస్ సిబ్బంది యాకూబు జలంధర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

**ఆరుగురు వ్యక్తులపై రౌడీషీట్..**

ఈ సమావేశంలో ఏసీపీ మాధవి మాట్లాడుతూ, గతంలో నేర చరిత్ర కలిగిన రాచపల్లి సమ్మయ్య రాచపల్లి ప్రశాంత్ రాచపల్లి రాజు తోపాటు చంద్రగిరి రజనీకాంత్ రంజిత్ కళ్యాణ్ లపై రౌడీషీట్ ఓపెన్ చేయడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఇకపై ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే గతంలో ఉన్న కేసుల తోపాటు రెండు కేసులో ఉన్నట్లయితే ట్రాక్టర్ సీజ్ చేసి కోర్టుకు సరెండర్ చేస్తామని తెలిపారు.

**ఈజీ మనీ కోసమే ఇసుక అక్రమ దందా..**

జమ్మికుంట మండలంలోని మానేరు పరివాహక ప్రాంతమైన వావిలాల శంభుని పల్లె విలాసాగర్ తనుగుల గండ్రపల్లి గ్రామాల నుండి కొంతమంది యువకులు ఈజీ మనీతో జల్సాల కొరకు అక్రమ ఇసుక దందా చేస్తున్నారని వారికి వారి కుటుంబ సభ్యులకు గతంలో కౌన్సిలింగ్ నిర్వహించినప్పటికీ వారిలో మార్పు రావడంలేదని ఏసిపి తెలిపారు. ఇసుక రవాణా చేసి ఆ డబ్బులతో విచ్చలవిడిగా మద్యం సేవించి విచక్షణ కోల్పోయి ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఇంత జరిగినా వారి తల్లిదండ్రులు వారిని పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని ఆమె తెలిపారు. ఇకనైనా మార్పు రాకపోతే చట్టపరంగా కఠిన శిక్షలు తప్పవని ఆమె హెచ్చరించారు. విలాసాగర్ గ్రామం పేరు చెబితే భవిష్యత్తులో ఆ గ్రామంతో బంధుత్వం కలుపు కోవడానికి ఎవరు ముందుకు రాని పరిస్థితి నెలకొంటుందని ఏసిపి తెలిపారు.

# రూ.70 కోట్ల నిధులతో కరీంనగర్ అభివృద్ధికి కొత్త ఊపు

వరదలు, ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్, జులై7(నినాదం):** స్మార్ట్ సిటీ ప్రత్యేక నిధుల కింద రూ.70 కోట్లతో కరీంనగర్ నగరంలో పలు కీలక అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా వరదలు, ట్రాఫిక్ రద్దీ, పార్కింగ్ కొరత, రహదారులు, విద్యుత్ వ్యయం తదితర సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ నిధుల మంజూరుకు విశేష కృషి చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు నగర ప్రజలు, నగరపాలక సంస్థ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలియజేశారు. అన్ని పనులకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు సిద్ధమవుతున్నాయని, అనంతరం టెండర్లు ఆహ్వానించి పనులను వేగంగా ప్రారంభిస్తామని మేయర్ వెల్లడించారు.

**చేపట్టనున్న ప్రధాన అభివృద్ధి పనులు:**

- రామ్‌నగర్, ఆర్టీసీ వర్క్‌షాప్, మంచిర్యాల చౌరస్తాల్లో ఆధునిక వరద నీటి పారుదల వ్యవస్థ -- రూ.21.50 కోట్లు
- టవర్ సర్కిల్‌లో బహుస్థాయి యాంత్రిక వాహన పార్కింగ్ కేంద్రం -- రూ.25 కోట్లు
- మున్సిపల్ భవనాలపై సౌర విద్యుత్ ప్యానెల్ల ఏర్పాటు రూ.2 కోట్లు
- సదాశివపల్లి జంక్షన్ ఆధునీకరణ -- రూ.3 కోట్లు
- పర్యావరణహిత స్పాంజ్ పార్కు అభివృద్ధి -- రూ.3 కోట్లు
- వల్లంపాహాడ్‌లో మోడల్ వైకుంఠధామం నిర్మాణం రూ.2.50 కోట్లు
- అల్కాపురి కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం రూ.1 కోటి
- జంతు జనన నియంత్రణ, సంక్షేమ కేంద్రం ఏర్పాటు రూ.2 కోట్లు
- కేఆర్ కాలనీ నుంచి వల్లంపాహాడ్ వంతెన వరకు మధ్యభాగ విద్యుద్దీపాల ఏర్పాటు రూ.2 కోట్లు
- సర్వేలు, రూపకల్పన, సమగ్ర ప్రాజెక్టు నివేదికల తయారీకి సలహా సేవలు రూ.1.50 కోట్లు

ప్రజల అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ నాణ్యత, పారదర్శకతతో నిర్ణీత గడువులో పనులు పూర్తి చేసి కరీంనగర్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. నగర అభివృద్ధిలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఎస్ఐఆర్ సర్వే వేగవంతం చేయాలి

గడువులోగా సర్వే పూర్తి చేసి వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని అధికారులకు ఆదేశం

ఈఆర్ఓ నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్



**కరీంనగర్, జూలై 7(సింగిడి):** నగరవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) సర్వే ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్, ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ) ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆర్డీవో షర్మిలా, రెవెన్యూ అధికారులతో కలిసి బూత్ స్థాయి పర్యవేక్షకులు, పర్యవేక్షణ అధికారులు, నిర్వహణ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. బూత్‌వారీగా సర్వే పురోగతి, గణన పత్రాల పంపిణీ, సేకరణ, క్షేత్రస్థాయి పరిశీలన, ఓటర్ల వివరాల ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలను సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, నగరపాలక సంస్థ పరిధిలో ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా బూత్ స్థాయి అధికారులు, పర్యవేక్షకులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గణన పత్రాల పంపిణీ, సేకరణను నేటితో వంద శాతం పూర్తి చేసి, సేకరించిన వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఆయాజ్, డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొహియుద్దీన్, మండల రెవెన్యూ అధికారులు రాజేష్, వెంకటలక్ష్మి, నర్సింహారావు, ఎన్నికల విభాగం డీటీ సంపత్, బూత్ స్థాయి పర్యవేక్షకులు, పర్యవేక్షణ అధికారులు పాల్గొన్నారు.

# మూడో జోనల్ స్థాయి పోలీస్ విధుల పోటీలు ప్రారంభం

వృత్తి నైపుణ్యాల పెంపు, శాస్త్రీయ దర్యాప్తు సామర్థ్యాల అభివృద్ధే లక్ష్యం

సీపీ గౌష్ ఆలం




**కరీంనగర్, జూలై 7(సింగిడి):** తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో మూడో జోనల్ స్థాయి పోలీస్ విధుల పోటీలు 2026 మంగళవారం రోజున కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు జూలై 7, 8 తేదీల్లో నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. జోన్ 3 పరిధిలోని కరీంనగర్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన మొత్తం 91 మంది అధికారులు, సిబ్బంది ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. కరీంనగర్ నుంచి 24 మంది, సిద్ధిపేట నుంచి 19 మంది, రాజన్న సిరిసిల్ల నుంచి 21 మంది, కామారెడ్డి నుంచి 13 మంది, మెదక్ నుంచి 14 మంది హాజరయ్యారు. పోలీసు సిబ్బందిలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించడం, శాస్త్రీయ దర్యాప్తు పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, సమర్థవంతమైన సేవలందింపులో ప్రతిభను మెరుగుపరచడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని సీపీ తెలిపారు. ఈ సందర్భంగా శాస్త్రీయ దర్యాప్తు, విధ్వంసక చర్యల నిరోధక తనిఖీలు, శునక దళం, కంప్యూటర్ పరిజ్ఞానం, ఛాయాగ్రహణం, దృశ్య చిత్రీకరణ విభాగాల్లో పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని బహుళ జోన్ల స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకాల ప్రకారం బంగారు పతక విజేతలకు రూ.3 లక్షలు, మూడు ముందస్తు వార్షిక వేతన పెంపులు, వెండి పతక విజేతలకు రూ.2 లక్షలు, రెండు ముందస్తు వేతన పెంపులు, కాంస్య పతక విజేతలకు రూ.1 లక్ష, ఒక ముందస్తు వేతన పెంపు అందజేయనున్నట్లు తెలిపారు. జట్టు విజేతలకు కూడా నగదు ప్రోత్సాహకాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ పోటీలను కేవలం పోటీగా కాకుండా వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకునే అవకాశంగా భావించి, క్రమశిక్షణ, అంకితభావంతో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచాలని సీపీ సూచించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్ జి, వేణుగోపాల్, వెంకటస్వామి, వివిధ జిల్లాల అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి

ట్రైనీ కలెక్టర్ హరిప్రసాద్

జమ్మికుంట మున్సిపల్ ఆవరణలో మొక్కలు నాటిన ఐఏఎస్

**జమ్మికుంట, జులై 7 (సింగిడి):** ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ట్రైనీ కలెక్టర్ పి హరి ప్రసాద్ అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించడానికి వచ్చిన ట్రైన్ కలెక్టర్ హరిప్రసాద్ కు మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి ఘనంగా స్వాగతం పలికి శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కార్యాలయం ఆవరణంలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ట్రైనీ కలెక్టర్ హరిప్రసాద్ మొక్కలను నాటారు. అనంతరం కార్యాలయంలో జరుగుతున్న అడ్మినిస్ట్రేషన్ పనులను గురించి ఆరా తీయడంతో పాటు రికార్డులు అధికారుల పనితీరు గురించి ఆరా తీశారు. ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో జరుగుతున్న సర్ కార్యక్రమం గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ను జమ్మికుంట పట్టణంలో ఉన్న జనాభా వివరాలతో పాటు ఆదాయ వ్యయాల గురించి తెలుసుకోవడంతో పాటు పాలనాపరమైన సమస్యలను గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ట్రైన్ కలెక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రతి ఒక్కరు మొక్కలు నాటే విధంగా చూడాలని, మొక్కల సంరక్షణ వల్ల కలిగే లాభాలను గురించి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రాజిరెడ్డి తోపాటు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



**ఔట్సోర్సింగ్ ఉద్యోగిపై ఆరా**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలో గత కొద్ది సంవత్సరాలుగా అవుట్సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న వ్యక్తి పనితీరుపై ఆరా తీయడంతో పాటు గతంలో సానిటరీ ఇన్స్పెక్టర్ గా పనిచేసిన వ్యక్తి అక్రమ వసూళ్లపై ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా జమ్మికుంట కమిషనర్ మల్లికార్జున స్వామిని అడిగి వివరాలు ఆరా తీశారు. గతంలో ఉద్యోగుల వద్ద నుండి అధిక మొత్తంలో వసూలు చేసిన విషయంతో పాటు జమ్మికుంట పట్టణంలో అక్రమ వసూళ్లకు పాల్పడిన విషయాలను గురించి ప్రశ్నించారు. కాగా ఈ విషయంపై మల్లికార్జున స్వామి సానిటరీ ఇన్స్పెక్టర్ గా ఉన్న వ్యక్తి పై ఆరోపణలు మాత్రమే వచ్చాయని ఫిర్యాదు చేయడానికి ఎవరు రాలేదని ఫిర్యాదుదారులు ఫిర్యాదు చేసినట్లయితే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

# కాళేశ్వర ఆలయ వ్యవహారాలపై వివరణ ఇవ్వాలి

## మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పుట్ట మధూకర్





**మంథని, జూలై 7: (సింగిడి):** కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ నిధుల వినియోగం, పుష్కరాల కిట్ల పంపిణీ, ఆలయ నిర్వహణ అంశాలపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కుటుంబంపై మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పలు ఆరోపణలు చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ధన్వాడ గ్రామంలో పంపిణీ చేసిన చీరలు 2025 పుష్కరాలకు సంబంధించినవేనని ఆరోపిస్తూ, అవి అక్కడికి ఎలా చేరాయో సంబంధిత వర్గాలు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆలయ నిధుల ఖర్చుల వివరాలను వెల్లడించకుండా సుప్రీంకోర్టు మార్గదర్శకాలను సాకుగా చూపుతున్నారని విమర్శించారు. పుష్కరాల ఏర్పాట్లు, గంగాహారతి నిర్వహణ, ఆలయ నిధుల వినియోగంలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, దీనిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. కాళేశ్వరం వంటి పవిత్ర పుణ్యక్షేత్ర ప్రతిష్ఠను కాపాడేందుకు ప్రజలు చైతన్యవంతులై ప్రశ్నించాలని పుట్ట మధూకర్ పిలుపునిచ్చారు.

# సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వాలి

## సిపి, అంబర్ కిశోర్ ఝా

**గోదావరిఖని , జూలై 7(సింగిడి):** నేరాల దర్యాప్తులో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో విచారణ చేపట్టాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పోలీసు అధికారులకు సూచించారు. కమిషనరేట్‌లో నిర్వహించిన కాళేశ్వరం జోన్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో ఆయన మాట్లాడుతూ, ఫోరెన్సిక్ సైన్స్, వేలిముద్రల విశ్లేషణ, క్రైమ్ సీన్ నిర్వహణ, కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానం వంటి ఆధునిక దర్యాప్తు పద్ధతుల్లో పోలీసు సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డ్యూటీ మీట్‌లు కేవలం పోటీలకే పరిమితం కాకుండా వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకునే, అనుభవాలను పంచుకునే ఉత్తమ వేదికలని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన అధికారులు రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో కాళేశ్వరం జోన్‌కు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు.

# సీసీ కెమెరాలతో... నేరాలకు చెక్

ఒక్క నిఘానేత్రం వందమంది పోలీసులతో సమానం

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

వ్యాపారస్తులతో హుజరాబాద్ ఏసిపి మాధవి



**జమ్మికుంట, జులై 7 (సింగిడి):** సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలకు చెక్ పెట్టడమే కాకుండా నేరస్తులను పట్టుకోవడం సులభతరం అవుతుందని హుజురాబాద్ ఏసిపి మాధవి అన్నారు. జమ్మికుంట పట్టణంలోని పోలీస్ స్టేషన్లో బంగారు ఆభరణాల షాపు యజమానులతో పాటు వివిధ వ్యాపారస్తులతో సీసీ కెమెరాల ఆవశ్యకత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసిపి మాధవి మాట్లాడుతూ సీసీ కెమెరాలు 100 మంది పోలీసుల తో సమానంగా పనిచేస్తాయని కొన్ని సమయాలలో కీలకమైన ఆధారాలను సేకరించడంలో నిఘా నేత్రాలు ఎంతో గాను ఉపయోగపడతాయని పేర్కొన్నారు. శాస్త్ర సాంకేతిక నైపుణ్యం అభివృద్ధి చెందుతున్న నేటి తరుణంలో ప్రతి ఒక్కరు విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు వార్డులలో గ్రామాలలో నిఘా నేత్రాలు ఏర్పాటు చేసేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందజేయాలని కోరారు. వర్తక వ్యాపార సంస్థలు ఎక్కువగా ఉన్న జమ్మికుంట లాంటి ప్రదేశాలకు ప్రతి వాడలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అత్యంత అవసరమని, నేర పరిశోధనలోనే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తుల సంచారం కానీ, అనుమానితుల వివరాలు తెలుసుకునేందుకు నిఘా నేత్రాలు ఉపయోగపడతాయని వెల్లడించారు. ఇటీవల కాలంలో జరిగిన జువెలరీ దొంగతనంలో సీసీ కెమెరాలు అత్యంత కీలకంగా పనిచేశాయని వాటి ఆధారంగా నిందితులు ఏ మార్గం గుండా వచ్చారో కనుక్కొని ఆ దిశగా విచారణ చేపట్టడం వల్ల అనతి కాలంలోనే నేరస్తులను పట్టుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ప్రతి పౌరుడు తమ వంతు బాధ్యతగా సీసీ కెమెరాల ఏర్పాటుకు చేయూతను అందించడంతో పాటు పోలీస్ శాఖకు సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ రామకృష్ణ గౌడ్ తో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
బుధవారం 8-7-2026





# బీఆర్ఎస్‌కు షాక్..

## కాంగ్రెస్‌లోకి కాళేశ్వరం సర్పంచ్ సహా 20 మంది చేరిక

**మంథని, జూలై 07(సింగిడి):** మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామ సర్పంచ్ మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ సుధీర్ కుమార్‌తో పాటు బీఆర్ఎస్‌కు చెందిన 20 మంది నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి కొత్తగా చేరిన నాయకులను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్‌తోనే మంథని నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు రాష్ట్ర, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, రహదారులు, ప్రభుత్వ ఆస్పత్రుల మౌలిక సదుపాయాల కల్పనతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని కొనియాడారు.

## చికెన్ వేస్టేజీ వేలంలో రూ.32.52 లక్షలతో కాంట్రాక్ట్ దక్కించుకున్న వెంకటయ్య



**వనపర్తి ప్రతినిధి, జూలై 7 (సింగిడి):** వనపర్తి పురపాలక సంఘం ఆధ్వర్యంలో 2026-27 ఆర్థిక సంవత్సరం 9 నెలలకు సంబంధించిన చికెన్ వేస్టేజీ, జంతు వధశాల, పశువుల సంతకు సంబంధించి మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్, పుర చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, శానిటరీ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి, కౌన్సిలర్ల సమక్షంలో వేలం ప్రక్రియ నిర్వహించారు. చికెన్ వేస్టేజీ వేలంలో మొత్తం 14 మంది కాంట్రాక్టర్లు పోటీపడ్డారు. ఎస్.వెంకటయ్య అనే కాంట్రాక్టర్ రూ. 32.52 లక్షలు అత్యధిక పాట పాడి కాంట్రాక్టు దక్కించుకున్నారు. జంతు వధశాల వేలంలో ఒకే ఒక్కరు పాల్గొన్న గోర్ల జగన్నాథం రూ. 1,08,900 కు కాంట్రాక్టు దక్కించుకున్నారు. కాగా వారాంతపు పశువుల సంత వేలాన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ తెలిపారు. ఈ వేలం పారదర్శకంగా నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. చికెన్ వేస్టేజీ వేలంలో అత్యధికంగా పాట పాడి దక్కించుకున్న కాంట్రాక్టర్ ఎస్. వెంకటయ్య ను మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్, కౌన్సిలర్లు శాలువాలతో సన్మానించారు.

## ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు పరామర్శ



**కుత్బుల్లాపూర్ జులై 7 (సింగిడి):** ఇటీవల వరంగల్ కన్నెపల్లి రిజర్వాయర్ పర్యటనకు వెళ్తున్న నేపథ్యంలో మార్గమధ్యలో జరిగిన ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డ మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ను శంభీపూర్ లోని నివాసంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించిన శాసన మండలి ప్రతిపక్ష నేత ఎమ్మెల్సీ మధుసూదనా చారి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, తక్కళ్లపల్లి రవీందర్ రావు ఈ సందర్భంగా వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. శంబిపూర్ రాజు త్వరగా కోలుకోవాలని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని ఈ సందర్భంగా వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన స్పీకర్



**వికారాబాద్, జూలై 7(సింగిడి):** వికారాబాద్ జిల్లా పరిధిలోని ఆయా అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శ్రీకారం చుట్టారు. దారూర్ మండలం తరిగోపుల, మోమిన్ కుర్దు గ్రామంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా తరిగోపులలో పి ఏ సీఎస్ దారూర్ సొసైటీ గోదాం నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరణ చేసి, తరిగోపుల గ్రామంలో భూసర్వే పై ఏర్పాటు చేసిన గ్రామ సభలో పాల్గొన్నారు. అనంతరం మోమిన్ కుర్దు గ్రామంలో లబ్ధిదారులు నిర్మించుకున్న నాలుగు ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# రేవంత్ అసమర్థత.... తిరోగమన దిశలో రాష్ట్ర అభివృద్ధి

## గోదావరి జలాలను వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలం

## మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, జూలై 7 (సింగిడి):** రేవంత్ రెడ్డి అసమర్థత వల్ల రాష్ట్ర అభివృద్ధి తీరోగమన దిశలో ఉందని, గోదావరి జలాలను వినియోగించుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మంగళవారం డల్లాస్ సిటీలోనీ ఫ్రిస్కోలో భారత రాష్ట్ర సమితి పార్టీ తెలంగాణ ఎన్నారైల ఆధ్వర్యంలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, సాగునీటిరంగ నిపుణులు వి.ప్రకాష్ పాల్గొని వర్తమాన రాజకీయాలు, కుంటుపడిన తెలంగాణ అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాల కోసం నేటి ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థను తిరోగమన దిశలోకి నెట్టివేశారని స్పష్టం చేశారు. 50 ఏండ్లలో గోదావరి జలాలను వినియోగించుకోవడం కోసం ఒక్క బ్యారేజ్ కూడా కట్టకుండా సాగునీరు ధవళేశ్వరం (డెల్టా) తరలించిన దుస్థితి కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందని అన్నారు. నేడు కన్నే పంపు హౌస్ నుండి రోజుకు సగటున 9 టి.ఎం.సిల జలాలు(లక్ష క్యూసెక్కుల) ధవళేశ్వరంకు తరలిపోతున్నాయని నిరంజన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్ కేవలం మూడున్నర ఏండ్లలో కాళేశ్వరం నిర్మించి 3 బ్యారేజీలు కట్టి గతంలో సాగు నీళ్లు అందించి రైతులను ఆదుకున్నారని నిరంజన్ రెడ్డి గుర్తు చేశారు. వినియోగంలో ఉన్న సాగుజాలాలు అందించలేని






అసమర్థత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదని ఆయన దుయ్యబట్టారు. కన్నే పంపు హౌస్ ద్వారా సాగునీళ్ళు ఎత్తిపోస్తే నేడు ఉత్తర తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నేడు కాంగ్రెస్ కరువు పరిస్థితులు తెచ్చిందని అన్నారు. 90 శాతం పూర్తియిన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును10 శాతం పనులు చేసి రిజర్వాయర్లు నింపి సాగు నీళ్లు అందించకుండా పడావ్ పెట్టారని అన్నారు. నేటి ఆధునిక కాలంలో సహజ సంపద, వనరులు కలిగి ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని కెసిఆర్ అభివృద్ధి పథంలో నిలిపారని, పరిపాలన చేతకాని ప్రభుత్వ విధానాల వల్ల తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమై అభివృద్ధి తిరోగమన దిశలో పయనిస్తుందని నిరంజన్ రెడ్డి అన్నారు. తెలంగాణ అభివృద్ధి, వర్తమాన రాజకీయాల గూర్చి సుదీర్ఘ చర్చ చేసి నేటి తెలంగాణ పరిస్థితులను సదస్సులో వి.ప్రకాష్ వివరించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఎన్నారైలు శ్రీనివాస్ సురభి, రఘు, వంశీకర్ రెడ్డి, రుషికేశ్ యాదవ్, సత్యం యాదగిరి, ఉదయ్ యాదవ్, దొంతినేని శశి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు ఆధునికరణ వైద్య సేవలు అందించాలి





## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్

**వనపర్తి ప్రతినిధి, జూలై 7 (సింగిడి):** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు ఆధునీకరణ వైద్య సేవలు అందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సిపిఎం జిల్లా కమిటీ బృందంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో జనరల్, పురుష, స్త్రీ వార్డులను సందర్శించి రోగులతో ఆయన మాట్లాడారు. అనంతరం రక్త పరీక్షల కేంద్రాన్ని, మందులు సరఫరా చేసే విభాగాన్ని, భోజనశాలను సందర్శించారు. ఆసుపత్రిని పర్యవేక్షిస్తున్న ఆర్ఎంఓ ప్రసాద్ ను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యా, వైద్య రంగాల్లో జరుగుతున్న లోపాలను, అవసరమైన నియామకాలను, స్థానిక డిమాండ్ ను పరిశీలించేందుకు సిపిఎం రాష్ట్ర కమిటీ, సిపిఎం బృందాలు పరిశీలించి వారి దృష్టికి వచ్చిన అంశాలు, ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రెండు నెలలపాటు అన్ని విద్యాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రులపై పరిశీలన చేస్తున్నామని తెలిపారు. స్థానికంగా ఏర్పడిన సమస్యలను ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి స్థాయి వరకు తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయబోతున్నామని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రులను నమ్ముకొని లక్షల మంది జిల్లా కేంద్రాల్లోని ఏరియా, జనరల్ ఆసుపత్రుల్లో చికిత్సలు తీసుకోవడం జరుగుతుందని, ఆ రోగులకు సరైన చికిత్స అందించేందుకు అవసరమైన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్లు, కిందిస్థాయి వైద్య సిబ్బందిని ఆసుపత్రుల్లో ప్రభుత్వం నియమించకపోవడం ఆ రంగాలను నిర్వీర్యం చేయడమే అవుతుందని అన్నారు. రాష్ట్రం వచ్చాక ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసిందని, జిల్లా కేంద్రాల్లోని ఏరియా ఆసుపత్రులను జనరల్ ఆసుపత్రులుగా అప్ గ్రేడ్ చేసిందని తెలిపారు. కానీ వైద్య కళాశాలలు, జనరల్ ఆసుపత్రులకు అనుగుణంగా అవసరమైన వైద్య బృందాన్ని నియమించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆయన మండిపడ్డారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు సరైన బోధన లేకపోతే పట్టా చేత పట్టుకొని బయటికి వచ్చాక వారు రోగులకు ఎలాంటి వైద్యం అందిస్తారని ఆయన ప్రశ్నించారు. అలాగే ఏరియా, జనరల్ ఆస్పత్రుల్లో నిరంతరం వైద్య సేవలను అందించే అనుభవమైన నిష్ణాతులను, ప్రొఫెసర్లను, అసిస్టెంట్, ప్రొఫెసర్లను, అసోసియేట్లను నియమించకపోతే వైద్యరంగం ఎలా అభివృద్ధి చెందుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి మనిషికి విద్యా, వైద్యం ప్రాథమిక హక్కుగా ప్రభుత్వాలు అందించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. అంతటి మహోన్నతమైన బాధ్యతను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తే సమాజం ఆరోగ్యకరమైన జీవితాన్ని అనుభవించక నిత్యం రోగాలపాలై మానసిక వేదనను అనుభవించాల్సి ఉంటుందని ఆయన గుర్తు చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలో అప్ గ్రేడ్ అయిన జనరల్ ఆసుపత్రిని పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లం అవుతుందని చెప్పారు. వంద పడకల నుంచి 120, 150 పడకల వరకు ఆసుపత్రి స్థాయిని పెంచుకున్నా ప్రొఫెసర్లు, ఇతర వైద్యుల నియామకం చేయకపోవడంతో ఈ రంగం నిర్వీర్యం అవ్వడంతో పాటు రోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసినట్లేనని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన మౌలిక వసతులు, అత్యాధునికరమైన వైద్య పరికరాలు లేకపోవడంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. అలాగే చిన్న, చిన్న వైద్య పరీక్షలకు రోగులను బయటకి పంపిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్, పీజీ చదువుతున్న వైద్య విద్యార్థులు ఆయా విభాగాల్లో పూర్తిస్థాయి వైద్య పరిజ్ఞానాన్ని పొందాలంటే ప్రొఫెసర్లు, అసోసియేట్ ల అవసరం ఎంతో ఉందని చెప్పారు. జిల్లా ఆసుపత్రిలో 11 విభాగాలు ఉన్నాయని, జనరల్, ఎం సి హెచ్ ఆసుపత్రుల్లో మొత్తం 330 పడకలతో వైద్య సేవలు అందించే అవకాశం ఉందని తెలిపారు. కానీ అనస్తీసియా, పీడియాట్రిక్, కంటి వైద్యానికి సంబంధించి రెగ్యులర్ డాక్టర్లు లేరని తెలిపారు. అలాగే ల్యాబ్ టెక్నీషియన్స్ అవసరం మేరకు లేకపోవడం దారుణమన్నారు. వనపర్తి జిల్లా కేంద్రానికి వనపర్తి తో పాటు నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాలకు సంబంధించిన రోగులు కూడా వస్తుండడంతో ఓపి రిజిస్ట్రేషన్ కేంద్రాలను అదనంగా మరో రెండు పెంచాలని జిల్లా ఆసుపత్రి ఆర్ఎంఓ కు సూచించామని తెలిపారు. అలాగే ఫార్మాసిస్టులు 12 పోస్టులు, ల్యాబ్ టెక్నీషియన్స్ 10 పోస్టులు, స్టాఫ్ నర్సింగ్ 40 పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. రేడియాలజిస్టులు, టెక్నీషియన్స్ కొరత ఇక్కడ వేధిస్తోందని తెలిపారు. ప్రతినెల సరాసరి 27 వేల మంది రోగులు, వైద్య సేవలు పొందుతున్న ఈ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. జిల్లా ఆసుపత్రులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన ఆరోగ్యశ్రీ నిధులను రెండున్నర ఏళ్లుగా ఇవ్వకపోవడంతో వైద్య సేవలన్ని స్తంభించిపోయాయని తెలిపారు. 2004 నుంచి ఇప్పటివరకు జిల్లా ఆసుపత్రికి సూపరింటెండెంట్ లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగంలో అవసరమైనన్ని పోస్టులను భర్తీ చేసి వైద్య విద్యార్థులతో పాటు రోగులకు ఆధునీకరణమైన యంత్రాలతో మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆరోగ్యమైన సమాజ నిర్మాణానికి పాటుపడాలని జాన్ వెస్లీ సూచించారు. జిల్లా ఆసుపత్రిని సందర్శించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి.జబ్బార్, డి.బాల్ రెడ్డి, గోపి, మండ్ల రాజు, బొబ్బిలి నిక్సన్, టౌన్ కార్యదర్శి పరమేశ్వరా చారి, డి.కురుమయ్య, బాలరాజు, బాలస్వామి, బీసన్న, దేవేంద్రం ఉన్నారు.



# ఐవీఎఫ్ ప్రసవం తర్వాత బాలింత మృతి.?

## వైద్య నిర్లక్ష్యమా? ప్రసవానంతర సమస్యలా?

## ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు, గ్రామస్థుల ఆందోళన

**పెబ్బేరు, జూలై 07 (సింగిడి):** వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఐవీఎఫ్ ద్వారా కవలలకు జన్మనిచ్చిన బాలింత చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి సంభవించిందని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగగా, వైద్యులు మాత్రం అన్ని వైద్య ప్రమాణాల ప్రకారమే చికిత్స అందించామని స్పష్టం చేశారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, శాఖాపూర్ (వై) గ్రామానికి చెందిన ఇమామ్‌సాబ్ భార్య సాబెరా బేగం (35)కు వివాహమై 16 సంవత్సరాలు కావడంతో, పెబ్బేరులోని ఒ ప్రైవేట్ ఆస్పత్రిలో ఐవీఎఫ్ చికిత్స ద్వారా గర్భం దాల్చింది. హైరిస్క్ గర్భధారణగా గుర్తించిన వైద్యులు క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహిస్తూ వైద్య పర్యవేక్షణలో ఉంచారు. జూన్ 28న రక్తస్రావం కావడంతో ఆస్పత్రిలో చేర్పించగా, సిజేరియన్ ద్వారా కవలలు (ఒక పాప, ఒక బాబు) జన్మించారు. శ్వాస సంబంధిత ఇబ్బందులతో శిశువులను మహబూబ్‌నగర్‌లోని మరో ఆస్పత్రికి తరలించి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఇదే సమయంలో బాలింతకు పొటాషియం స్థాయి తగ్గడంతో మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ కు, అక్కడి నుంచి మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ సాబెరా బేగంకు వైద్య పరీక్షలు నిర్వహించగా, సిజేరియన్ అనంతరం, ప్రసవ సమయంలో గర్భాశయంలో గర్భసంచి వద్ద వేసి కుట్లు తొలగించకుండా, ప్లాసెంటా




(మావి) పూర్తిగా తొలగించకుండా కుట్లు వేసినట్లు మహబూబ్ నగర్ ఒ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యులు గుర్తించి, వారు మళ్లీ సాబెరా బేగంకు గర్భసంచికి వేసి కుట్లకు, ప్లాసెంటా (మావి)లకు కోసం శస్త్రచికిత్స నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. రెండు రోజుల పాటు చికిత్స పొందిన అనంతరం ఆమె మృతి చెందడంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు మృతదేహంతో పెబ్బేరులోని చికిత్స పొందిన ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు.

ఈ ఘటన పై ఆస్పత్రి యాజమాన్యం, సంబంధిత వైద్యులు స్పందిస్తూ, సాబెరా బేగం ఐవీఎఫ్ ద్వారా కవలలకు గర్భం దాల్చింది, హైరిస్క్ రోగి అని తెలిపారు. కవలల గర్భధారణ కారణంగా ప్రసవానంతరం అధిక రక్తస్రావం, ఇతర సంక్లిష్టతలు ఏర్పడ్డాయని, పెబ్బేరు ప్రైవేట్ ఆసుపత్రిలో అందుబాటులో లేని చికిత్స అవసరమవడంతో మెరుగైన వైద్యం కోసం వెంటనే రిఫర్ చేసినట్లు వివరించారు. రోగి ప్రయోజనాల దృష్ట్యా తగిన నిర్ణయాలే తీసుకున్నామని, తమ నిర్లక్ష్యం ఏమాత్రం లేదని పేర్కొన్నారు. వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రసవానంతర అధిక రక్తస్రావం (పోస్టుపార్టుమ్ హేమర్హజ్ - పిపిహెచ్) అనేది ప్రసవం తర్వాత సంభవించే అత్యవసర వైద్య పరిస్థితి. ఇది సహజ ప్రసవం, సిజేరియన్ లేదా ఐవీఎఫ్ గర్భధారణ అనే తేడా లేకుండా ఎవరికైనా సంభవించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా గర్భాశయం సరిగా కుదించుకోకపోవడం, ప్లాసెంటా పూర్తిగా బయటకు రాకపోవడం, ప్రసవ సమయంలో ఏర్పడే చీలికలు లేదా రక్తం గడ్డకట్టే లోపాలు వంటి కారణాలు దీనికి దారితీయవచ్చు. కవలల గర్భధారణ, అధిక రక్తపోటు, పెద్ద శిశువు, హైరిస్క్ గర్భధారణ వంటి పరిస్థితుల్లో ఈ ప్రమాదం మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. నిపుణుల ప్రకారం, ఐవీఎఫ్ ద్వారా గర్భం దాల్చడం మాత్రమే తల్లి మరణానికి కారణమని చెప్పడం శాస్త్రీయంగా సరైంది కాదు. అయితే ఐవీఎఫ్ గర్భధారణల్లో వయస్సు, కవలల గర్భం, ఇతర ఆరోగ్య సమస్యల కారణంగా అదనపు వైద్య పర్యవేక్షణ అవసరమవుతుంది. ప్రసవానంతరం అధిక రక్తస్రావం, ఇన్ఫెక్షన్లు, రక్తం గడ్డకట్టడం, గుండె సంబంధిత సమస్యలు వంటి అత్యవసర పరిస్థితులను వెంటనే గుర్తించి చికిత్స అందిస్తే ప్రాణాపాయం తగ్గించే అవకాశం ఉందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఘటనలో వైద్య నిర్లక్ష్యం జరిగిందా? లేక ప్రసవానంతర సంక్లిష్టతలే మరణానికి దారి తీశాయా? అనే అంశాలపై అధికారిక వైద్య విచారణ అనంతరమే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## బీసీ హాస్టల్ నిర్మాణ పనుల పరిశీలన

**ఆమనగల్లు, జూలై 07 (సింగిడి):** ఆమనగల్లు పట్టణంలో నూతనంగా చేపట్టిన బీసీ బాలుర హాస్టల్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. శిథిలావస్థకు చేరిన పాత భవనాన్ని తొలగించి, అరబిందో ఫార్మా వారి సిఎస్ఆర్ నిధులు రూ. 4 కోట్లతో అత్యాధునిక వసతులతో కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ పనులను మంగళవారం ఆమనగల్లు మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు,డిసిసి కార్యదర్శి వస్పుల మానయ్య,మాజీ అధ్యక్షులు జగన్, శ్రీను నాయక్ తదితరులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే ధ్యేయంగా ఈ నిర్మాణం సాగుతుండటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# గ్లాసుడు తాగితే చాలు!

## కాలేయాన్ని శుద్ధిచేసే క్యారెట్లు!

ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కాలేయం కీలక పాత్ర పోషిస్తుంది. ఇది మన శరీరంలో 50కి పైగా విధులను నిర్వర్తించే ఒక ముఖ్యమైన అవయవం. హార్మోన్ల ఉత్పత్తి, ప్రోటీన్ల సంశ్లేషణ వంటివి కీలకమైన పనులు ఇది నిర్వర్తిస్తుంది.అయితే జీవనశైలి కారణంగా కాలేయంపై ఒత్తిడి పెరుగుతుంది.



ముఖ్యంగా నేటి కాలంలో ఫ్యాటీ లివర్ సాధారణ సమస్యగా మారింది. తప్పుల ఆహారపు అలవాట్ల కారణంగా ఫ్యాటీ లివర్ సమస్య తలెత్తుంది. కానీ కాలేయాన్ని నిర్విషీకరణ చేసి, ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడటంలో కారెట్లు కీలకంగా పనిచేస్తాయి.

క్యారెట్లు, ఆపిల్ పండ్లు, ద్రాక్ష పండ్లు, పుదీనాను కలిపి జ్యూస్ తయారు చేసుకుని తాగాలి. అయితే ఈ జ్యూస్ తయారుచేసేటప్పుడు అందులో చక్కెర లేదా ఉప్పు కలపవద్దు. ఈ జ్యూస్‌ను ఉదయాన్నే ఖాళీ కడుపుతో తాగాలి. ఈ జ్యూస్ ఫ్యాటీ లివర్‌కు మాత్రమే కాకుండా కామెర్లకు కూడా మేలు చేస్తుంది. ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో దీనిని తాగడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి.

మద్యం ,అధిక ప్రోటీన్ తీసుకునే వారు కాలేయంపై భారాన్ని పెంచి, దాని పనితీరును ప్రభావితం చేస్తుంది. కానీ కాలేయం పనితీరును మెరుగుపరచడానికి ఆయుర్వేదం కొన్ని మార్గాలను సూచిస్తుంది.



క్యారెట్లు కాలేయ కణాలను బలపరిచి, వాటిని నష్టం నుంచి కాపాడతాయి. క్యారెట్లలోని పదార్థాలు కాలేయంపై ఉండే అధిక ఒత్తిడిని కూడా తగ్గిస్తాయి. యాపిల్స్‌లోని గుణాలు కాలేయ వాపును తగ్గించడంలో, కణాల పునరుత్పత్తిలో సహాయపడతాయి. ద్రాక్ష పండ్లు కాలేయంలో ఎంజైమ్‌లను పెంచుతాయి. ఇవి ప్రోటీన్ల జీర్ణక్రియ, సంశ్లేషణకు సహాయపడతాయి.

పీఎఫ్ ఖాతాదారులకు పండుగలాంటి వార్త..

# త్వరలో బ్యాంక్ అకౌంట్లోకి డబ్బులు.. కేంద్రం డెసిషన్

నినాదం మార్కెట్




ఈపీఎఫ్‌వో ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. పీఎఫ్ అకౌంట్ ఇనాక్టివ్ అయి ఉండి డబ్బులు క్లెయిమ్ చేయనివారికి ఆటోమేటిక్‌గా నిధులను బదిలీ చేయనుంది.


పీఎఫ్ ఖాతాల్లో మిగిలిపోయిన సొమ్మును నేరుగా లబ్దిదారుడి బ్యాంక్ అకౌంట్లో జమ చేయనుంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

ఇప్పటివరకు పీఎఫ్ క్లెయిమ్ చేయాలంటే ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుంది. అనంతరం అధికారులు పరిశీలించి క్లెయిమ్ ప్రాసెస్ చేస్తారు. కానీ క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకోకపోయినా ఇనాక్టివ్ ఖాతాల్లోని నగదును ఆటోమేషన్ విధానంలో సెటిల్ చేయనుంది. ఆధార్‌తో లింక్ అయిన బ్యాంక్ అకౌంట్లో క్లెయిమ్ చేయని సొమ్ము ఆటోమేటిక్‌గా జమ అవుతుంది. రూ.వెయ్యిలోపు బ్యాలెన్స్ ఉన్న ఖాతాలకు పైలట్ ప్రాజెక్టుగా నిధులను ఆటోసెటిల్మెంట్ చేయనుంది. ఆ తర్వాత మిగతా ఖాతాదారులకు కూడా జమ చేయనుంది. తొలి దశలో 8 లక్షల ఇనాక్టివ్ ఖాతాలను గుర్తించారు.

8 లక్షల పీఎఫ్ ఖాతాల్లో రూ.5,200 కోట్ల నిధులు ఉన్నాయి. వీటిల్లో 14 వేల ఖాతాల్లో రూ.5 లక్షలకుపైగా క్లెయిమ్ చేయని నగదు ఉంది. ఇక 31 లక్షల ఖాతాల్లో రూ.10,181 కోట్ల బ్యాలెన్స్ నిరుపయోగం ఉంది. దీంతో వీటిని ఆటోమేషన్ పద్ధతిలో బ్యాంక్ అకౌంట్‌కు నేరుగా జమ చేయనుంది. త్వరలో ఈ కొత్త వ్యవస్థ ప్రవేశపెట్టనున్నారు. కాగా అకౌంట్ మూడేళ్లపాటు ఎలాంటి కాంట్రిబ్యూషన్ జమ కాకపోయినా, క్లెయిమ్ చేయకపోయినా ఇనాక్టివ్ అవుతుంది. ఇక 55 ఏళ్ల వయస్సులో రిటైర్మెంట్ అయితే.. మూడేళ్ల పాటు ఎలాంటి కాంట్రిబ్యూషన్ జమ కాకపోయినా ఇనాక్టివ్ అవుతుంది. వీటికి కేంద్రం నుంచి వడ్డీ జమ కాదు.

సెన్సెక్స్ 1800 పాయింట్లు పతనం..

# ఒక్క సెషన్‌లో 14లక్షల కోట్లు గాయబ్



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి భారీగా నష్టపోయాయి. పశ్చిమాసియాలో అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరుగుతుండడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. చమురు ధరలు భారీగా పెరగడం, విదేశీ సంస్థాగత మదుపర్ల విక్రయాలు కొనసాగుతుండడం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపాయి. సెన్సెక్స్ ఓ దశలో 2 వేల పాయింట్ల మేర నష్టపోగా. నిఫ్టీ 22,500 పాయింట్ల మార్కు కాస్త ఎగువన ముగిసింది. ఒక్కరోజులోనే మదుపర్ల సంపద దాదాపు రూ. 14 లక్షల కోట్లు ఆవిరై రూ. 415 లక్షల కోట్లకు చేరింది. డాలరుతో రూపాయి మారకం విలువ తొలిసారి 94 మార్కు దాటి 94.01 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠానికి చేరింది.

సెన్సెక్స్ ఉదయం 73,732.58 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,532.96) భారీ నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాలు కొనసాగాయి. ఇంట్రాడేలో 72,558.44 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1836.57 పాయింట్ల నష్టంతో 72,696.39 వద్ద ముగిసింది. నిఫ్టీ 601.85 పాయింట్ల నష్టంతో 22,512.65 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా స్టాక్స్ మినహా మిగిలిన స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. టైటాన్, ట్రెంట్, అల్ట్రాటెక్ సిమెంట్, బీఈఎల్, ఇండిగో స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 113.20 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం 4272 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**కారణాలు ఇవీ..**

**ముదురుతున్న యుద్ధం:**
హర్మ్యూజ్ జలసంధిని 48 గంటల్లోగా తెరవకపోతే.. ఇరాన్ పవర్‌ప్లాంట్లపై దాడులు చేస్తామని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అదే జరిగితే హర్మ్యూజ్ జలసంధిని పూర్తిగా మూసేస్తామంటూ ఇరాన్ హెచ్చరికలు చేసింది. ప్రాంతీయ విద్యుత్ క్షేత్రాల పైనా దాడులకు దిగుతామని హెచ్చరించింది. యుద్ధం మరింత తీవ్రతరం అయ్యే అవకాశం ఉందన్న భయాలు మార్కెట్లను పడేశాయి.

**చమురు 110 డాలర్లపైనే:**
యుద్ధం కారణంగా భారీగా పెరిగిన ముడి చమురు ధర గత కొన్ని రోజులుగా 110 డాలర్లపైనే స్థిరంగా కొనసాగుతోంది. దీనివల్ల ద్రవ్యోల్బణం పెరిగి, వృద్ధి నెమ్మదిస్తుందన్న భయాలు ఉన్నాయి.


**రూపాయి:**
డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ కూడా సరికొత్త కనిష్ఠాలను తాకుతోంది. చమురు ధరలు పెరగడం, ఎఫ్ఐఐల విక్రయాలు రూపాయి విలువపై ప్రభావం చూపుతున్నాయి. దీనివల్ల మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడుతోంది.

**ఎఫ్ఐఐల విక్రయాలు:**
ఉద్రిక్తతలు ప్రారంభమైన నాటి నుంచి విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 20వ తేదీ వరకు 16 ట్రేడింగ్ సెషన్లలో విదేశీ మదుపర్లు దాదాపు రూ. లక్షకోట్ల విక్రయాలు చేపట్టారు. అంటే ఒక ట్రేడింగ్ అవర్‌కు దాదాపు రూ. 1000కోట్ల మేర అమ్మకాలు జరిగాయి. శుక్రవారం కూడా రూ. 5518 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ఎఫ్ఐఐలు విక్రయించారు. వీటితో పాటు అమెరికాలో 10 ఏళ్ల బాండ్లపై రాబడులు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్ల పతనం వంటివీ మన మార్కెట్లపై ప్రభావం చూపాయి. ఇండస్ట్రియల్ డీజిల్ ధరను ఏకంగా లీటరుకు రూ. 22 చొప్పున పెంచడంతో ఇన్‌ఫ్రా, కన్‌స్ట్రక్షన్, తయారీ యూనిట్లపై ప్రభావం పడుతుందన్న ఆందోళనలూ ప్రతికూల సంకేతాలు పంపాయి.

# కలర్ చూడొద్దండోయ్..

# ద్రాక్షతింటే ఒంట్లో జరిగేదిదే..!

వేసవి కాలంలో ఆరోగ్యానికి మేలు చేసే పండ్లను విరివిగా తింటారు. అవి మీ శరీరాన్ని తేమగా, తాజాగా ఉంచుతాయి. ఇలాంటి అద్భుతమైన జ్యూసీ పండ్లలో ద్రాక్ష ఒకటి. అనేక రంగులలో లభించే ద్రాక్షలు తీపిగా, పలుపుగా ఉంటాయి.. నలుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగు ద్రాక్ష.. మూడు కూడా పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. వాటిలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు అధిక మొత్తంలో ఉంటాయి. అందుకే.. వీటిని తినాలని చెబుతున్నారు డైటీషియన్లు.. ద్రాక్షలను వైన్ తయారీలో కూడా ఉపయోగిస్తారు. ద్రాక్షలో యాంటీ ఆక్సిడెంట్లు (రెస్వెరాట్రాల్).. ఫైబర్, ప్రోటీన్, ఐరన్, కాపర్, ఫోలేట్, విటమిన్లు సి, ఎ, కె, బి వంటి ఆరోగ్యానికి మేలు చేసే అనేక పోషకాలు ఉన్నాయి..



**ద్రాక్షతినడం వల్ల కలిగే లాభాలు..**

రోగనిరోధక వ్యవస్థ కోసం – ద్రాక్షలో విటమిన్ సీ, విటమిన్ బి6, ఐరన్ ఉంటాయి. ఈ పోషకాలు రోగనిరోధక శక్తిని పెంచి, ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడతాయి. అందువల్ల, మీ గనిరోధక శక్తిని బలోపేతం చేసుకోవడానికి ద్రాక్షను రెగ్యులర్ గా తినవచ్చు.

**మలబద్ధకాన్ని నివారిస్తుంది:**
ద్రాక్షలో పీచుపదార్థం బాగా ఉంటుంది. ఇది జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది. దీనివల్ల జీర్ణ సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది.

**అలసటను ఎదుర్కోవడానికి:** ద్రాక్షలో విటమిన్లు, మెగ్నీషియం, ఫాస్ఫరస్, ఐరన్, రాగి ఉంటాయి. ఇవి మీ శరీరానికి శక్తిని అందించి, అలసటను తగ్గించడంలో సహాయపడతాయి.

**కళ్ళకు మేలు:**
ద్రాక్షలో ఉండే పాలిఫెనాల్స్ -- రెస్వెరాట్రాల్, మాక్యులర్ డీజెనరేషన్, ఆక్సిడేటివ్ స్ట్రెస్, వాపు, శుక్లాలు వంటి కంటి సమస్యలను నివారించడంలో సహాయపడతాయి. ద్రాక్షను తినడం అంధత్వాన్ని నివారించడంలో కూడా సహాయపడవచ్చు. అందువల్ల, కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ద్రాక్షను తినవచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు..

**రక్తంలో చక్కెర నియంత్రణ :**
మధుమేహం ఉన్నవారికి ద్రాక్షపండ్లు కూడా మేలు చేస్తాయి. వాటికి మధుమేహ నిరోధక గుణాలు ఉన్నాయి.. అవి రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడతాయి.


**కొలెస్ట్రాల్ తగ్గించుకోవడానికి :**
మీరు ద్రాక్షపండ్లను తినడం ద్వారా కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవచ్చు. ద్రాక్ష రసంలో ఫ్లేవనాయిడ్లు, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో సహాయపడతాయి.

**ఎముకలను బలపరుస్తుంది:**
ద్రాక్షలో రాగి, ఐరన్, మాంగనీస్ వంటి పోషకాలు ఉంటాయి. ఇవి ఎముకలను బలపరిచి, బోలు ఎముకల వ్యాధి (ఆస్టియోపొరోసిస్) ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

**క్యాన్సర్ చికిత్స కోసం:**
ద్రాక్షలో యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇవి క్యాన్సర్‌ను నివారించడంలో సహాయపడతాయి.

**గుండె జబ్బుల నుంచి రక్షణ కోసం :**
ద్రాక్షలో ఫ్లేవనాయిడ్లు, ఫినోలిక్ ఆమ్లాలు, రెస్వెరాట్రాల్ ఉంటాయి. ఇవి గుండె జబ్బుల నుండి రక్షించడంలో సహాయపడతాయి. అందుకే ద్రాక్షాలను రెగ్యులర్ గా తినాలని డైటీషియన్లు చెబుతున్నారు. అయితే.. ఏమైనా సమస్యలతో బాధపడుతుంటే ఆరోగ్య నిపుణులను సంప్రదించడం మంచిది.





# ఒక్కరోజే రూ.10 వేలు డౌన్

## ఊహించని రీతిలో బంగారం ధర పతనం..

పూటపూటకీ బంగారం ధరలు ఊహించని రీతిలో పతనమవుతున్నాయి. పశ్చిమాసియా యుద్ధభయాలు, ద్రవ్యోల్బణం, పెట్టుబడులు కొనసాగిస్తే నష్టాలు వస్తాయన్న సమీకరణాల నేపథ్యంలో బంగారం ధరలు అమాంతం పడిపోతున్నాయి. సోమవారం ఉదయం 24 క్యారెట్ల బంగారంపై రూ. 5950, 22 క్యారెట్ల బంగారంపై రూ. 5450 పతనమవ్వగా.. సాయంత్రం మరోసారి బంగారం ధరలు తగ్గాయి.
సాయంత్రం 4 గంటల తర్వాత 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాములపై రూ. 4370 తగ్గింది. అలాగే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 4000 పతనమైంది. దీంతో ఈ ఒక్కరోజే 24 క్యారెట్ల బంగారం రూ. 10,320, 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల రేటు రూ. 9450 తగ్గింది. భారీగా బంగారం ధర తగ్గడంతో కొనుగోలుదారులు ఆభరణాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ. 1,35,650గా ఉండగా.. 22 బంగారం 10 గ్రాముల ధర రూ. 1,24,350గా ఉంది. హైదరాబాద్ సహా తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో స్వల్ప తేడాలతో బంగారం ధరలు దాదాపు ఈ స్థాయిలోనే కొనసాగుతున్నాయి. ఈ ధరలకు తరుగు, జీఎస్టీ అదనంగా ఉంటుంది.
ఇదిలా ఉండగా..
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ పై తాత్కాలికంగా యుద్ధం ఆపివేస్తున్నట్లు ప్రకటించారు. దీని ప్రభావం బంగారం ధరలపై ఉండే ఛాన్సుందని నిపుణులు చెప్తున్నారు. పెరుగుదల భారీగా ఉండకపోవచ్చు. అలాగే ఒక్కసారిగా పడిపోయే ఛాన్స్ కూడా ఉండకపోవచ్చుని అంచనా వేస్తున్నారు. ఇరాన్ పై ఆంక్షలు మరింత పెంచినా, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు పెరిగినా ధరలు మళ్లీ రికార్డు స్థాయికి చేరుకునే అవకాశం ఉందంటున్నారు. ఏదేమైనా బంగారంపై పెట్టుబడులు పెట్టేవారు ఇది ఆచితూచి వ్యవహరించాల్సిన సమయమనే చెప్పాలి.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
బుధవారం 8-7-2026

# మహనీయుల జాతరను విజయవంతం చేద్దాం

## బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు అత్తెల్లి అనంత్ రెడ్డి, జిల్లా యువ నాయకులు మల్గారి వైభవ్ రెడ్డి



**చేవెళ్ళ (సింగిడి):** చేవెళ్లలో ఈనెల 30న జరిగే మహనీయుల జాతరను విజయవంతం చేద్దామని బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు అత్తెల్లి అనంత్ రెడ్డి, జిల్లా యువ నాయకులు డాక్టర్ మల్గారి వైభవ్ రెడ్డి పిలుపునిచ్చారు. అన్నారు. ఈనెల 30న నిర్వహించే మహనీయుల జాతరకు సంబంధించిన గోడ పత్రికను సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో చేవెళ్లలోని బీజేపీ కార్యాలయంలో మహనీయుల కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగావారు. మాట్లాడుతూ... మహనీయుల ఆలోచనా విధానాన్ని కొనసాగించాలని, వారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మహనీయుల ఆశయాలను స్మరించుకుంటూ, వారి జయంతి కార్యక్రమాల సందర్భంగా జరుపుకునే మహనీయుల జాతరలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్లు అత్తెల్లి మనీషాఅనంత్ రెడ్డి, పెద్దోళ్ల దయాకర్, కరికె మీనాక్షి సత్యనారాయణ, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

# సీఎం చంద్రబాబు జన్మదినం



**పాలేరు (సింగిడి):** నేలకొండపల్లి సెంటర్లో 76వ పుట్టినరోజు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి టపాకాయలు కాల్చారు ఈ కార్యక్రమలో గ్రామ శాఖ అధ్యక్షులు అక్కినేని నాగేశ్వరావు మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదినం. ఈ వయసులోనూ. అలుపెరగని యోధుడిలా ఏపీ,అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తూ,దూసుకుపోతు న్నారు. అందుకే ఈ జన్మదిన వేడుకల్లో, భాగంగా రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కార్యకర్తలు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఆయన పుట్టిన రోజును పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నేతలు, పార్టీ,కార్యకర్తలు ఘనంగా సంబరాలు జరిపేందుకుసిద్ధమయ్యారు. 40 ఏళ్లకు పైగా ఉన్న తన రాజకీయ,ప్రస్థానంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదురైనా కానీ. అన్నింటినీ తనదైన శైలిలో ఎదుర్కొని విజనరీ లీడర్ గా ఎదిగారు. అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తన అభిమానులు వీసం శ్రీనివాసరావు నేలకొండపల్లి ఉప సర్పంచ్ మద్దినేని మహేష్ పావులూరి వెంకటేశ్వరరావు తలసరి రాధాకృష్ణ సుగుణమ్మ కొర్లకుంట కిరణ్ నరసింహారావు సీతారాం బాబు బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ బిజెపి నాయకులు పాల్గొన్నారు.



# దళిత క్రైస్తవుల హక్కుల సాధనకై అవగాహన సదస్సు



**గద్వాల ప్రతినిధి (సింగిడి):** తెలంగాణ దళిత క్రైస్తవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం జోగులాంబ గద్వాల కేంద్రంలోని హరిత హోటల్‌లో ప్రత్యేక చర్చా వేదిక నిర్వహించారు. దళిత క్రైస్తవుల హక్కుల సాధనే లక్ష్యంగా జరిగిన ఈ సమావేశానికి నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమా నికి సాగర్ దొడ్డి వెంకట్రాములు, అతీకూర్ రెహమాన్, రిటైర్డ్ ఎంఈఓ మేరమ్మ, మరియు అయిజ పాస్టర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితో పాటు దండోరా నాయకుడు అంజనేయులు మరియు వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొని దళిత క్రైస్తవుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. 5వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ చంటిన్న ఈ సమావేశంలో పాల్గొని, దళిత క్రైస్తవుల న్యాయమైన హక్కుల కోసం చేసే పోరాటానికి తన పూర్తి మద్దతు ప్రకటించారు. రాబోయే రోజుల్లో దళిత క్రైస్తవుల శక్తిని చాటేలా గద్వాల కేంద్రంగా భారీ బహిరంగ సభను నిర్వహించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. ఈ సభను విజయవంతం చేసేందుకు ప్రతి మండలం నుండి కార్యకర్తలను, ప్రజలను సమీకరించాలని, తక్షణమే మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# ప్రజాసంఘాల నాయకుల ముందస్తు అరెస్ట్ అప్రజాస్వామికం



**జయశంకర్ భూపాలపల్లి (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం సబ్ డివిజన్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి రాక సందర్భంగా పోలీసులు చేపట్టిన ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికమని ప్రజాసం ఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమైన ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన అని అన్నారు. ప్రజలు తమ సమస్యలను శాంతియుతంగా తెలియజేయడం రాజ్యాంగబద్ధ హక్కు అని, ఆ హక్కును హరిం చేలా పోలీసులు వ్యవహరించడం సరికాదన్నారు. సీఎం పర్యటన పేరుతో ప్రజాసంఘాల నాయకులను ఇండ్ల వద్దనే నిర్బంధించడం, స్టేషన్లకు తరలించడం, బెదిరింపులకు పాల్పడడం అన్యాయమని మండిపడ్డారు. జిల్లాలో నిరుద్యోగం, భూ సమస్యలు, రేషన్, పెన్షన్లు, సంక్షేమ పథకాల అమలులో ఉన్న లోపాలపై ప్రశ్నించే వారిని అణచివేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని తెలిపారు. ప్రభుత్వం ప్రజల గళాన్ని వినాలి గానీ, పోలీసు నిర్బంధాలతో అణచివేయకూడదన్నారు. అదుపులోకి తీసుకున్న ప్రజాసంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలని, ప్రజల సమస్యల పరిష్కారంపై సీఎం స్పందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్. కులవ్యక్షత వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీధర్. తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్. దళిత బంధు సాధన కమిటీ జిల్లా నాయకులు బొబ్బిలి వెంకటి. సంతకం లక్ష్మయ్య. జాడి రాజబాబు, బిజెపి మండల అధ్యక్షుడు మేడిపల్లి పున్నం,బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి గూగుల్ వంశీ నాయక్. దుర్గం శ్రీశైలం నేత.తదితరులు పాల్గొన్నారు.

# కాశా కాలనీలో వీధి కుక్కల బీభత్సం

## ఇద్దరు చిన్నారులకు గాయాలు






**భీమదేవరపల్లి, (సింగిడి):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో వీధి కుక్కల బెడద రోజు రోజుకు పెరుగుతూ ప్రజలను భయాందోళ నలకు గురిచేస్తోంది. రంగయ్యపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కాశా కాలనీలో సోమవారం జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది.కాలనీలో తిరుగుతున్న వీధి కుక్కలు ఇద్దరు చిన్నారులపై దాడి చేసి కరిచాయి. ఎస్.కె సజ్జు అనే బాలుడితో పాటు మరో చిన్నారి తీవ్రంగా గాయపడ్డారు. కుక్కల దాడితో చిన్నారులు భయాందోళనకు గురయ్యారు. గాయపడిన చిన్నారులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, అత్యవసర వైద్య సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించి హనుమకొండలోని ఎంజిఎం ఆసుపత్రికి తరలించారు.మండల వ్యాప్తంగా వీధి కుక్కల సంఖ్య పెరుగుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు వెంటనే చర్యలు తీసుకుని వీధి కుక్కల నియంత్రణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# రోడ్డు పక్కనే వ్యర్థ పదార్థాలు పారబోస్తున్న పట్టించుకోని అధికారులు..

## బెంబేలెత్తుతున్న గ్రామస్తులు




**ఆర్మూర్, (సింగిడి):** బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన మోర్తాడ్ జాతీయ రహదారి నుండి గ్రామం కు వెళ్లే మార్గమధ్యంలో పోలీస్ స్టేషన్ కు అతి సమీపంలో గల రైల్వే వంతెన ప్రక్కనే గల గ్రామానికి వెళ్లే రోడ్డు ప్రక్కన గ్రామానికి చెందిన కొందరు చికెన్ సెంటర్ నిర్వాహ కులు, ఆర్డర్ మెస్ నిర్వాహకులు, దాబా హోటల్ నిర్వాహకులు కోళ్ల, వ్యర్థ పదార్థాలను, కోళ్ల పైభాగం గల బోరును తెచ్చి పారబోయడం వల్ల నిత్యం మోర్తాడ్ గ్రామం నుండి భీంగల్ వరకు వెళ్లే, మోర్తాడ్ గ్రామం నుండి వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు,వంతెన వద్ద నుండి గల రోడ్డు గుండా రైతులు తమ పంట పొలాలకు వెళ్లే వారు సైతం దుర్వాసనను తట్టుకోలేక, అధికారుల తీరుపట్ల, పట్టించుకోకపోవడం పట్ల, నిర్వాహకులపై చేపట్టకపోవడం వల్ల అధికారులపై ఆగ్రహాలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కోళ్ల బూరు వాహనాలపై వెళ్లే వారి కళ్ళలోకి కొట్టుకు వస్తుందని, దీంతో నానా ఇబ్బందులకు గురవుతున్న మని ప్రయాణికులు, గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో విచ్చలవిడిగా చికెన్ సెంటర్లు, ఆర్డర్ మెస్సులు, దాబా హోటల్లు విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నప్పటికీ, అసలు వ్యాపారస్తులకు లైసెన్సులు ఉన్నాయా అనే అనుమానాలను సైతం వెలువెత్తుతున్నాయి. గతంలో కోళ్ల వ్యర్థాలను గ్రామపంచాయతీ వారు పంచాయతీకి చెందిన చెత్త వాహనంలో తీసుకువెళ్లి యానం మీదుగా ( ఎస్సీ బీసీ కాలనీ ) ప్రాంత శివారులో గల వరద కాలువ పక్కన గ్రామపంచాయతీ సిబ్బంది పర వేసేవారు. వరద కాలువ నుండి వ్యర్థ పదార్థాల వల్ల దుర్వాసనలు వెలువడి తమ కాలనీవాసులు అనారోగ్యానికి గురవుతున్నారని, వరద కాలువ ప్రక్కన కోళ్లకు సంబంధించిన వ్యర్థపదార్థాలను పారబోయవద్దని వాహనాన్ని అడ్డుకొని గ్రామ కార్యదర్శి తెలియజేశారు. దీంతో కోళ్ల వ్యర్థాలను రైల్వే ప్రక్కన రోడ్డుపై పారవేయడం వల్ల గ్రామస్తులు, రైతులు అసంతృప్తి ఆగ్రహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ప్రజల ఇబ్బందులను, రోగాల బారిన గురి కాకుండా ఉండేందుకై ప్రత్యేక చొరవ తీసుకొని ఆయా దుకాణ యధానుమా నులపై చర్యలు చేపట్టాలని, కోళ్ల వ్యర్థ పదార్థాలను రోడ్డు పక్కన చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ముద్దమల్ల రవికి దక్కిన అరుదైన గౌరవం

# దుబ్బ మల్లన్న ఆలయ కమిటీ చైర్మన్‌గా నియామకం

## ఆలయ కమిటీని సన్మానించిన కాంగ్రెస్ నేతలు



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామ శివారులో స్వయంభుగా వెలసిన శ్రీ దుబ్బ మల్లికార్జున స్వామి ఆలయ చైర్మన్ గా ధర్మారం గ్రామానికి చెందిన ముద్దమల్ల రవిని నియమించినట్లు ఎండోమెంట్ అధికారులు ఒక ప్రకటన లో తెలిపారు. ఎంతో ప్రసిద్ధిగాంచిన ధర్మారంలోని శ్రీ దుబ్బ మల్లికార్జున స్వామి ఆలయ కమిటీని సోమవారం నియమించగా వారిని శాలువా లతో సత్కరించి ఘనంగా సన్మానించిన ఇల్లంతకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, భక్తుల కోరికలు తీర్చే శ్రీ దుబ్బ మల్లన్న ఆలయ కమిటీకి వారు శు భాకాంక్షలు తెలిపారు. ధర్మారం గ్రామానికి చెందిన ముద్దమల్ల రవిని చైర్మన్ గా నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ ప్రతి నాయకుడికి సరైన సమయంలో గుర్తింపు వస్తుందని అందుకు నిదర్శనం ముద్దమందారం అని పేర్కొన్నారు. రవి నియామకానికి సహకరించిన హుజురాబాద్ నియోజకవర్గం ఇన్చార్జి ప్రణవ బాబుకు మంత్రులు శ్రీధర్ బాబు పొన్న ప్రభాకర్ గౌడ్ ఇన్చార్జి మినిస్టర్లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

### మల్లికార్జున స్వామి ఆశీస్సులతో అభివృద్ధి చేస్తా...

### ఆలయ చైర్మన్ ముద్దమల్ల రవి

శ్రీ దుబ్బ మల్లికార్జున స్వామి ఆలయ చైర్మన్ గా తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి మంత్రులకు నియోజకవర్గ ఇన్చార్జి కి రవి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సహకారంతో ఆలయ కమిటీ సూచనలతో ఆలయ అభివృద్ధికి నిరంతరం పాటు పడతానని స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అందరి సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానని భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సాయిని రవి బ్లాక్ కాంగ్రెస్ నాయకులు మోలుగూరి సదయ్య మాజీ కౌన్సిలర్లు పిట్టల రమేష్ బొంగోని వీరన్న గౌడ్ రావికంటి రాజు మహిళ నేత పిడుగు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లతో పేదల కల సాకారం

## ఆందోల్-జోగిపేటలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



**సంగారెడ్డి బ్యూరో (సింగిడి):** పేదల స్వంత ఇంటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆందోల్--జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డ బస్వాపురంమల్లమ్మ--మల్లయ్య, విజయలక్ష్మి--జగదీశ్వర్ ల



ఇందిరమ్మ ఇంటిని మంత్రి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వారికి శుభాకాంక్షలు తెలిపారు. స్వంత ఇల్లు కల నిజమవడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, మంత్రి దామోదర్ రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా,మంత్రి మాట్లాడుతూ, పేదల గృహావసరాలను తీర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గృహ నిర్మాణ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి, ఎవరూ ఇల్లు లేకుండా ఉండకుండా చూడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఆందోల్ - జోగిపేటలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం శరవేగంగా నిర్మాణం పూర్తి అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ మాధురి,మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు, కౌన్సిలర్ రేఖ--ప్రవీణ్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# మహాత్మ బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త.....

## రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**సంగారెడ్డి బ్యూరో , (సింగిడి):** విశ్వగురు, మహాత్మ బసవేశ్వర 893 వ జయంతి సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం జోగిపేట చౌరస్తాలో ఉన్న వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త, దార్శనికుడు, కవి, రాజనీతిజ్ఞుడుగా అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. వారి బోధనలు, ఆశయాలు ఆచరణీయమన్నారు. "పనే ప్రత్యక్ష దైవం" అని వారు బోధించారన్నారు. ప్రతి వ్యక్తి తన కష్టార్జితం తో జీవించాలని, శ్రమకు గౌరవం ఇవ్వాలని వారు చాటి చెప్పారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, లింగాయత్ సమాజం, సామాజికవేత్తలు,తది తరులు పాల్గొన్నారు.




## కరీంనగర్‌లో బసవేశ్వర

# జయంతి వేడుకలు

## సమసమాజం, సమానత్వం కోసం బసవేశ్వరుడి బోధనలు స్ఫూర్తి



**కరీంనగర్, (సింగిడి):** నగరంలోని సుభాష్ నగర్‌లో జగజ్యోతి మహాత్మా బసవేశ్వరుడి 893వ జయంతి వేడుకలు వీరశైవ లింగాయత్ సంఘ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, 26వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. వేడుకల సందర్భంగా బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు కార్పొరేటర్లు వైద్యుల అంజన్ కుమార్, గంట శ్రీనివాస్‌లను శాలువాలతో సత్కరించారు. వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ, సమసమాజ స్థాపనకు, కులరహిత సమాజ నిర్మాణానికి బసవేశ్వరుడు చేసిన కృషి అపారమని అన్నారు. స్త్రీ-పురుష సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. మత, కులాలకు అతీతంగా మానవత్వాన్ని ప్రోత్సహించిన మహనీయుడు బసవేశ్వరుడని, ఆయన చూపిన మార్గంలో నడవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గంట శ్రీనివాస్, బండారి వేణు, వంగల పవన్, గుగ్గిళ్ల మంజుల రమేష్, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, గాజ రమ శివరాం తదితరులు, వీరశైవ లింగాయత్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# దోమల.. కుక్కల బెడదను నివారించండి

## ఉప కమిషనర్ శంకర్ నాయక్ వినతిపత్రం అందజేసిన కుంట సిద్ధిరాములు



**కుత్బుల్లాపూర్, (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ లో ఉన్న రాఘవేంద్ర కాలని లో దోమల బెడద, వీధి కుక్కల స్వైర విహారం వలన ఈ కాలనీ అంతా ఇబ్బందికరంగా మారిందని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఉప కమిషనర్ శంకర్ నాయక్ ను కుంట సిద్ధిరాములు కలిసి దోమల వలన ప్రాణాంతకమైన డెంగ్యూ, మెదడు బాబు వంటి వ్యాధుల బారిన పడకుండా కాపాడాలని, వీధి కుక్కల స్వైర విహారంతో పిల్లలు, పెద్దలు, వృద్ధులు భయభ్రాంతులకు గురవుతున్నారని వినతి పత్రంలో వివరించారు. రోడ్ల పై ఉన్న చెత్త చెదారంలో తొలగించి శుభ్రం చేయుటకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఉప కమిషనర్ శంకర్ నాయక్ స్పందిస్తూ వెంటనే సంబధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కుంట సిద్ధిరాములు, వైస్ ప్రెసిడెంట్ జీవన్ దాస్, కోశాధికారి సి హెచ్ రాజు,రమేష్ పాల్గొన్నారు.

# వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన చైర్మన్.



**ధర్మారం(సింగిడి):** వరి ధాన్యకొనుగోలు కేంద్రాలను పత్తిపాక, నర్సింగాపూర్ గ్రామాలలో ఈరోజు మార్కెట్ కమిటీ చైర్మన్ రూపుల నాయక్ ప్రారంభించారు. ఈ సంద ర్భంగా గ్రూప్ల నాయక్ మాట్లాడుతూ చివరి బిందె వరకు రైతుల వద్ద నుండి ప్రభుత్వం వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని అదేవిధంగా రైతులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని అధిక ధరను పొందాలని రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిసిసి కార్యదర్శి కొత్త నరసింహులు సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రంజిత్ యాదవ్, పత్తిపాక సర్పంచ్ మాందాల శ్రావణి హరీష్ బాంగటం కొమురయ్య, మండల నాయకులు చిరంజీవి, మాజీ ఫ్యాక్స్ చైర్మన్ నోముల వెంకట్ రెడ్డి, మాజీ ఎంపిటిసి బద్దం అజయ్ పాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బద్దం గంగారెడ్డి కోలా శ్రీనివాస్ ఉపసర్పంచులు బద్దం సత్యనారాయణ రెడ్డి మల్లేశం మండల నాయకులు ఏదుల్లా అంజయ్య, నీలం నరసయ్య బద్దం సుధాకర్ రెడ్డి లింగారెడ్డి మేన్నేని వెంకటేశ్వరరావు, అన్నెడ నరసింహారెడ్డి, సురుకంటి శ్రీనివాస్ రెడ్డి, కుంటాల నరసయ్య, అంజయ్య, పత్తిపాక సహకార సంఘం సొసైటీ సీఈవో తొర్తి బుచ్చయ్య, కరుణాకర్ మరియు సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
బుధవారం
8-7-2026

# రోడ్లపై వడ్ల కుప్పలు.. ప్రమాదాలకు ఆహ్వానం



**భీమదేవరపల్లి, (సింగిడి):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో రైతులు రోడ్లపై వడ్లను ఆరబెట్టడం వల్ల ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. యాసంగి వరి పంటలు చేతికొచ్చిన నేపథ్యంలో ధాన్యాన్ని త్వరగా ఆరబెట్టేందుకు రైతులు తార్ రోడ్లనే ఉపయోగిస్తూ వడ్ల కుప్పలు వేస్తున్నారు. దీంతో రహదారులపై రాకపోకలకు అంతరాయం కలిగి ప్రమాదాలకు దారితీసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ విషయంపై అంబేద్కర్ సంఘం నాయకుడు కంది సుధాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్లపై వడ్ల కుప్పలు వేయడం సరైన పద్ధతి కాదని పలుమార్లు హెచ్చరించినప్పటికీ రైతులు అదే విధంగా కొనసాగించడం బాధాకరమని అన్నారు. ఈ పరిస్థితుల వల్ల ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, ఇప్పటికే అనేక యాక్సిడెంట్లు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఇన్నేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్లపై వడ్లు ఆరబెడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇకపై ఎవరూ రహదారులపై వడ్లు ఎండబోసే పరిస్థితి రాకుండా చర్యలు చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా ఈ సమస్యను అధికారులు అత్యవసరంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలి

**విద్యాశాఖకు మంత్రిని నియమించాలి..**
**ఏబీవీపీ కరీంనగర్ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు**
**జమ్మికుంటలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం..**



**జమ్మికుంట, (సింగిడి):** రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న 9500 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్‌లు వెంటనే విడుదల చేసి, విద్యాశాఖకు మంత్రిని నియమించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కరీంనగర్ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు మాట్లాడుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జమ్మికుంటశాఖ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేసి, విద్యాశాఖకు మంత్రిని నియమించాలి అని గాంధీ చౌరస్తా దగ్గర రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది.. ఒక రాష్ట్ర అభివృద్ధి విద్యపై ఆధారపడి ఉంటుందని, విద్యను బలోపేతం చేయకుండా రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదని తెలిపారు. రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోం దని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యాశాఖకు ఇప్పటివరకు పూర్తిస్థాయి మంత్రి నియామకం జరగకపోవడం వల్ల విద్యారం గానికి సంబంధించిన అనేక కీలక నిర్ణయాలు ఆలస్యం అవుతున్నాయని తెలిపారు. అందువల్ల వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు, రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్లు మరియు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. స్కాలర్షిప్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ ఆలస్యం కావడం వల్ల అనేక మంది విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువు కొనసాగించడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొన్ని సందర్భాల్లో ఫీజులు చెల్లించలేక విద్యార్థులు కళాశాలలకు హాజరు కాలేకపోతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ఇది విద్యార్థుల భవిష్యత్తుకు ప్రమాదకరమని పేర్కొన్నారు. విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు అని, ఆ హక్కును రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న అన్ని స్కాలర్షిప్లు మరియు ఫీజు రీయింబర్స్మెంట్లను విడుదల చేయడంతో పాటు విద్యారంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో విద్యార్థి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట నగర కార్యదర్శి నిరూప్, మున్నా, శశాంక్, ఆరిఫ్, రోహిత్, అఫ్రిది, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాతృభూమి సేవలో ఆర్ఎస్ఎస్ శతాబ్ద ప్రస్థానం

**హిందూ ఐక్యత, ధర్మ పరిరక్షణపై హిందూ సమ్మేళనంలో ప్రముఖుల పిలుపు**



**కరీంనగర్, (సింగిడి):** మాతృభూమి, సమాజ సేవ కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) వందేళ్లుగా నిరంతరం కృషి చేస్తోందని ఆర్ఎస్ఎస్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ సామల కిరణ్ తెలిపారు. తిమ్మాపూర్ ఉపమండలంలో శ్రీ అనంతపద్మ నాభ స్వామి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశహితం, హిందూ ధర్మం, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ ఆర్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్న ఆయన, అనుబంధ విభాగాలు కూడా వివిధ రంగాల్లో ఇదే దిశగా పనిచేస్తున్నాయని తెలిపారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా దేశవ్యాప్తంగా హిందూ సమ్మేళనాలు విజయవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. పంచ పరివర్తన్ కార్యక్రమాల ద్వారా సామాజిక సమరసత, పర్యావరణ పరిరక్షణ, కుటుంబ విలువల పెంపు, స్వదేశీ ఆచరణ, పౌర బాధ్యత వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నామని వివరించారు. సమాజంలో కులవివక్ష పెరగడం హానికరమని, హిందూ సమాజం ఐక్యంగా ఉన్నప్పుడే దేశం, ధర్మం బలంగా నిలుస్తాయని ఆయన అభిప్రాయ పడ్డారు. ఇతర ప్రసంగకర్తలు కూడా హిందూ ధర్మం ప్రాచీనత, విశిష్టతను వివరించి, సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. యువత సన్మార్గంలో నడవాలని, ఆధ్యాత్మిక జీవనానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంఘ నాయకులు, పండితులు, గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అక్రమార్కుల చేతికే

# మళ్లీ కొనుగోలు కేంద్రాలు!

**నిద్రమత్తులో సంబంధిత అధికారులు**
**మండలమంతా వ్యతిరేకత చూపిన**
**మళ్లీ వారికి కట్టబెట్టడంలో ఆంతర్యం ఏమిటో?**

**ములుగు ప్రతినిధి,(సింగిడి):** మంగపేట మండలంలో గత వర్షాకాలం సీజన్ లో నర్సాపూర్ గ్రామంలో ఉన్నటువంటి మ్యాక్స్ సెంటర్ నిర్వాహకులు అవక తవకలకు పాల్పడి వారి సంబం ధికుల ఖాతాలోకి ప్రభుత్వం నుంచి డబ్బులు కొట్టించుకున్న పరిస్థితి మండలమంతా నెలరోజులపాటుకోడై కూసింది. కొన్ని రకాల నిగా వర్గాలు గుట్టుచప్పుడు కాకుండాఎంక్వయిరీలు జరిపినట్లు తెలిసిందే ఇంత జరిగినా మరలా ఈ సీజన్ ధాన్యంకొనుగోలు అధికారపార్టీ అండదండలతో ఎన్ని కుంభకోణాలు చేసిన ఎన్ని తప్పులుచేసిన మళ్ళీ వారికే మాక్స్ సెంటర్ లు గవర్నమెంట్ కట్టబెట్టడం చూస్తుంటేసంబంధిత అధికారులు నిద్రమత్తులో ఉన్నట్లు తెలుస్తుందని ప్రజలుబహిరంగంగానే చర్చించుకుంటున్నారని జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడేల నరేష్ ఆరోపిస్తున్నారు. వెంటనే కొనుగులు నిలిపివేసి నిరుద్యోగులె వరికైనా అప్పగించి కొనుగోలు నిర్వహించాలని ఆయన అధికారులను కోరారు. తద్వారా అక్రమాలను అరికట్టినవారవుతారని అభిప్రాయపడ్డారు.

# 12న జలవిహార్‌లో జన ప్రవంతి పార్టీ నాలుగవ ప్లేనరీ



**పాలేరు (సింగిడి):** మే 12 వ తేదిన హైదరాబాద్ లోని జలవిహార్ లో జరుగునున్న తెలంగాణ జన ప్రవంతి పార్టీ 4వ ప్లేనరీ జయప్రదం చేయాలంటూ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలేరు నియోజకవర్గ, ఇంచార్జ్ గోపగాని శంకరరావు, జిల్లా నాయకులు మండల మాదాసు శ్రీనివాసరావు ,మండల నాయకులు తీగ రాములు మందడపూడి వెంకటేశ్వరావు, రఘునాధపాలెం మండల అధ్యక్షులు రాగం పాపారావు సహా, 20, మంది కార్యకర్తలు పాల్గొని వాల్ పోస్టర్లు విడుదల చేసి కర్ర పత్రములు పంచడం జరిగినది. అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని కోదండ రాం నేపధ్యములో పార్టీలో నిలబడి ప్రజా సమస్యలను పోరాడి సాధించుకుందాం మే 12 వ తారీకు జరుగునున్న ప్లేనరీ తో ఉద్యమ కార్యకర్తలు గా పనిచేసి పార్టీని గ్రామస్థాయి నుండి జిల్లాస్థాయిగా పరిష్కపరచాలని గోపగాని శంకర్రావు కార్యకర్తలు కోరారు ప్రధాన రాజకీయాలను నెరవేర్చటానికి కోదండరాం సారథ్యంలో ఏప్రిల్ 29న పార్టీ ఏర్పడుతుందని అదే స్ఫూర్తితో పార్టీ శ్రేయులు కోదండ రాం ని బలపరచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమములో పాల్గొన్నవారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు, జిల్లా నాయకులు మాదాసు శ్రీనివాసరావు, మందడి వెంకటేశ్వరావు, తీగ రాములు, ధనమూర్తి, కస్తూరి మల్సూరు, గుగులోతు ఆంజనేయులు, సురగాని యాకయ్య, అమ్మటి వెంకటేశ్వర్లు, కర్లపూడి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# నాయకపోడు తెగకు ప్రత్యేక సీరియల్ నెంబర్ కేటాయించాలని డిమాండ్

**తప్పుడు లెక్కల వల్ల ఉద్యోగ, ఉపాధి, అభివృద్ధి అవకాశాలు కోల్పోతున్న నాయకపోడు తెగ**





**గుండాల,(సింగిడి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికారిక గణాంకాల్లో నాయకపోడు తెగ జనాభా వివరాలను సరిచేయాలని , రాబోయే జనగణనలో ప్రత్యేక గుర్తింపునివ్వాలని కోరుతూ సోమవారం ఆదివాసీ నాయకపోడు సేవ సంఘం ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అంకిత్ కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆదివాసీ నాయకపోడు సేవ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ... ఇటీవల ప్రభుత్వం వివిధ మాధ్యమాల ద్వారా ప్రకటించిన జనాభా వివరాలలో నాయకపోడు తెగ జనాభాను అతి తక్కువగా (కేవలం 16,000 గా) చూపడం జరిగిందని, ఇది వాస్తవానికి పూర్తిగా విరుద్ధంగా ఉందని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే మా జనాభా సుమారు 70,000 పైచిలుకుగా ఉందని వారు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 6 లక్షల నాయకపోడు జనాభా కలిగి ఉన్నామని, 1949లో షెడ్యూల్డ్ తెగల జాబితాలో స్వతంత్రంగా ఉన్న మా తెగను, 1950లో గోండు తెగకు ఉప తెగగా మార్చి సీరియల్ నంబర్ 6 లో చేర్చడం జరిగిందని అన్నారు. దీనివల్ల మా ప్రత్యేక సంస్కృతి, ఉనికి కనుమరుగవుతున్నాయని, ఫలితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్యా, ఉద్యోగ అవకాశాలు మా జాతికి సరిగ్గా అందడం లేదని వాపోయారు.

ప్రస్తుత ప్రభుత్వ సర్వేలోని తప్పులను వెంటనే సవరించి, మా వాస్తవ జనాభా లెక్కలను ప్రకటించాలని, రాబోయే కేంద్ర ప్రభుత్వ కుల గణన జనగణనలో నాయకపోడు తెగకు ప్రత్యేక కాలమ్ కేటాయించి మా వివరాలను నమోదు చేయాలని,షెడ్యూల్డ్ తెగల జాబితాలో మా తెగకు తిరిగి ప్రత్యేక సీరియల్ నంబర్ కేటాయించి మా అస్తిత్వాన్ని కాపాడాలని వారు డిమాండ్ చేశారు. మా జాతి ఉనికిని, హక్కులను కాపాడటానికి జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, ప్రభుత్వ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాలని మేము విజ్ఞప్తి చేస్తున్నామని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకపోడు సేవ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను సన్మానించి బహుమతులు అందజేసిన మేనేజింగ్ డైరెక్టర్ నామ కృష్ణయ్య..



**పాలేరు (సింగిడి):** మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ పరిధిలో 2025-26 చెరకు గానుగను సీజన్‌లో వివిధ రంగాల్లో అధిక దిగుబడులు సాధించిన రైతులకు మేనేజింగ్ డైరెక్టర్ నామా కృష్ణయ్య కర్మాగారంలో సన్మానించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య కర్మాగారం ఆవరణలో పత్రికా విలేకరులతో మాట్లాడుతూ ఈ సంవత్సరం సకాలంలో చెరకు బిల్లులు చెల్లించామని తెలియజేశారు. గత రెండు సంవత్సరాలుగా కర్మాగారం పరిధిలో చెరకు విస్తీర్ణం బాగా తగ్గింది. ఫలితంగా లక్ష టన్నులు కూడా గానుగను లేకపోయాము. అందువలన కర్మాగారం బాగా నష్టాల్లో ఉంది. అయినప్పటికీ ఈ ప్రాంతంలో ఉన్న రైతులు మరియు ఉద్యోగుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఈ కర్మాగారం నడిపించున్నాము. ఈ సందర్భంగా రైతులు అందరిని కోరుకునేది ఏమనగా, కర్మాగారం పరిధిలో రైతులు అందరూ చెరకు సాగు విస్తీర్ణం పెంచి కర్మాగారం కనీస గానుగను సామర్థ్యం చేరుటకు గాను నాలుగు లక్షల టన్నులకు తగ్గకుండా చెరకు పండించి కర్మాగారానికి సరఫరా చేసినచో నిలదొక్కుకోగలము అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 42 చక్కెర కర్మాగారాలు ఉండగా ప్రస్తుతం రెండు రాష్ట్రాలలో 11 కర్మాగారాలు మాత్రమే నడుస్తున్నాయి. కర్మాగారాలకు సరిపడా చెరకు లభ్యత లేక ఆయా యాజమాన్యాలు కర్మాగారాలు నడపలేకపోతున్నాయి. కాని మన కర్మాగారంలో చెరకు సాగు విస్తీర్ణం తగ్గి కర్మాగారం నష్టాల్లో ఉన్నప్పటికీ కర్మాగారం నడిపించుచున్నాము. అంతేకాకుండా, రైతులకు సాగు ఖర్చులు పెరిగిన దృష్ట్యా మన రికవరీ ప్రకారం వచ్చిన చెరకు మద్దతు ధర కంటే రూ.210లు కలిపి అధిక ధర





చెల్లించుచున్నాము. విత్తన రాయితీ ఉచితంగా ఇచ్చే చెక్కెరతో కలిపి టన్ను ఒక్కటికి రూ. 3,768.00 చెల్లించుచున్నాము. ఈ సన్మాన సభ ముఖ్య ఉద్దేశ్యం ఏమనగా రైతుల్లో పోటీ తత్వాన్ని పెంచి, తద్వారా రైతులు అందరూ అధిక దిగుబడులు సాధించి చెరకు సాగు మిగిలిన పంటల కంటే లాభసాటిగా ఉండేలా ప్రోత్సహించుటకే. కావున రైతులందరూ అధిక విస్తీర్ణంలో చెరకు సాగు చేసి కర్మాగారానికి సరిపడా చెరకు ఉత్పత్తి చేసి కర్మాగారం అభివృద్ధి మరియు ఈ ప్రాంత రైతుల అభివృద్ధికి తోడ్పడగలరని ఆశిస్తున్నాము. ఈ కార్యక్రమంలో ఏవీపీ కోటయ్య, సీనియర్ జీఎం వెంకటేశ్వర్లు, డీజీఎం కేన్ కె. అప్పారావు, ఏజీఎం హెచ్ఆర్ నరేష్ మరియు వివిధ గ్రామాల రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# జనగణన సెన్సెస్ శిక్షణ తరగతుల సమయపాలన మార్పు చేయాలి

**ఎమ్మార్వో నరేష్‌కి వినతి పత్రం అందించిన టీఎస్‌యుటిఎఫ్ నాయకులు**




**మునుగోడు, (సింగిడి):** మునుగోడు మండలంలో సెన్సెస్ 2027 నిర్వహణకు సంబంధించిన విధుల్లో సమయపాలన మార్పు చేయాలని కోరుతూ, టీ ఎస్ యుటిఎఫ్ మునుగోడు మండల యూటీఎఫ్ ప్రతినిధులు మండల తాసిల్దార్ నరేష్ కి సోమవారం వినతిపత్రం సమర్పించారు. వేసవి కాలంలో ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రస్తుతము ఎనిమిది గంటల నుంచి 5 గంటల వరకు ఉన్న సమయాన్ని మార్చి, ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, మునుగోడు మండల కేంద్రంలో కాకుండా నల్లగొండ జిల్లా కేంద్రంలో శిక్షణలను నిర్వహించాలని కోరారు. ఎండ వేడి వల్ల ఉపాధ్యాయులకు ప్రయాణ భారం తగ్గి, సమర్థవంతమైన శిక్షణ అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా. టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గేర నరసింహ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా వేసవి కాలంలో అనుకూలమైన సమయపాలన అవసరమని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు కావాలంటే ఫీల్డ్ సిబ్బందికి అనుకూల వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో, మునుగోడు మండల అధ్యక్షుడు బిక్కుమళ్ళ రాములు, ప్రధాన కార్యదర్శి పెరిక నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఐటీసీ ఉద్యోగికి అరుదైన గౌరవం...

# డా. తోకల రమేష్‌కు అమెరికా గౌరవ డాక్టరేట్

**గ్రామం నుంచి గ్లోబల్ దాకా ప్రయాణం... జానపద కళల సేవకు అంతర్జాతీయ గుర్తింపు**




**అశ్వాపురం, (సింగిడి):** అశ్వాపురం మండలం మల్లెలమడుగు గ్రామానికి చెందిన ఐటీసీ ఉద్యోగి తోకల రమేష్‌కు అమెరికాలోని లూసియానా రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ (హోనోరిస్ కాసా) ప్రదానం చేసింది. మహారాష్ట్రలోని పూణేలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ అతిథుల చేతుల మీదుగా ఈ గౌరవాన్ని అందుకున్నారు. తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా జానపద కళలపై, ముఖ్యంగా కోలాటం అభివృద్ధిపై చేసిన పరిశోధనలు, సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. గత ఎన్నో సంవత్సరాలుగా కళా సేవలో అంకితభావంతో పనిచేస్తూ, గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ గుర్తింపు పొందడం విశేషంగా నిలిచింది. సారపాక ఐటీసీలో ఉద్యోగిగా పనిచేస్తూనే జానపద కళల అభివృద్ధికి కృషి చేస్తూ, యువతలో ఈ కళలపై ఆసక్తి పెంపొందించడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా ఐటీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, శ్రేయోభిలాషులు డా. తోకల రమేష్‌కు అభినందనలు తెలియజేశారు.

# మండల కేంద్రంలో కొప్పుల జన్మదిన వేడుకలు



**ధర్మారం (సింగిడి):** ఈ రోజు తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద టిఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు రాచూరి శ్రీధర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ కొప్పుల ఈశ్వర్ సింగరేణి కుటుంబంలో పుట్టి సింగరేణి ఉద్యోగం చేస్తూ సింగరేణి కార్మికుల కోసం అనేక ఉద్యమాలు చేపట్టారని,తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించారని ధర్మపురి నియోజకవర్గాన్ని తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి పథంలో ముందు ఉంచారాని, ఎల్ ఎం కొప్పుల ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారనివారి యొక్క సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ మండల శాఖ తరుపున కొప్పుల ఈశ్వర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు . ఈ కార్యక్రమంలో ముత్యాల బలరాం రెడ్డి కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి గుర్రం మోహన్ రెడ్డి, రాజయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# మండల అంబేద్కర్ యువజన సంఘం అడ్ హాక్ కమిటీ ఎన్నిక



**చింతపల్లి, (సింగిడి):** మండల అంబేద్కర్ యువజన సంఘం అడ్ హక్ కమిటీ ఎన్నికలను సోమవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ ఎన్నికలను వింజమూరు కృష్ణ మాదిగ, ఎర్ర జగన్ మాదిగ, ఎలిమినేటి నరసింహ మాదిగ, ఆరకంటి యాదయ్య మాదిగ, మాసని పెద్దయ్య మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతన కమిటీ చైర్మన్ గా బావుండ్లపల్లి చెన్నయ్య కో-చైర్మన్‌లు, ఎర్ర కిరణ్, గాలి ప్రకాష్ సభ్యులుగా పేర్ల జంగయ్య, కడమంచి శ్రీను, కొడిదుటి జంగయ్య, చెట్టిపల్లి చిరంజీవి, కంబాలపల్లి శేఖర్, శెట్టిపల్లి రవీందర్, గార్లపాటి వెంకటయ్య, పోలే లాలయ్య, కురుమేటి వెంకటరమణ, ఆరేకంటి యాదగిరి, ఆరేకంటి మైసయ్య, ఆరేకంటి రాధాకృష్ణ, గోవింద్, రవి, ఎస్. కే. సలీం, నల్లవెల్లి సైదులు, బాల్ సింగ్, ఎల్లంకి అశోక్, ఏర్పుల దావలయ్య, గువ్వల శ్రీనివాస్ రెడ్డి, యాదయ్య యాదవ్, బండి సైదులు, గోవింద గిరి, కదారి శీను, గుణమోని ఐలయ్య, కొలుకులపల్లి హరికృష్ణ తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నల్ల శంకర్, కందుల నాగయ్య, సిద్ధ సాయికుమార్, నల్ల ప్రసాద్, ఊరే భాస్కర్, దుబ్బ నరసింహ, కందుకూరు శంకర్, భూషిపాక సీనయ్య, భరత్, మాసాని పవన్, అంబేద్కర్ సంఘం మాజీ అధ్యక్షుడు ఎర్ర వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించండి

**-సిపిఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ.**




**గుండాల, (సింగిడి):** పీడిత ప్రజల ఆశాజ్యోతి సిపిఐ(ఎం-ఎల్) పార్టీ ఏప్రిల్ 22న ప్రపంచ కమ్యూనిస్టు నాయకుడు లెనిన్ జయంతి రోజున భారతదే శంలో ఆవిర్భవించిందని సందర్భంగా మండలంలోని గ్రామ గ్రామాన పార్టీ జన్మ దినోత్సవాలను ఘనంగా నిర్వహించాలని సిపిఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి అరెం నరేష్ పిలుపునిచ్చారు.
సోమవారంగుండాల మండల కేంద్రంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో తను మాట్లాడుతూ 1969 ఏప్రిల్ 22న సిపిఐ (ఎం-ఎల్) ఆవిర్భవించి దున్నే వానికి భూమి కావాలని, మనిషిని వేరొక మనిషి దోచుకోకూడదని అసమానతలు లేని సమాజం కోసం అనేక పోరాటాలు నిర్వహిం చిందని, ఈ పోరాటాలలో అనేకమంది తమ విలువైన ప్రాణాలు పేద ప్రజల కోసం రక్తత ర్పణ చేశారని అన్నారు. అమరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ గ్రామ గ్రామాన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవా లని పిలుపునిచ్చారు. అనేక వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన బిజెపి కాంగ్రెస్ ప్రభుత్వాలు వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా, మండల నాయకులు గుండాల సర్పంచ్ కొరం సీతారాములు, పర్శక రవి,యాసారపు వెంకన్న,గడ్డం లాలయ్య, ఈసం కృష్ణ, ఈసం మంగన్న, మానాల ఉపేందర్, బానోతు లాలు, తాటి రమేష్, కల్తి నరసింహారావు, భూక్య వెంకన్న, దుగ్గి శేఖర్, కుంజ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలు హమలు పరుస్తున్న లక్ష్మీపూర్ సర్పంచ్



**కమలాపూర్ (సింగిడి):** ఎన్నికల సందర్భంగా ఇచ్చినటువంటి హామీలు ఒక్కొక్కటి నెరవేస్తున్నానని లక్ష్మిపూర్ గ్రామ సర్పంచ్ రాజేష్ తెలిపారు. గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం లక్ష పది వేల రూపాయలతోనిర్మించిన రేకుల షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజేష్‌మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గ్రామ ప్రజలకు పలు హామీలు ఇచ్చానని సర్పంచ్ గాగెలిచి బాధ్యతలు చేపట్టిన అనంతరం స్వంత ఖర్చులతో ఒక్కొక్క హామీ నెరవేస్తున్నానని తెలిపారు. మొదటి హామీ గ్రామంలో ఎవరికైనా ఆడ బిడ్డజన్మిస్తే ఐదు వేల రూపాయల నగదు అందిస్తానని చెప్పి గత రెండు నెలల క్రితంఆ హామీ నెరవేర్చానని అన్నారు. అదేవిధంగా ఆంజనేయ స్వామి ఆలయంలో లక్ష పదివేల రూపాయల వ్యయంతో రేకుల షెడ్డు నిర్మించి రెండో హామీనెరవేర్చానని,రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతాననిసర్పంచ్ రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు,హనుమాన్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి SINGIDI తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
బుధవారం
8-7-2026

## బాబు జన్మదిన వేడుకల్లో మండవ వెంకటేశ్వర్లు గౌడ్





**హుజూర్‌నగర్ (సింగిడి):** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదినం సందర్భంగా హైదరాబాద్ లో తెలుగుదేశం పార్టీ , తెలుగు యువత ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకలలో హుజూర్నగర్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మండవ వెంకటేశ్వర్లు గౌడ్ పాల్గొనడం జరిగింది. అనంతరం ఇటీవల పోలిట్ బ్యూరో సభ్యులుగా నియమితులైన శ్రీ బక్కని నరసింహులు , అరవింద్ కుమార్ గౌడ్ జాతీయ అధికార ప్రతినిధిగా నియమితులైన నన్నూరి నర్సిరెడ్డిను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

## తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి తీరుపై విద్యార్థుల ఆగ్రహం: బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్



**చేవెళ్ళ (సింగిడి):** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి (ఎజ) ప్రొఫెసర్ నిత్యానందరావు విద్యార్థుల పట్ల ప్రదర్శించిన అహంకారపూరిత ప్రవర్తన తీవ్ర వివాదస్పదమైంది. సమస్యలు విన్నవించుకోవడానికి వెళ్లిన విద్యార్థులతో కాళ్ల మీద కాళ్లు వేసుకుని కూర్చుని, వారిని కించపరిచేలా మాట్లాడటంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్ల హాస్టల్ మెస్ బకాయిలు చెల్లించలేకపోతున్నామని, తాము పేద విద్యార్థులమని వేడుకున్నప్పటికీ వీసీ కనికరించలేదు. పైగా, "హాస్టల్‌లో ఉంటూ పుక్కిట తింటున్నారు" అంటూ విద్యార్థులను దూషించడం ఆయన స్థాయికి తగని పని. విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులను హేళన చేస్తూ, "మొబైల్ ఫోన్లు, మోటార్ సైకిళ్లు వాడటం లేదా?" అని ఆయన చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయి.విద్యా బుద్ధులు నేర్పాల్సిన స్థానంలో ఉండి, పేద విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన వీసీ నిత్యానందరావు వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, విద్యార్థులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు, దీనికి ఈ విషయంపై అన్ని విద్యార్థి సంఘాలు సంఘీభావం ప్రకటించారు..

## మహనీయుల జాతరను విజయవంతం చేయండి.

-కౌన్సిలర్ తాళ్లపల్లి నర్సింలు.



**చేవెళ్ళ (సింగిడి):** చేవెళ్లలో ఈనెల 30న జరిగే మహనీయుల జాతరను విజయవంతం చేయాలని 9వ వార్డు కౌన్సిలర్ తాళ్లపల్లి నర్సింలు అన్నారు. మున్సిపల్ పరిధిలోని 9వార్డులో దామరగిద్దలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులతో కలిసి చేవెళ్ల మహనీయుల జాతర వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. మహనీయుల జాతర కమిటీ వైస్ చైర్మన్ మాచన్ పల్లి రామస్వామి, కోశాధికారి నేర్పుల మల్లేష్, రాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మాచన్ పల్లి రామచంద్రయ్య, కమిటీ సభ్యులు బ్యాగరి ప్రభాకర్, మాజీ ఉపసర్పంచ్ మాల నర్సింలు, అంబేద్కర్ సంఘం సభ్యులు పోతురాజు నవీన్, జేజ మోష, బేగరి డానియల్, బేగరి అనిల్, బేగరి రాజు, బేగరి ఎల్లయ్య, ప్రేమ్ కుమార్, జగ్జీవన్ రామ్ సంఘం సభ్యులు దప్పు రాజు, బోడ పవన్, బోడ సామిల్, శివయ్య, బోడ అంజయ్య, వార్డు ప్రజలు కృష్ణారెడ్డి, కిష్టయ్య, రమేష్, ప్రభు, శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

## నేరెళ్లకు దక్కిన అరుదైన గౌరవం

### జిల్లా అధికార ప్రతినిధిగా మహేందర్ గౌడ్ నియామకం

### పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తా.



**జమ్మికుంట, (సింగిడి):** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా హుజురాబాద్ మండలంలోని చెల్పూరు గ్రామానికి చెందిన నేరెళ్ల మహేందర్ గౌడ్ ను నిర్మించినట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం డిసిసి అధ్యక్షుడు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నూతన కమిటీల జాబితాను విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే మహేందర్ గౌడ్ సేవలను అధిష్టానం గుర్తించి ఆయనకు ఈ అరుదైన అవకాశాన్ని కల్పించారు. ఈ సందర్భంగా మహేందర్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు సరైన సమయంలో గుర్తింపు లభిస్తుందని పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న తనకు అధిష్టానం ఈ అవకాశం కల్పించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. తన నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ శ్రీధర్ బాబు టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ డిసిసి అధ్యక్షులు మేడిపల్లి సత్యం హుజురాబాద్ నియోజకవర్గం ఇన్చార్జి ప్రణవ్ బాబు కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అధిష్టానం ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇన్చార్జి సూచన తో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కాగా మహేందర్ గౌడ్ నియామకం పట్ల మండలంలోని కాంగ్రెస్ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## పాలవరంలో సీసీ రోడ్డుకు డ్రైనేజ్ పనులు ప్రారంభం

### ఎన్నారై రవి- సర్పంచ్ ఆధ్వర్యంలో పనులకు శ్రీకారం



**కోదాడ,(సింగిడి):** పాలవరం గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరొక అడుగు పడింది. గ్రామంలోని ప్రధాన రహదారిపై ఇటీవల ఏర్పాటు చేసిన సీసీ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజ్ కాలువల నిర్మాణానికి ముందస్తు చర్యలు చేపట్టారు.ఎన్నారై రవి , గ్రామ సర్పంచ్ మట్టపల్లి నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ పనులు ప్రారంభమయ్యాయి. జేసీబీ యంత్రంతో కాలువ తవ్వకాలు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో నీటి నిల్వలు నివారించడంతో పాటు రహదారి దెబ్బతినకుండా కాపాడే లక్ష్యంతో ఈ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో మౌలిక సదుపాయాల మెరుగుదలపై స్థానికులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ డ్రైనేజ్ వ్యవస్థ పూర్తి అయితే రహదారి వినియోగం మరింత సౌకర్యవంతంగా మారుతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

### బాల్య వివాహ రహిత జిల్లాలుగా

# తీర్చిదిద్దడమే లక్ష్యం

### ఆర్డీఎస్ ఆధ్వర్యంలో విజిలెన్స్ దినోత్సవం

### రూరల్ డెవలప్మెంట్ సొసైటీ డైరెక్టర్ చిన్నమ్మ తామస్







**వనపర్తి ప్రతినిధి, (సింగిడి):** వనపర్తి, జోగులాంబ గద్వాల, మహబూబ్ నగర్ జిల్లాలను బాల్య వివాహ రహిత జిల్లాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని రూరల్ డెవలప్మెంట్ సొసైటీ డైరెక్టర్ చిన్నమ్మ తామస్ అన్నారు. అక్షయ తృతీయ నాడు బాల్య వివాహాలను నివారించడానికి రూరల్ డెవలప్మెంట్ సొసైటీ జిల్లా యంత్రాంగంతో కలిసి విజిలెన్స్ దినోత్సవాన్ని పాటిస్తున్నట్లు ఆమె చెప్పారు. రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వనపర్తి, జోగులాంబ గద్వాల, మహబూబ్ నగర్ జిల్లాల్లో బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నివారణ కోసం ఆర్డీఎస్ స్వచ్ఛంద సంస్థ పనిచేస్తున్నదని, బాల్య వివాహాలను అరికట్టడానికి అక్షయ తృతీయ సందర్భంగా విజిలెన్స్ దినోత్సవాన్ని పాటిస్తున్నదని చెప్పారు. బాల్య వివాహాల నివారణ అధికారులు (సీఎంపిఓ), ఆశా యూనిట్లు కూడా తమ మద్దతును అందించి జిల్లా వ్యాప్తంగా బాల్య వివాహాలను నివారించడానికి ప్రతిజ్ఞ చేశారని తెలిపారు.

రూరల్ డెవలప్మెంట్ సొసైటీ జిల్లా యంత్రాంగం పంచాయతీలు, పాఠశాలలు, మత పెద్దలతో కలిసి జిల్లాలను బాల్య వివాహ రహితంగా మార్చాలని లక్ష్యంతో పాఠశాలలు, పంచాయతీలు, గ్రామాలలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోందని చెప్పారు. ఈ సంస్థ జిల్లా వ్యాప్తంగా వేలాది మందితో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞలు చేయించిందని, అక్షయ తృతీయ, వివిధ మతాలలో వివాహాల సీజన్ ప్రారంభం వంటి సున్నితమైన సందర్భాలలో పరిపాలన, ప్రభుత్వ సహకారంతో ఈ ప్రత్యేక నివారణ కార్యక్రమాలను నిర్వహిస్తోందని ఆమె గుర్తు చేశారు. రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అనేది 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్' భాగస్వామ్య సంస్థ అని,ఇది బాలల హక్కుల పరిరక్షణ, ప్రోత్సాహం కోసం పనిచేస్తూ 250కి పైగా ఎన్జీవోలతో దేశంలోనే అతిపెద్ద నెట్వర్క్ అని చెప్పారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ దేశవ్యాప్తంగా బాల్య వివాహాలు అధికంగా ఉన్న 450కి పైగా జిల్లాల్లో ఈ నేరానికి వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తోందని,ఈ నెట్వర్క్ ఇప్పటివరకు ఐదు లక్షలకు పైగా బాల్య వివాహాలను నివారించిందని చిన్నమ్మ తామస్ వివరించారు. చట్టపరమైన పర్యవసానాలు,బాల్య వివాహాల నిషేధ చట్టం-2006 (పీసీఎంఏ) కింద బాల్య వివాహం ఒక శిక్షార్హమైన నేరమని, ఇటువంటి వివాహాలలో ఏ రూపంలోనైనా పాలుపంచుకోవడం లేదా సేవలను అందించడం వల్ల గరిష్టంగా రెండేళ్ల జైలు శిక్షకు, జరిమానాకు లేదా ఈ రెండింటికీ దారితీయవచ్చని తెలిపారు. ఈ నేరంలో భాగస్వాములుగా పరిగణించబడే వారు వధువు కుటుంబ సభ్యులు, పెళ్లి ఊరేగింపులో పాల్గొనేవారు, వంటవారు, అలంకరణ నిపుణులు, స్వీట్ల తయారీదారులు. పూల వ్యాపారులు, బాజామేళం వారు, కళ్యాణ మండపాల యజమానులు. వివాహాన్ని జరిపించే పూజారులు, మౌల్వీలని పేర్కొన్నారు. బాల్య వివాహం ఒక హేయమైన నేరమని, అక్షయ తృతీయ వంటి పవిత్ర సందర్భం ముసుగులో గానీ, మరే ఇతర మతపరమైన ఆచారాల పేరుతో గానీ దీనిని ఏమాత్రం ఆమోదించలేమని వివరించారు. జిల్లాల్లో పెరుగుతున్న అవగాహన పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రజలు ఇప్పుడు బాల్య వివాహాల గురించి సమాచారం అందిస్తున్నారని, దీనివల్ల 2030 కంటే ముందే జిల్లాలను బాల్య వివాహ రహితంగా మార్చగలమనే ఆశాభావాన్ని చిన్నమ్మ తామస్ వ్యక్తం చేశారు.

# చట్టబద్ధమైన పని వేళలు అమలు చేయాలి

### మున్సిపల్ ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి



**గోదావరిఖని, (సింగిడి):** రామగుండం నగర పాలక సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు చట్టబద్ధమైన పని వేళలు అమలు చేయాలని కోరుతూ ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు యూనియన్ నగర కమిటీ అధ్యక్షుడు మద్దెల దినేష్, కార్యదర్శి ఎం.ఎ. గౌస్ శనివారం కలెక్టర్‌ను కలిసి సమస్యలను వివరించారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో చట్టబద్ధమైన ఎనిమిది గంటల పని విధానం అమలు కావడం లేదని, ప్రస్తుత కమిషనర్ ఇష్టానుసారంగా పని వేళలు కొనసాగిస్తున్నారని వారు ఆరోపించారు. ఉదయం విధులకు హాజరయ్యే ఉద్యోగులు రాత్రి 10 గంటల వరకు కార్యాలయంలోనే ఉండాల్సి వస్తోందని, దీంతో సిబ్బంది ఇంటికి చేరేసరికి అర్ధరాత్రి అవుతోందని తెలిపారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ఉద్యోగులు రవాణా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా మహిళా ఉద్యోగులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. నిరంతరాయంగా ఎక్కువ గంటలు పనిచేయాల్సి రావడంతో ఉద్యోగులు ఆరోగ్య సమస్యలను కూడా ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ పరిస్థితిపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని చట్టబద్ధమైన పని వేళలు అమలు చేయాలని, సమయపాలన తీసుకురావాలని, మహిళా ఉద్యోగులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఇదే అంశంపై సీడీఎంఏ హైదరాబాద్, ఆర్‌డీఎంఏ వరంగల్ అధికారులకు కూడా పోస్టు, ఈమెయిల్ ద్వారా వినతిపత్రాలు పంపినట్లు నాయకులు తెలిపారు.

# రైతుకు మద్దతు ధర కల్పించడమే ప్రధాన లక్ష్యం



కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు లక్ష్మీదేవిపల్లిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే



**కొత్తగూడెం, (సింగిడి):** మొక్కజొన్న రైతులకు మద్దతు ధర కల్పించి వారిని ఆర్థికంగా ఆదుకోవడమే ప్రధాన లక్ష్యమని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలపరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఎవరణలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు సరైన ధర కల్పించాలనే ఉద్దేశంతో నియోజకవర్గ పరిధిలో రెండు కేంద్రాల ఏర్పాటుకు కృషి చేయడం జరిగిందని తెలిపారు. రైతులు తమ పంటను దళారులకు తక్కువ ధరకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను పొందాలని సూచించారు. నియోజకవర్గంలోని రైతుల ఇబ్బందులను గమనించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈ కేంద్రాలను మంజూరు చేయించామని పేర్కొన్నారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా తూకం, నగదు చెల్లింపుల విషయంలో పారదర్శకత పాటించాలని ఆదేశించారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ నియోజకవర్గ రైతాంగానికి ఎల్లవేళలా అండగా ఉంటానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. తహసీల్దార్ శిరీష, ఆర్ఐ కృష్ణ, హరీష్, సిపిఐ మండల కార్యదర్శి దీటి లక్ష్మిపతి, నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, స్థానికులు రాంబాబు, లక్ష్మణ్, కళ్యాణి, పాషా, తహసీల్దార్, చింటూ, నూనావత్ గోవిందు, మిర్యాల రాము, ప్రసాద్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌లో ప్రజా, కుల సంఘాల నాయకులు

### పలువురు నాయకులు ముందస్తు అరెస్ట్



**కాటారం,(సింగిడి):** మండలంలోని పలు ప్రజా, కుల సంఘాల, రాజకీయ నేతలను పోలీసులు సోమవారం ముందస్తు అరెస్ట్ చేశారు. నస్తూరుపల్లిలో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగసభ నేపథ్యంలో నాయకపోడ్, ఎమ్మార్పీఎస్ సంఘాల నేతలు, బీఆర్ఎస్ నాయకులను ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు । తెల్లవారుజామున తీసుకొచ్చి పోలీస్‌స్టేషన్ లో ఉంచారు. సాయంత్రం వారిని విడిచిపెట్టారు. పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసిన వారిలో నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుంకరి మల్లేష్, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నేత పోచయ్య, బీఆర్ఎస్ నేత బొడ్డు రాజబాపు, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## నోముల నరసింహ మరణం సిపిఐ పార్టీకి తీరనిలోటు



**చింతపల్లి, (సింగిడి):)** మండలంలోని నసర్లపల్లి గ్రామానికి చెందిన సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు, నోముల నరసింహ ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు రావు అన్నారు. సోమవారం నరసింహ భౌతిక కాయం పై పూలమాలవేసి, ఎర్ర జెండా కప్పి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకుడు ఉజ్జిని యుగేంద్రరావుమాట్లాడుతూ నోముల నరసింహ చాలా కాలం పాటు పార్టీకి సేవ చేశాడని, పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం చేసిన అనేక పోరాటాలలో చురుగ్గా పాల్గొనే వాడని అన్నారు. ఆయన లేని లోటు పార్టీకి తీరని నష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి పోలే వెంకటయ్య,ఏఐవైఎస్ ఎఫ్ ముదిగొండ మురళీకృష్ణ,మండల కార్యవర్గ సభ్యులు కొడిదల వెంకటయ్య, గ్రామ శాఖ గ్రామ శాఖ కార్యదర్శి మల్లం నరసింహ, నల్లవెల్లి సోమయ్య, దుగ్యాల వీరయ్య, జోగు శ్రీరాములు, పులిజాల కాశయ్య, నల్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాల ఏర్పాటు చేయడం అభినందనియం

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మల్కాజిగిరి,(సింగిడి):** రోజు రోజుకు పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతల కారణంగా పాదాచారుల, సామాన్య ప్రజలు దాహంతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారి సౌకర్యార్థం చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని మల్కాజిగిరి ముఖ్య ప్రాంతాలలోని మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో, సఫిల్ గూడాలోని శ్రీ కట్ట మైసమ్మ దేవాలయం ఎదురుగా, వినాయక్ నగర్ లోని చెనా బజార్ సమీపంలో బిఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చలివేంద్రాల ద్వారా ప్రయాణికులు, కార్మికులు, స్థానిక ప్రజలు తాగునీటి సదుపాయాన్ని పొందుతూ వేసవి తాపాన్ని తట్టుకునేలా సహాయం చేస్తు ఉండడం,చలివేంద్రాల ఏర్పాటులో సహకరించిన మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మస్తిపురం జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో మినీ ఆర్వో ప్లాంట్

**అమరచింత, (సింగిడి):** అమరచింత మండలంలోని మస్తీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారంకోరమండల్ మన గ్రోమోర్ ఆత్మకూర్ సహకారంతో మినీ ప్యూరిఫైడ్ ఆర్వో ప్లాంట్‌ను ఏరియా మేనేజర్ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో తాగునీటి ఇబ్బందిని తొలగించడంలో భాగంగా వాటర్‌ప్లాంట్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ప్రసాద్ సార్ ఆత్మకూర్ మన గ్రోమోర్ మేనేజర్ సురేందర్ సార్ లు అదేవిధంగామస్తీపూర్ గ్రామ సర్పంచ్ సాంబశివుడు , ఉపసర్పంచ్ నరసింహులు ఎంపిటిసిబాల్ రెడ్డి,మాజీ రిటైర్డ్ అధికారి, గ్రామ పెద్దలు మనివర్ధన్ రెడ్డి, సి రాజు, కాంగ్రెస్ నాయకులు ముని, కురుమన్న పాల్గొన్నారు.పాఠశాలలో కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటన్న, ఉపాధ్యాయ బృందం పాండు , ఎస్ ప్రభాకర్, కె రామన్ గౌడ్, కే వరప్రసాద్ , నాగరాజు ,మంజుల వాణి టీచర్, వెంకటేశ్వరమ్మ టీచర్,వసంత టీచర్ కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**అమరచింత, (సింగిడి):** రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చని కాంగ్రెస్ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి అన్నారు. శుసంవర్ధక శాఖ, మత్స్య పాడి పరిశ్రమ అభివృద్ధి, క్రీడలు, యువజనశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి టిపిసిసి కల్లు గీత సెల్ రాష్ట్ర చైర్మెన్ కేశం నాగరాజు గౌడ్ ఆదేశానుసారం ఐకేపీ ఆధ్వ ర్యంలో అమరచింత మండలంలోని ఈర్లద్దిన్నె,నందిమల్ల, చంద్రఘడ్, మిట్ట నందిమల్ల గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ ఆధ్వర్యంలో ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ,జింక రవి యాదవ్, సర్పంచులు రామేశ్వరమ్మ వెంకట్ రెడ్డి ,చుక్క వెంకటమ్మ వెంకట్ రెడ్డి ,రాజేందర్ రెడ్డి ,శివ ,విజయభారతి రాము, ఉప సర్పంచ్ లు మోరెడ్డి లక్ష్మమ్మ ,పరిగి భాస్కర్ ,బోయ ఆనంద్ ,వివిధ గ్రామాల వార్డు సభ్యులు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వెంకటమ్మ,ఏపీఎం వెంకటప్ప అగ్రికల్చర్ ఏవో అరవింద్ , ఏ ఈ ఓ లు, పంచాయతీ కార్యదర్శి లు , ప్రభాకర్ రెడ్డి, శంకర్, భీమన్న మహిళా సంఘాల సభ్యులు కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు,వివిధ గ్రామాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లు,ఉప సర్పంచ్ లు,వార్డు సభ్యులు మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, సింగల్ విండో డైరెక్టర్లు,మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుని కుటుంబానికి ఆపన్న హస్తం

**హుజూర్ నగర్, (సింగిడి):** మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన శ్రీ సుంకుల ముత్తయ్య అనారోగ్య కారణాల చేత ఇటీవల మరణించడం జరిగింది.ఆయనతో పాటుగా చదువుకున్న రాజపేట గురుకుల కళాశాల 2002-2004 బ్యాచ్ కి చెందిన విద్యార్థులు తమ మిత్రుని కుటుంబానికి అండగా ఉండాలని తమ వంతుగా 25,000 రూపాయలు ముత్తయ్య సతీమణి శ్రీమతి స్వర్ణలత సోమవారం అందచేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎన్.జోతిబాబు, కే.పవన్, సోమాపంగు శ్రీను పలువురు మిత్రులు పాల్గొన్నారు.

## మీ కుటుంబానికి మేము అండగా ఉంటాం

### కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి



**హుజూర్ నగర్, (సింగిడి):** హుజూర్‌నగర్‌కు చెందిన కానిస్టేబుల్ సైదులు ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో మరణించగా కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి సోమవారం స్వయంగా వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి మీ కుటుంబానికి మేము అండగా ఉంటామని వారికి ధైర్యాన్ని ఇచ్చారు. వారి వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఎండి.అజీజ్ పాషా, సమ్మెట సుబ్బరాజు బెల్లంకొండ శీను తదితరులు పాల్గొన్నారు.

# సమిష్టి కృషితోనే.. మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యం

## 26న యాంటీ డ్రగ్స్ 3కే రన్: ఎస్పీ అశోక్ కుమార్



**జగిత్యాల ప్రతినిధి, (సింగిడి):** మాదకద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తును, సమాజ శ్రేయస్సును తీవ్రంగా దెబ్బతీస్తున్నదని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు డ్రగ్స్ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇండి యన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ)జగిత్యాల శాఖ ఆధ్వ ర్యంలో ఈనెల 26న నిర్వహించ నున్న "యాంటీ డ్రగ్స్ 3కే రన్" పోస్టర్‌ను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఆవిష్కరించారు. ఈ ఎస్పీ మాట్లాడుతు యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన అనేది ఒక్క శాఖ లేదా సంస్థబాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని అన్ని వర్గాల సమిష్టి కృషితోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుం దన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశ మని, ఈ దిశగా ఐఎంఏ జగిత్యాల చేపడు తున్న అవగాహన కార్యక్ర మాలు అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు, ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో యాంటీ డ్రగ్స్ 3కే రన్‌లో పాల్గొని మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు సహకారం అందిం చాలని కోరారు. ఈ యాంటీ డ్రగ్స్ 3కే రన్ యువతలో ఆరోగ్యకర జీవనశైలిపై చైతన్యం కల్పించడం తో పాటు మాదకద్రవ్యాల దుష్పరి ణామాలపై విస్తృత అవగాహన పెంపొందించనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ జగిత్యాల అధ్యక్షులు డా. గుడూరి హేమంత్, కార్యదర్శి డా. ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి డా. కోటగిరి సుధీర్ కుమార్, డా. గడ్డం వేణుగోపాల్ రెడ్డి, చింతా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# దొరల మెప్పుకోసమే కొప్పుల, ప్రవీణ్ కుమార్ విమర్శలు

### సంక్షేమ శాఖలో అవినీతి ఆరోపణలు నిరాధారం
### బీఆర్ఎస్ హయాంలో జరిగిన వ్యవహారాలపై సమాధానం చెప్పాలని డిమాండ్: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**కరీంనగర్, (సింగిడి):** బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు మెప్పు పొందేందుకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఆ పార్టీ నాయకుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తనపై అనవసర విమర్శలు చేస్తున్నారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొప్పుల ఈశ్వర్ అవమానానికి గురైనప్పుడు తాను సాటి దళితు డిగా అండగా నిలిచానని గుర్తు చేశారు. గురువారం రోజున కరీంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గతంలో సంక్షేమ శాఖ మంత్రిగా కొప్పుల ఈశ్వర్, గురుకులాల కార్యదర్శిగా ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ పనిచేసినప్పటికీ, ఏడాది కాలంగా శాఖ పనితీరుపై ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు. సంక్షేమ శాఖలో రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందన్న హరీశ్‌రావు ఆరోపణలను ఖండించిన మంత్రి, విద్యార్థులకు అవసరమైన వస్తువుల కొనుగోలుకు రూ.683 కోట్లతో, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా మరో రూ.500 కోట్లతో నిబంధనల ప్రకారం టెండర్లు ఖరారు చేసినట్లు తెలిపారు. మొత్తం రూ.1,183 కోట్ల విలువైన ప్రక్రియను వక్రీకరించి అవినీతి ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధిలో కొప్పుల ఈశ్వర్ విఫలమయ్యారని, డిగ్రీ కళాశాల, రెవెన్యూ డివిజన్, ఆర్టీసీ బస్సు డిపో వంటి కీలక సదుపాయాలు తీసుకురాలేకపోయారని విమర్శించారు. అందుకే 2023 అసెంబ్లీ ఎన్నికలు, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆయనను తిరస్కరించారని పేర్కొన్నారు. దోచుకోవడం, దాచుకోవడం బీఆర్ఎస్ పార్టీకి అలవాటుగా మారిందని ఆరోపించిన మంత్రి, గతంలో సంక్షేమ శాఖలో పనిచేసిన కొప్పుల ఈశ్వర్, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తమ హయాంలో జరిగిన వ్యవహారాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోందని స్పష్టం చేశారు. అలాగే, వడ్ల కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సీజన్లలో చేపట్టిన వడ్ల కొనుగోళ్లపై తన పాత్ర ఏమిటో ప్రజలకు వివరించాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ విలేకరుల సమావేశం లో అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ ,ముక్క భాస్కర్, కీర్తి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ సాంస్కృతిక ప్రతిభా స్కాలర్‌షిప్‌కు

# పారమిత విద్యార్థి ఎంపిక

### దక్షిణ భారతదేశం నుంచి నలుగురిలో ఒకరిగా, తెలంగాణ నుంచి ఏకైక విద్యార్థిగా కిట్ల చరణ్ ఘనత



**కరీంనగర్, (సింగిడి):** కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యం లోని సాంస్కృతిక వనరులు , శిక్షణ కేంద్రం (సీసీఆర్‌టీఈ) నిర్వహిం చిన సాంస్కృతిక ప్రతిభా అన్వేషణ స్కాలర్‌షిప్ పథకం-2025--26కు కరీంనగర్‌లోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల 8వ తరగతి విద్యార్థి కిట్ల చరణ్ ఎంపికై నట్లు పాఠశాల డైరెక్టర్ రష్మిత తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక స్కాలర్‌షిప్‌కు దక్షిణ భారతదేశం నుంచి కేవలం నలుగురు విద్యార్థులు మాత్రమే ఎంపిక కాగా, తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థిగా చరణ్ గుర్తింపు పొందాడు. ఈ ఎంపికతో చరణ్‌కు పట్టభద్ర విద్య పూర్తయ్యే వరకు ప్రతి సంవత్సరం జాతీయ స్థాయి స్కాలర్‌షిప్ అందనుంది. ప్రస్తుత విద్యాసంవత్సరానికి విద్యార్థికి రూ.3,500, శిక్షణ అందించిన సంగీత ఉపాధ్యాయుడికి రూ.9,000 చొప్పున మొత్తం రూ.12,500 మంజూరు కానుండగా, ఈ మొత్తం ప్రతి ఏడాది పెరుగుతుందని తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి పాఠశాలతో పాటు రాష్ట్రానికి కీర్తి తీసుకొచ్చిన చరణ్‌ను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రష్మిత, వినోద్ రావు, వి.యు.ఎమ్. ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యా యుడు గోపీకృష్ణ, సమన్వయకర్తలు రబీంద్ర పాత్రో, భవానీ, నిఖిత, సంగీత ఉపాధ్యాయుడు జితుమణి శర్మ అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# దేశానికే ఆదర్శంగా నిలిచిన ధర్మరాజు పల్లి సంఘం

### కేడీసీసీ జిల్లా అధ్యక్షులు కొండూరు రవీందర్ రావు
### ఘనంగా రజతోత్సవ వేడుకలు





**జమ్మికుంట, (సింగిడి):** రైతుల ప్రయోజనాల కోసం ఏర్పడ్డ ధర్మరాజు పల్లి ధాన్య విత్తన రైతు పరస్పర సహాయ సహకార పరపతి సంఘం దేశానికి ఆదర్శంగా నిలిచిందని సహకార ఉద్యమానికి ఊపిరి పోసిందని కే డి సి సి మాజీ అధ్యక్షులు కొండూరి రవీంద్రరావు అన్నారు. గురువారం హుజూరాబాద్ మండలం ధర్మరాజు పల్లి గ్రామంలో ధర్మరాజు పల్లి దాన్య విత్తన రైతు పరస్పర సహాయ సహకార పరపతి సంఘం రజితోత్సవ వేడుకల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ... 1999లో 150 మంది రైతులతో ఏర్పడ్డ ఈ సంఘం దినదినం అభివృద్ధి చెందుతూ 25 సంవత్సరాల లో రాష్ట్రంతో పాటు దేశంలోనే ఉత్తమ రైతు సహకార సంఘం గా ఏర్పడిందన్నారు. వరంగల్ సహా వికాస సంస్థ ప్రోత్సాహంతో ముల్కనూరు గ్రామీణ బ్యాంకు సూచనల మేరకు ఈ సంఘం తన కార్యకలా పాలను కొనసాగిస్తూ రైతుల ప్రయోజనాల కోసమే పాటుపడిందన్నారు. రైతులే యజమానులుగా సభ్యులుగా ఏర్పడ్డ ఈ సంఘం ప్రస్తుతం మూడు గోదాములు నిర్మించి రైతుల వద్ద విత్తనాలను కొనుగోలు చేస్తున్నారన్నారు. డీలర్ల ద్వారా కరీంనగర్ వరంగల్ ఆదిలాబాద్ మెదక్ నిజామాబాద్ ఖమ్మం నల్గొండ మహబూబ్నగర్ తూర్పుగోదావరి పశ్చిమగోదావరి కృష్ణా గుంటూరు విజయనగరం అనంతపూర్ తో పాటు కర్ణాటక ప్రాంతాలకు విత్తనాలను పంపిస్తుందన్నారు. ఈ సందర్భంగా 25 సంవత్స రాల లోగో విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్ర మంలో కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే ముల్కనూరు కో-ఆపరేటివ్ సంఘ అధ్యక్షులు అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి జిల్లా సహకార అధికారి ఎస్ రామానుజాచార్య సునీత జనరల్ మేనేజర్ వి ఎస్ రాజు సంఘ అధ్యక్షులు బొనగాని శ్రీనివాస్ గౌడ్ సెంట్రల్ మేనేజర్ మూగల రమణారెడ్డి సహా వికాస అధ్యక్షురాలు కాసర్ల జయప్రద ఏవో భూమిరెడ్డి సింగిల్ బెండు అధ్యక్షులు ఎడవల్లి కొండల్ రెడ్డి శ్యాంసుందర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి అనిల్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## డీర్ పార్క్‌లో వన మహోత్సవం 2026 ఘన ఆరంభం

### మొక్కల నాటిన మేయర్, ఉప మేయర్, జిల్లా ఉన్నతాధికారులు



**కరీంనగర్, (సింగిడి)::** తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని డీర్ పార్క్‌లో గురువారం వన మహోత్సవం--2026 కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం విస్తరణ లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, ఉప మేయర్ యాదగిరి సునీల్ రావు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా, పోలీసు కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ అశ్విని వంకడే, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, నగర ప్రముఖులు మరియు ప్రజాప్రతినిధులు కూడా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుకున్నారు. కార్యక్రమంలో పచ్చదనం పెంపొందిం చేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# పచ్చదనమే ప్రగతికి పునాది

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలి
### వన మహోత్సవంలో మంత్రి అడ్లూరి, కలెక్టర్ బి. సత్యప్రసాద్ పిలుపు





**ధర్మపురి, (సింగిడి):** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, మొక్కలు నాటి వాటిని చెట్లుగా పెంచాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ధర్మపురి మండ లంలోని తుమ్మెనాల గ్రామంలో గురువారం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో జగి త్యాల జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ తో కలిసి మంత్రి మొక్కలు నాటారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రకృతి సమతుల్య తను కాపాడాలంటే మొక్కల పెంపకం అత్యంత అవసరమని అన్నారు. పర్యావరణం సమతుల్యంగా ఉంటే సకాలంలో వర్షాలు కురిసి వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందని, రైతులకు మెరుగైన దిగుబడులు లభిస్తాయని పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ప్రకృతి వైపరీత్యాలకు పర్యావరణ అసమతుల్యతే ప్రధాన కారణమని అన్నారు. భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని కోరారు. జిల్లా కలెక్టర్‌బి. సత్యప్రసాద్ మాట్లా డుతూ.. హరితహారం కార్యక్రమం తెలంగాణ రాష్ట్రానికి ఒక గొప్ప పర్యావరణ ఉద్యమంగా మారింద న్నారు. మొక్కలు నాట డమే కాకుం డా వాటి సంరక్షణ పై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాలు, విద్యాసం స్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో విస్తృతంగా మొక్కలు నాటి పచ్చ దనాన్ని పెంపొందిం చాలని సూచిం చారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెరిగితేనే హరి త తెలంగాణ లక్ష్యం సాకారమవు తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కార్మికుల రిలే నిరాహార దీక్షకు మున్సిపల్ చైర్మన్ మద్దతు



**జమ్మికుంట, (సింగిడి):** మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు చేస్తున్న రిలే దీక్షలకు మద్దతు తెలిపిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఎంప్లా యిస్ , వర్కర్స్ యూనియన్ ఆదేశానుసారం మున్సి పల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ యూని యన్ అధ్యక్షుడు కొలుగురి తిరుపతి, శ్రీనివాస్, రాసపల్లి సంజీవ్, మరేపల్లి ప్రశాంత్ తదితరులు చేస్తున్న రిలే దీక్షలకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు చేస్తున్న న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని వారి న్యాయమైన డిమాండ్ల కోసం తమ సంపూర్ణ తెలుపుతున్నట్లు చైర్మన్ ఒక ప్రకట నలో తెలిపారు. వారు కోరినట్లుగా మున్సిపాలిటిలో పని చేసే జౌటో సోర్సింగ్ ఎన్ఎమ్ ఆర్ పిక్స్ పే కార్మికులను పర్మినెం ట్,2వ పిఆర్సి ప్రకటించి కనీస వేతనం 26వేలు నిర్ణయించి కేటగిరి వేతనాలు అమలు చేయాలి మున్సి పాల్ కార్మికులకు మొదటి ప్రాధాన్యతగా డబుల్ బెడ్రూ మ్స్, ఇందిరమ్మ ఇల్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి మున్సిపాల్ కార్మికులకు మరణి స్తే దహనం ఖర్చులకు 30వేలు ఇవ్వాలి మున్సిపాల్ కార్మికులకు ఒక్కపూట 8గంటల పని విధానం అమలు చేయాలి. ప్రతి సంవ త్సరం మున్సి పాల్లో పనిచేసే శానిటేషన్, వాటర్ వర్క్స్ హరితహారం, ఎలక్ట్రిషన్, డ్రైవర్లకు రక్షణ పరికరాలు అందజేయాలి. మున్సిపాల్ పరిధిలో పనిచేసే డ్రైవర్లకు, జవాన్లకు మిగతా వారి వలె డ్రైవర్స్ కేటగిరి వేతనం ఇవ్వాలి అని తమ వంతు సహాయ సహకా రాలు ఉం టాయని ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్తా మని తెలిపారు. కార్యక్రమం లో కౌన్సిలర్స్ కొలుగురిసురేష్, ఫిరోజ్,మంద రాజేష్,శంకర్ పాల్గొన్నారు.

### టీటీడీ ఆలయ నిర్మాణానికి

# ప్రత్యేక చొరవ చూపాలి

### ఉత్తర తెలంగాణ భక్తుల అవసరాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధిపై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుతో వెలిచాల రాజేందర్‌రావు చర్చ



**కరీంనగర్, (సింగిడి):** కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు బుధవారం హైదరాబాద్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బీఆర్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కరీంనగర్‌లో నిర్మాణంలో ఉన్న టీటీడీ ఆలయం అభి వృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై విస్తృతంగా చర్చించారు. ఆలయాన్ని ఉత్తర తెలంగాణ ప్రాంత భక్తులకు మరింత చేరువయ్యేలా దేదీప్య మానంగా నిర్మించాలని రాజేందర్‌రావు కోరారు. ఆలయ ప్రాంగణ అభివృద్ధి, పార్కింగ్ విస్తరణ, పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు, భక్తులకు మెరుగైన దర్శన ఏర్పాట్లు, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ, పరిసరాల సుందరీకరణ వంటి అంశాలను ఆయన టీటీడీ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. కరీంనగర్ టీటీడీ ఆలయ నిర్మాణం, అభివృద్ధికి అవసర మైన చర్యలపై సానుకూలంగా స్పందిం చిన బీఆర్ నాయుడు, టీటీడీ తరఫున ప్రత్యేక చొరవతో ముందుకు సాగుతా మని హామీ ఇచ్చినట్లు రాజేందర్ రావు తెలిపారు. భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు టీటీడీ యాజ మాన్యం, ప్రజాప్రతినిధులు, అధికా రులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్ టీటీడీ ఆలయం ఉత్తర తెలం గాణలో ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలని ఆకాం క్షిస్తూ, ఆలయ అభివృద్ధికి సహకరి స్తున్న టీటీడీ ఛైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి గడపకు చేర్చాలి

### మానకొండూరులో 'జనకల్యాణ్'లో ఓబీసీ మోర్చా నాయకుల పిలుపు
### ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అడిచర్ల రాజు



**కరీంనగర్ , (సింగిడి):** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేసి, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అడిచర్ల రాజు, జిల్లా సమన్వయకర్త ఆకుల రాజేందర్ పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనకు 12 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా నిర్వహిస్తున్న 'జనకల్యాణ్' కార్యక్రమంలో భాగంగా మానకొండూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన వృత్తి కళాకారులు, ఓబీసీ వర్గాల అభివృద్ధికి ఎంతో ఉపయోగకర మైన పథక మని పేర్కొంటూ, అర్హులందరికీ దాని ప్రయోజ నాలు అందేలా కృషి చేయాలని సూచించారు. ఓబీసీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని వారు తెలిపారు. అలాగే పర్యావరణ పరిరక్షణ,ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంపొందించాలని, రాబోయే పక్షం రోజుల పాటు విస్తృత స్థాయిలో వృక్షారోపణ కార్యక్రమా లు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులకు కలిగే ప్రయోజ నాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అసెంబ్లీ బాధ్యుడు మియాపూర్ లక్ష్మాచారి, మండల సమన్వయకర్తలు గోరిశెట్టి రమేష్, అంబటి స్వామి, వెంగల ప్రవీణ్, నెట్టు అంజయ్యతో పాటు పలువురు భారతీయ జనతా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక నిల్వలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

### రెండు ఇసుక డంపులు సీజ్, 50 ట్రాక్టర్ల లోడుల ఇసుక స్వాధీనం, అక్రమ మాఫియాపై కఠిన చర్యలు: కమిషనర్ గౌష్ ఆలం



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవా ణా, నిల్వలను అరికట్టేందుకు చేపడు తున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు కొత్తపల్లి మండలంలో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వ హిం చారు. కాజీపూర్ గ్రామ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన రెండు భారీ ఇసుక డంపులను గుర్తించి సీజ్ చేశారు. వాటిలో సుమారు 50 ట్రాక్టర్ల లోడుల ఇసుక ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను తదుపరి చట్టపరమైన చర్యల కోసం కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడు తూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకం, నిల్వ, రవాణా వంటి అక్రమ కార్యకలా పాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణాపై నిరంతర నిఘా కొనసాగుతోందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై గనుల చట్టాలు, ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పవన్ రూపంలో తెలంగాణలోకి బీజేపీ పాగా..

### తెలంగాణ అస్తిత్వం, సంస్కృతిపై కుట్రలను ప్రజలు గుర్తించాలని పిలుపు
### మహిళలకు 33 శాతం రాజకీయ ప్రాతినిధ్యం ఇస్తామని హామీ: టీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్‌లో నిర్వహించిన 'తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు సాధన' చర్చావేదిక ముగింపు సందర్భంగా టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత మాట్లాడుతూ, తెలంగాణలో పాగా వేయడానికి బీజేపీ వివిధ రూపాల్లో ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పవన్ కళ్యాణ్ వెనుక బీజేపీ హస్తం ఉందనే అనుమానం వ్యక్తం చేశారు. నేరుగా పోటీ చేస్తే ఆశించిన ఫలితాలు రావని భావించి, ఆయనను ముందుకు తెస్తోందన్నారు. తెలంగాణ ప్రజలు సినిమా నటులను వినోదానికి మాత్రమే పరిమితం చేయాలని, రాజకీయ నాయకులుగా చూడవద్దని యువతకు సూచించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, అస్తిత్వాన్ని దెబ్బతీయాలనే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రానికి ముప్పు వాటిల్లితే తెలంగాణ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే తెలంగాణ గ్రామదేవతల ఆరాధన వంటి స్థానిక సంప్రదాయాలకు భంగం కలిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రతి ఒక్కరూ తమ ఇష్టదైవాన్ని ఆరాధించే స్వేచ్ఛ ఉన్న సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టీఆర్ఎస్‌లో కోటరీ రాజకీయా లకు స్థానం ఉండదని స్పష్టం చేసిన కవిత, ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉండే నాయకత్వాన్ని అందిస్తామని చెప్పారు. ఉద్యమంలో పనిచేసిన వారికి సముచిత గౌరవం, అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల ఖర్చులు తగ్గించే రాజకీయాల అవసరాన్ని ప్రస్తావిస్తూ, బీసీలు, ఎస్సీలు సాధారణ స్థానాల్లోనూ పోటీ చేసే పరిస్థితి రావాలని అభిప్రాయపడ్డారు. మహిళలకు తమ పార్టీ నుంచి 33 శాతం టికెట్లు కేటాయిస్తామని, భవిష్యత్తులో దానిని 50 శాతానికి పెంచే దిశగా కృషి చేస్తామని తెలిపారు. ఉచిత విద్య, వైద్యం అంశాలపై సమగ్ర అధ్యయనం అనంతరమే తమ పార్టీ హామీలు ప్రకటించిందని చెప్పారు. మేధావులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఉద్యమకారులు సహా అన్ని వర్గాల భాగస్వామ్యంతో ప్రజాకేంద్రిత రాజకీయాలు చేపడతామని పేర్కొన్నారు. తెలంగాణ ద్రోహులను సమర్థించే వారిని వ్యతిరేకించాలి, కరీంనగర్ జాలిగుట్టలో ఉద్యమకారులకు 250 గజాల చొప్పున స్థల పట్టాలు ఇవ్వాలి, అలాగే కరీంనగర్ పట్టణంలో ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన పెంపే లక్ష్యం

### 20న కరీంనగర్‌లో ఉచిత సైబర్ భద్రత అవగాహన సదస్సు
### టీఎస్జీఓస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి



**కరీంనగర్, (సింగిడి):** స్కిల్‌ఫోర్జ్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 20న కరీంనగర్ గణేష్‌నగర్‌లోని అదితి బ్యాంక్వెట్ హాల్‌లో నిర్వహించనున్న సైబర్ భద్రత అవగాహన సదస్సు పోస్టర్‌ను టీఎస్జీఓస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. మారం జగదీశ్వర్ మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో సైబర్ నేరాల నుంచి రక్షణ పొందేందుకు ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని తెలిపారు. "ఒక్కక్లిక్ చేసే ముందు ఒక్కసారి ఆలోచించాలి" అనే జాగ్రత్తను అలవాటు చేసుకోవాలని సూచించారు. దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, సైబర్ మోసగాళ్లు మొబైల్ ఫోన్ల ద్వారా ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారని, ఒకసారి ఉపయోగించే రహస్య సంకేతాలు (ఓటీపీలు), నకిలీ లింకులు, డిజిటల్ చెల్లింపుల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సైబర్ నేరాలను ఎదుర్కొనేందుకు అవగాహనే ప్రధాన ఆయుధమని పేర్కొంటూ, యువత, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు ఈ ఉచిత సదస్సుకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్, రాగి , నిర్వాహకులు పాల్గొన్నారు.

## నా అందాలు

# దాచేసుకున్నా

నటి కృతి సనన్



గ్లామర్ ఇండస్ట్రీలో సక్సెస్ వేవ్‌ను రైడ్ చేయడం ఒక ఎత్తయితే, పర్సనల్ లైఫ్‌ను బ్యాలెన్స్ చేయడం మరో ఎత్తు. ముఖ్యంగా ముప్పై ఏళ్లు దాటుతున్నాయంటే చాలు.. సొసైటీ నుంచి వచ్చే ప్రెజర్, పెళ్లి – పిల్లల డెడ్‌లైన్స్ హీరోయిన్లను కాస్త టెన్షన్ పెడుతుంటాయి. కానీ ఆ రూల్స్ అన్నిటికీ చెక్ పెడుతూ బాలీవుడ్ మోస్ట్ హ్యాపెనింగ్ బ్యూటీ కృతి సనన్ ఒక సంచలన విషయాన్ని తీసుకుంది. తాను కెరీర్ ఫుల్ పీక్స్‌లో ఉన్నప్పుడే 'ఎగ్ ఫ్రీజింగ్' చేయించుకున్నానంటూ బోల్డ్ స్టేట్‌మెంట్ ఇచ్చింది.

ఇటీవల 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' పాడ్‌కాస్ట్‌లో హోస్ట్ కరిష్మాతో మాట్లాడిన కృతి ఈ విషయాన్ని బయటపెట్టింది. కృతిసనన్ తనకు నేషనల్ అవార్డు తెచ్చిపెట్టిన 'మిమి' సినిమా షూటింగ్ టైమ్‌లోనే ఈ డెసిషన్ తీసుకున్నట్లు చెప్పింది. ఈ సినిమాలోని క్యారెక్టర్ కోసం చాలా బరువు పెరగాల్సి వచ్చిందట. దాంతో ఆ టైమ్‌లోనే ఎగ్ ఫ్రీజింగ్ ప్రాసెస్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిపింది. ఈ ప్రక్రియ వల్ల బాడీలో హార్మోనల్ చేంజెస్ వచ్చి శరీరం కాస్త ఉబ్బడం కామన్. ఎలాగూ సినిమా కోసం వెయిట్ గేన్ అవ్వాలి కాబట్టి ఆ రెండు నెలల బ్రేక్‌ను పర్ఫెక్ట్‌గా వాడుకుంటూ సైలెంట్‌గా ఈ మెడికల్ ప్రొసీజర్‌ను ఫినిష్ చేసినట్లు కృతిసనన్ తెలిపింది. ఆ సమయంలో మూడ్ స్వింగ్స్, ఫిజికల్ అండ్ ఎమోషనల్ చేంజెస్ ఫేస్ చేశానని కృతి చాలా ఓపెన్‌గా ఒప్పుకుంది. ఒక ప్రెగ్నెంట్ ఉమెన్ ఎలాంటి రోలర్ కోస్టర్ రైడ్‌ను ఎక్స్ పీరియన్స్ చేస్తుందో, తాను కూడా దాదాపు అలాంటి ఒడిదుడుకులే చూశానని.. కానీ ఇప్పుడు మాత్రం మైండ్ చాలా పీస్‌ఫుల్‌గా ఉందంటూ హ్యాపీగా చెప్పుకొచ్చింది. నిజానికి ఇండియన్ స్క్రీన్ పై ఈ మోడ్రన్ బాట పట్టిన ఫస్ట్ సెలబ్రిటీ కృతి కాదు. గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా తన థర్టీస్ స్టార్టింగ్‌లోనే ఎగ్స్ ఫ్రీజ్ చేసుకోగా.. ప్రొడ్యూసర్ ఏక్తా కపూర్, మోనా సింగ్, రిచా చద్దా వంటి వారు కూడా ఇదే రూట్ ఎంచుకున్నారు.

singidinews@gmail.com

## హైదరాబాద్‌లో శరవేగంగా

# చిరు మూవీ షూట్




చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. మెగా158 వర్కింగ్ టైటిల్ గా ప్రచారంలో ఉన్న దీనిపై టీమ్ అప్‌డేట్ పంచుకుంది. షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోందని తెలిపింది. మును పెన్నడూ చూడని భారీ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయని.. చిరును కొత్త కోణంలో చూస్తారని వెల్లడించింది. రామ్–లక్ష్మణ్ మాస్టర్స్ సారథ్యంలో భారీ యాక్షన్ సన్నివేశాలు షూట్ చేస్తున్నారు. సినిమాకు ఈ సీన్స్ హైలైట్‌గా నిలవనున్నాయి. చిరు ఇందులో రిస్క్‌తో కూడిన స్టంట్స్ చేస్తున్నారని.. త్వరలో దీని టైటిల్ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు టీమ్ వెల్లడించింది. 'వాల్తేర్ వీరయ్య' విజయం తర్వాత చిరంజీవి – బాబీ కాంబోలో ఈ చిత్రం రానుండడంతో అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే పొల్లాచ్చిలో ఓ కీలక షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. అక్కడ కొంత టాకీతో పాటు కొన్ని యాక్షన్ సీక్వెన్స్ కూడా తీసినట్లు ప్రచార చిత్రాన్ని కూడా విడుదల చేశారు.

సిన్మా సింగిడి Cinma Singidi

బుధవారం
8-7-2026

## చిత్రసీమలో ప్రతిభ ఉంటేనే

# రాణిస్తారు

రవి శంకర్



టాలీవుడ్‌లో నెపోటిజం అంశంపై ఎప్పుడూ ఏదో ఒక చర్చ నడుస్తూనే ఉంటుంది. తాజాగా ప్రముఖ నిర్మాణ సంస్థ 'మైత్రీ మూవీ మేకర్స్' అధినేతల్లో ఒకరైన వై. రవిశంకర్ ఈ విషయంపై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.
ఇటీవల జరిగిన 'రాజా ది రాజా' చిత్ర టీజర్ లాంచ్ ఈవెంట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్ర హీరో రిత్విక్‌ను ఉద్దేశించి వేదికపై రవిశంకర్ మాట్లాడుతూ.. సినిమా పరిశ్రమలో రాణించాలంటే బ్యాక్‌గ్రౌండ్ కంటే సొంత ప్రతిభే ముఖ్యమని స్పష్టం చేశారు. సినీ పరిశ్రమలోకి ఎవరైనా గోల్డెన్ స్పూన్ లేదా డైమండ్ స్పూన్‌తో పుట్టి రావచ్చు కానీ ఇక్కడ అవేమీ పని చేయవని, మిమ్మల్ని నిలబెట్టేది కేవలం మీలో ఉన్న ప్రతిభ మాత్రమేనని ఆయన నొక్కి చెప్పారు. మన వెనుక ఎవరి అండా లేదని భావించి కష్టపడి ముందుకు సాగినప్పుడే నిజమైన విజయం దక్కుతుందంటూ హీరో రిత్విక్‌ను ప్రోత్సహిస్తూ ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రవిశంకర్ చేసిన ఈ కామెంట్స్ సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. నరేష్, వైశాఖ ధీమన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి మార్క్ కె రాబిన్ సంగీతం అందిస్తున్నారు.

# Krithi Shetty



## అనిల్ రావిపూడి

# మల్టీస్టారర్

## షూటింగ్‌లో చేరిన వెంకటేశ్

టాలీవుడ్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న మల్టీస్టారర్ చిత్రాల్లో దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న కొత్త సినిమా ఒకటి. విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్ తొలిసారి కలిసి నటిస్తున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్, మాస్ ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల కల్యాణ్ రామ్‌పై ప్రత్యేక గీతాన్ని చిత్రీకరించిన చిత్రబృందం, ఇప్పుడు తదుపరి కీలక షెడ్యూల్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించింది. ఈ షెడ్యూల్‌లో విక్టరీ వెంకటేష్ కూడా సెట్స్‌లోకి అడుగుపెట్టడంతో షూటింగ్ మరింత జోరందుకుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌లో సినిమా చిత్రీకరణ జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో వెంకటేష్, కల్యాణ్ రామ్‌తో పాటు హీరోయిన్లు కీర్తి సురేష్, కృతి శెట్టి పాల్గొంటున్నారు.



## సత్లుజ్ మూవీని

# చూడాలి..చూపించాలి

## ఎక్స్ వేదికగా దర్శకుడు రమ్‌గోపాల్ వర్మ

ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసిన చిత్రం 'సత్లుజ్'. సెన్సార్ సమస్యల కారణంగా నేరుగా ఓటీటీలో విడుదల చేయగా.. ఆ తర్వాత దాన్ని తొలగించారు. ఈ మూవీని చూసిన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. 'సత్లుజ్' మూవీ చూశా. ఇది సినిమా కాదు. ఎప్పటికీ నయం కానీ బలమైన గాయం. మన చరిత్రలోని చీకటి అధ్యాయాన్ని గుర్తు చేస్తుంది. దిల్జిత్ దొసాంజే గుండెలు బాదుకునేలా నటించలేదు. మనఃసాక్షికి అనుగుణంగా ఎంతో నిశ్శబ్దంగా చేసుకుంటూ వెళ్లాడు. అర్జున్ రామ్‌పాల్ నటన అదనపు బలాన్ని ఇచ్చింది. నేరాల్లో వ్యవస్థలు భాగమైన తీరును వాస్తవికతతో చూపించారు. ఈ సినిమాను సంచలనం చేయడం కన్నా.. ఒక ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దారు. తెరపై అధికారిక ఫైళ్లు, దహన సంస్కారాల వివరాలు, గుసగుస సంభాషణలు వంటివి ఈ కథలోని తీవ్రతను తెలియజేశాయి. స్వలాభం కన్నా.. సత్యాన్ని వెల్లడించేలా తీర్చిదిద్దడంతో ఇది మరింత బలంగా తెరపై ఆవిష్కృతమైందని రామ్ అన్నారు. ప్రజాస్వామ్యం తన పౌరులనే కబళించి, అందుకు సాక్ష్యాలు లేకుండా ఎలా తుడిచేస్తుందో సినిమాలో తెలియజేయడం సాధారణ విషయం కాదు. ఈ విషయంలో చిత్ర బృందం తనవంతు బాధ్యతను చక్కగా పూర్తి చేసింది. ఇదే నిజమైన కళ.



# డిఫరెంట్ లుక్‌లో డ్రాగన్...ఎన్టీఆర్

NTR

ఎన్టీఆర్, సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ డ్రాగన్. ఈ సినిమాలోని తన పాత్ర కోసం తారక్ ఎన్నడూ లేని విధంగా భారీగా బరువు తగ్గారు. ఆమధ్య బయటకు వచ్చిన తారక్ అల్ట్రా స్లిమ్ మేకోవర్ చూసి అభిమానులు ఒకింత షాక్‌కు గురయ్యారు. ఒక సినిమా కోసం ఇంతలా బరువు తగ్గాలా అని కంగారుపడుతూ, తమ హీరో లుక్ చూసి అభిమానులతో పాటు సగటు సినీ ప్రేక్షకులు కూడా తీవ్ర ఆందోళన చెందారు. అయితే, ఎన్టీ ఆర్ బర్త్‌డే కానుకగా విడుదలైన 'డ్రాగన్' గ్లింప్స్ చూసి ఫ్యాన్స్ పిచ్చెక్కిపోయినప్పటికీ, ఆ లుక్ వెనుక ఉన్న తారక్‌కష్టం వారిని ఇబ్బంది పెడుతూనే వచ్చింది. ఇందులో 'లూగర్' అనే పవర్ ఫుల్ క్యారెక్టర్ లుక్ కోసం ఎన్టీఆర్ తన ప్రాణం పెట్టి పనిచేశారు.
సినిమా కోసం, తను నమ్మిన పాత్ర కోసం తారక్ ఎంతటి రిస్క్ అయినా తీసుకోగలడు, ఏ స్థాయికైనా వెళ్లగలడు అని తన అంకిత భావంతో మరోసారి నిరూపించారు. క్యారెక్టర్‌లోని ఇంటెన్సిటీ చూశాక ప్రశాంత్ నీల్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విధ్వంసం సృష్టించబోతున్నాడో అని అందరిలో ఆసక్తి రెట్టింపయింది.



Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737